www.andhrajyothy.com
పేజీలు: 14
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 147
గురువారం | 11-9-2025
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: చవితి మ.12:46 తదుపరి పంచమి, నక్షత్రం: అశ్విని మ.1:58 తదుపరి భరణి, వర్జ్యం: ఉ.10:18-11:46, రా.10:46-రా.12:14, దుర్ముహూర్తం: ఉ.10:09-10:58, మ.3:02-3:50, అమృతఘడియలు: ఉ.7:23-8:51, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:06, సూర్యాస్తమయం: 6:17
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అనంత సభలో చంద్రబాబు, పవన్, మాధవ్, పల్లా అభివాదం

తమ్ముళ్ల స్పీడు.. జనసైనికుల జోరు.. కమలదళం హోరు..

ఏపీ సూపర్ హిట్!

- సూపర్ హిట్ సభను రాజకీయాల కోసమో.. ఓట్ల కోసమో పెట్టలేదు. ఇప్పుడు ఎన్నికలు కూడా లేవు. మాది బాధ్యత గల ప్రభుత్వం.. ఇచ్చిన మాట నెరవేర్చిన ప్రభుత్వమని చెప్పడానికే ఈ సభ ఏర్పాటు చేశాం.
- కూటమి పాలనలో సంక్షేమం సూపర్ హిట్.. అభివృద్ధి సూపర్ హిట్.. వైకుంఠపాళి రాజకీయాలు వద్దు.. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించండి.. రాష్ట్రాన్ని అన్నింటా సూపర్ హిట్ చేద్దాం.
- రాజకీయాల్లో ఓనమాలు తెలియని వాళ్లు ప్రతిపక్ష హోదా కావాలని అడుగుతున్నారు. ఆ హోదా ఇచ్చేది ప్రజలు. నాకు ముఖ్యమంత్రి పదవీ వాళ్లే ఇచ్చారు.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దూసుకుపోతోంది

- జాతీయ సగటును మించి రెండంకెల వృద్ధి రేటు
- ఫేక్ రాజకీయాలకు కాలం చెల్లు
- రప్పా రప్పా అంటే బెండు తీస్తాం
- ఇక్కడున్నది సీబీఎన్.. పవన్
- సీఎం అంటే కామన్ మ్యాన్
- ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సింది ప్రజలు
- నాకు సీఎం పదవి వారే ఇచ్చారు
- వైసీపీ నేతలది ధృతరాష్ట్ర కౌగిలి
- సిద్ధం సిద్ధం అని ఎగిరిపడ్డారు
- ఇప్పుడు అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అంటే తోకముడుస్తున్నారు
- 'అనంత' సభలో చంద్రబాబు ఫైర్



అనంతపురంలో జరిగిన సభకు హాజరైన జనం.. సూపర్ సిక్స్ జెండాతో చంద్రబాబు

ఎన్నికల్లో చెప్పాం.. ఎన్ని కష్టాలున్నా చేస్తాం

- పేద, మధ్యతరగతి జీవితాలను మార్చేందుకే సూపర్ సిక్స్ హామీలు
- వాటిని అవహేళన చేశారు.. పించన్ల పెంపు అసాధ్యమన్నారు
- పిల్లలందరికీ 'తల్లికి వందనం' అంటే ట్రోల్ చేశారు
- మెగా డీఎస్సీ కాదన్నారు.. ఉచిత బస్సు కదలదన్నారు
- అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపించాం: చంద్రబాబు

అనంతపురం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోపే తెలుగు తమ్ముళ్ల స్పీడు.. జన సైనికుల జోరు.. కమల దళ ఉత్సాహం కలగలసి రాష్ట్రం అన్ని కోణాల్లో దూసుకుపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విధ్వంసకారులకు చెక్ పెడుతూ రాష్ట్రం రెండంకెల వృద్ధి రేటు సాధించిందని తెలిపారు. అనంతపురంలో బుధవారం జరిగిన 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' భారీ బహిరంగస భలో ఆయన ప్రసంగించారు. గత పాలకుల అరాచకాలను ప్రస్తావిస్తూ.. ఫేక్ రాజకీయాలకు కాలం చెల్లిందని, రప్పా రప్పా బ్యాచ్‌కు

మిగతా 13వ పేజీలో...

త్రికరణ శుద్ధితో పని చేస్తున్నాం



- రాష్ట్రం బాగు పడాలన్నదే కూటమి ఆకాంక్ష
- పెట్టుబడుల రాకతో సీమ యువతకు ఉపాధి
- పారిశ్రామికీకరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- 2047 నాటికి దేశంలో ఏపీని నంబర్ వన్ చేస్తాం
- 'సూపర్ సిక్స్' సభలో డిప్యూటీ సీఎం పవన్

13

అందరి జీవితాల్లో వెలుగులు నింపుతాం



- మోదీ సహకారం.. బాబు అనుభవంతో పురోభివృద్ధి
- వైసీపీ ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని కూటమి నిర్మిస్తోంది
- సీమకు జలాలు, అద్భుతమైన అమరావతి మా లక్ష్యాలు
- రెండేళ్లలో పోలవరం నిర్మాణం పూర్తి చేస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి

ఆటోవాలాకు దసరా కానుక

ప్రతి ఒక్కరికీ ఏటా 15 వేలు

ఎన్ని ఇబ్బందులున్నా అమలుచేస్తాం: సీఎం

ప్రతి ఒక్కరికీ వార్నింగ్ ఇస్తున్నా!



- మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనవద్దు
- మేమొస్తే వాటిని రద్దు చేస్తాం.. జగన్ విధ్వంసకర హెచ్చరికలు
- చంద్రబాబు, పవన్, అచ్చెన్న బావిలో దూకి చావాలని దూషణలు

14

అది పింక్ డైమండ్ కాదు.. కెంపు



బాల్యంలో మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ ధరించిన హారం.. తిరుమల శ్రీవారికి అలంకరించిన హారం ఇదే

- 1945లో మైసూరు మహారాజు శ్రీవారికి బహూకరించారు
- అందులో ఉన్నది కెంపులు, కొన్ని రకాల రత్నాలు మాత్రమే
- ఆధారాలతో తేల్చిన ఏఎస్ఐ

3

రాజీపడని జాతీయవాదిని

- గవర్నర్‌గా జ్ఞాపకాలు పదిలం: రాధాకృష్ణన్
- ఉప రాష్ట్రపతిగా రేపు ప్రమాణ స్వీకారం
- రాధాకృష్ణన్‌ను కలిసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి



రాధాకృష్ణన్‌కు స్వీటు తినిపిస్తున్న అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధా కృష్ణన్.. తనను తాను 'రాజీపడని జాతీయవాది'గా పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 13నెలల పదవీ కాలం.. తన ప్రజా జీవితంలో అత్యంత సంతోషకర మైన దశగా మిగిలిపోతుందని, ఆ జ్ఞాపకాలు తన తోనే ఉంటాయని అన్నారు. 67 ఏళ్ల రాధా కృష్ణన్ మంగళవారం నాటి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిప క్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని 152ఓట్ల తేడాతో

మిగతా 2వ పేజీలో...

నిష్పక్షపాతంగా వ్యవహరించండి

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ విజ్ఞప్తి

భారత్, అమెరికా సహజ భాగస్వాములన్న ప్రధాని వ్యాఖ్యలపై ఎద్దేవా

ఆందోళన వద్దు

ఏపీ వాసులు అందరినీ సురక్షితంగా వెనక్కి తీసుకొస్తాం

- నేపాల్‌లో చిక్కుకున్న బాధితులకు మంత్రి లోకేశ్ భరోసా
- అనంతపురం ప్రయాణం రద్దు చేసుకున్న మంత్రి
- ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్టీజీఎస్ సెంటర్‌లోనే
- 2 గంటలకోసారి వారందరి క్షేమ సమాచారం వాకబు
- నేటి మధ్యాహ్నం నుంచి తరలింపు ప్రక్రియ ప్రారంభం

12



నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారితో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పక్కన హోంమంత్రి అనిత

నేపాల్ తాత్కాలిక అధినేతగా సుశీల కర్కి!

ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్‌ను ఎంపిక చేసుకున్న ఆందోళనకారులు

- దేశవ్యాప్తంగా భద్రత సైన్యం చేతుల్లోకి
- ఆందోళనకారులు చర్చలకు రావాలని అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ పిలుపు
- రాజ్యాంగం మార్చాలి.. నేతల ఆస్తుల్ని జాతీయం చేయాలి: ఆందోళనకారులు



కాఠ్మండూ, సెప్టెంబరు 10: యువత ఆందోళనలతో అట్టుడికిన నేపాల్‌లో పరి స్థితులు కుదుటపడుతున్నాయి. ప్రధాని కేపీ శర్మ ఓలి నేతృత్వంలోని ప్రభు త్వాన్ని గద్దెదింపిన ఆందోళనకారులు.. ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కిని తాత్కాలిక

మిగతా 2వ పేజీలో...

కలుషిత సెలైన్ కాటేసిందా!?

తురకపాలెంలో దాని ద్వారానే ప్రబలిన ఇన్‌ఫెక్షన్లు!

- జ్వర బాధితులకు తొలుత ఆర్ఎంపీ దగ్గరే చికిత్స
- అనంతరం రోగం ముదిరి ఆస్పత్రుల పాలై మృతి
- ఆర్ఎంపీ క్లినిక్‌లో భారీగా యాంటిబయాటిక్‌లు
- క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- ఇటీవల చెన్నైలో కలుషిత సెలైన్‌తో ఇదే తరహా ఇన్‌ఫెక్షన్లు
- మిస్టరీ మరణాలకు ఇదే కారణం కావొచ్చనే అనుమానం

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య రంగానికి, అధికార యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేసిన గుంటూరు జిల్లా తురకపాలెం వరుస మరణాలకు స్థానిక ఆర్ ఎంపీ చేసిన నిర్వాకమే కారణమా? కలుషిత సెలైన్ వినియోగం వల్లే భారీగా ఇన్‌ఫెక్షన్లు ప్రబలాయా? జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు అదే అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. తురకపాలెంలో సంభవించిన మిస్టరీ మరణాలపై లోతుగా అధ్యయనం చేస్తున్న జాతీయ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ దర్యాప్తు బృందాలు.. ఆర్ఎంపీ క్లినిక్‌ను పరిశీలించ డంతో కీలక సమాచారం వెలుగుచూసింది. గ్రామంలో

మిగతా 14వ పేజీలో...



మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా

- వాణిజ్య చర్చలపై సంప్రదింపులు జరుగుతున్నాయ్
- ట్రూత్ సోషల్‌లో డొనాల్డ్ ట్రంప్ పోస్టులు
- ట్రంప్ పోస్టులపై మోదీ సానుకూల స్పందన
- భారత్-అమెరికా సహజ భాగస్వాములు: మోదీ

న్యూఢిల్లీ, వాషింగ్టన్, సెప్టెంబరు 10: భారీ సుంకాల వేళ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరి క్రమంగా మారుతోంది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య చర్చల్లో అడ్డంకులను తొలగించడానికి తన యంత్రాంగం సంప్రదింపులు జరుపుతోందంటూ ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్ట్ పెట్టారు. దీనిపై రాబోయే వారాల్లో తన స్నేహితుడైన ప్రధాని మోదీతో మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తు న్నానంటూ పోస్ట్‌లో ప్రస్తావించారు. చర్చలు రెండు దేశాలకూ సత్ఫలితాలిస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ట్రంప్ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌పై మోదీ స్పందించారు. భారత్-అ మెరికా సన్నిహిత స్నేహితులని, సహజ భాగస్వా ములని ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. వాణిజ్య చర్చలు త్వరగా ముగించేందుకు రెండు దేశాలు యత్నిస్తున్నాయని చెప్పారు. తాను కూడా

మిగతా 2వ పేజీలో...

భారత్-చైనాలపై 100% సుంకాలు వేయండి

- ఈయూను కోరిన డొనాల్డ్ ట్రంప్
- భారత్‌తో అసంబద్ధమైన వాణిజ్యం కోరుకోం
- మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేసిన పీటర్ నవారో

2

రాజీపడని జాతీయవాదిని

(మొదటిపేజీ తరువాయి)

ఓడించిన సంగతి తెలిసిందే. ఆయన ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడానికి ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ నెల 12న రాష్ట్రపతి ముర్ము రాధాకృష్ణన్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తారని అధికారులు తెలిపారు. ఇందుకోసం రాష్ట్రపతిభవన్‌లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా, ఉపరాష్ట్రపతి రాధా కృష్ణన్‌తో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుధవారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో వీరి భేటీ జరిగింది. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా రాధాకృష్ణన్‌కు.. సుదర్శన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించండి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ పార్టీ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. రాజ్యసభ చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరింది. ఈమేరకు ఆ పార్టీ జనరల్ సెక్రటరీ, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేష్ బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ సమయంలో దేశ ప్రథమ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విలువైన మాటలను ఆయన గుర్తు చేశారు. 1952 మే 16న రాజ్యసభ తొలి సమావేశంలో సర్వేపల్లి మాట్లాడుతూ.. "నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు.. సభ సంప్రదాయాలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఉన్నత విలువలు కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది" అని పేర్కొన్నారని జైరాం వివరించారు. ఇలా తాను చెప్పినదాన్ని సర్వేపల్లి తుచ తప్పకుండా ఆచరించారని గుర్తుచేశారు. కాగా భారత్, అమెరికా సహజ భాగస్వాములని మోదీ పేర్కొనడంపై బుధవారం కాంగ్రెస్ పార్టీ స్పందించింది. అదే నిజమైతే ట్రంప్ తాను వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించి భారత్-పాకిస్థాన్‌లను కాల్పుల విరమణకు ఒప్పించానని 35 సందర్భాల్లో ఎలా పేర్కొన్నారని ప్రశ్నించింది. ఇది కూడా సహజ భాగస్వామ్యమేనా.. అని ఎద్దేవా చేసింది.

ఉపరాష్ట్రపతి భద్రత బాధ్యత సీఆర్‌పీఎఫ్‌కు

» ముప్పు పొంచి ఉందన్న హెచ్చరికలతో చర్యలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ఉపరాష్ట్రపతి భద్రత బాధ్యతను కేంద్ర రిజర్వు పోలీస్ దళం (సీఆర్‌పీఎఫ్)కు అప్పగించారు. ఇకపై సీఆర్‌పీఎఫ్ సాయుధ దళాలు ఉపరాష్ట్రపతికి జెడ్ ప్లస్ భద్రతను కల్పించనున్నాయి. ఈ విషయంలో కేంద్ర సాయుధ పోలీసు దళానికి (సీఏపీఎఫ్) కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఉపరాష్ట్రపతికి దాడుల ముప్పు పొంచి ఉందన్న నిఘా విభాగం హెచ్చరికల నేపథ్యంలో సెక్యూరిటీ బాధ్యతను ఢిల్లీ పోలీసుల నుంచి సీఆర్‌పీఎఫ్‌కు బదలాయించారు. బుధవారం నుంచే సీఆర్‌పీఎఫ్ బాధ్యత తీసుకుంటుందని సమాచారం. ఇకపై 24 గంటలూ ఉపరాష్ట్రపతికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన సీఆర్‌పీఎఫ్ కమాండోలు జడ్ ప్లస్ రక్షణ కల్పిస్తారు. జెడ్ ప్లస్ సెక్యూరిటీలో 55 మందికి పైగా సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పాటు ఎస్కార్ట్, సహకార సిబ్బంది కూడా ఉంటారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికలోనూ ఓట్ల చోరీ: రాహుల్

న్యూఢిల్లీ/రాయ్‌బరేలీ, సెప్టెంబరు 10: ఉపరాష్ట్రపతి ఎన్నికలో కూడా ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఎన్‌డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు అనుకూలంగా 'ఇండీ' కూటమి నుంచి క్రాస్ ఓటింగ్ జరగడంపై బుధవారం రాయ్‌బరేలీలో ఓ ఆంగ్ల చానల్ ప్రతినిధి ఆయన్ను ప్రశ్నించగా.. బీజేపీ దేశవ్యాప్తంగా ఓట్లు దొంగిలిస్తోందని ఆయన బదులిచ్చారు. ఓట్ల దొంగ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మరోవైపు, ఉపరాష్ట్రపతి ఎన్నికలో 'ఇండీ' కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి అనుకున్నదాని కంటే తక్కువ ఓట్లు రావడంపై కాంగ్రెస్ అసంతృప్తిగా ఉంది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ఉద్ధవ్ శివసేన, డీఎంకే ఎంపీల్లో కొందరు క్రాస్‌ఓటింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై విచారణ జరపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మహారాష్ట్ర నుంచి 7 ఓట్లు ఎన్‌డీఏకి క్రాస్ అయినట్లు సమాచారం. కాంగ్రెస్ నుంచి నలుగురు, ఉద్ధవ్ సేన నుంచి ముగ్గురు రాధాకృష్ణన్‌కు ఓటేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన తమిళనాడువాసి కావడంతో.. కొందరు డీఎంకే సభ్యులు కూడా ఆయనకు ఓటేసి ఉంటారని తెలుస్తోంది.

ఏడాదిలో ఆటగాళ్ల అరటిపండ్ల కోసం 35 లక్షలు

డెహ్రాడూన్, సెప్టెంబరు 10: ఉత్తరాఖండ్ క్రికెట్ అసోసియేషన్ (సీఏయూ) దుబారా ఖర్చులపై ఆ రాష్ట్ర హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆటగాళ్ల కోసం అరటిపండ్లపై ఏకంగా రూ.35 లక్షలు ఖర్చు చేశారంటూ ఆడిట్ నివేదికలో పేర్కొనడంపై కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. క్రికెట్ టోర్నమెంట్ల నిర్వహణకు ప్రభుత్వం కేటాయించిన రూ.12 కోట్ల నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణలను పరిశీలించిన హైకోర్టు మంగళవారం బీసీసీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలతో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

బిహార్‌పై కేంద్రం వరాల జల్లు

నూఢిల్లీ, సెప్టెంబరు 10: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌పై కేంద్రం వరాల జల్లు కురిపించింది. న్యూఢిల్లీలో మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ 2 కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.4,447 కోట్లతో బక్సర్-భగల్పూర్ హై స్పీడ్ కారిడార్‌లో భాగంగా మొకమా-ముంగేర్ సెక్షన్‌లో 4 లేన్ల కారిడార్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. 82.4 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తారు. మరోవైపు రూ.3,169 కోట్లతో భగల్పూర్-దుమ్‌కా-రామ్‌పుర్‌హట్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



పారిస్‌లో ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

రాజకీయ అస్థిరతపై ఫ్రాన్స్‌లో ప్రజాగ్రహం

» బ్లాక్ ఎవ్రీథింగ్ పేరుతో దేశవ్యాప్తంగా ఆందోళనలు

» 300మంది నిరసనకారుల అరెస్టు.. టియర్‌గ్యాస్ ప్రయోగం

» ఫ్రాన్స్‌లో ఏడాది కాలంలోనే నలుగురు ప్రధానుల మార్పు

» కొత్త ప్రధానిగా సెబాస్టియన్‌ను నియమించిన మేక్రాన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ఫ్రాన్స్‌లో ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరతలు దేశవ్యాప్త ఆందోళనలకు దారితీశాయి. బుధవారం ఆందోళనకారులు 'అన్నింటినీ అడ్డుకోండి'(బ్లాక్ ఎవ్రీథింగ్) అన్న నినాదంతో ఫ్రాన్స్ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలను నిర్వహించారు. రోడ్లను బ్లాక్ చేశారు. రైళ్లను అడ్డుకున్నారు. పోలీసులతో ఘర్షణలకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు వారిపై టియర్ గ్యాస్ ప్రయోగించారు. పోలీసులు దాదాపు 300మంది నిరసనకారులను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా 80వేల మంది పోలీసులు ఆందోళలను అదుపు చేసే విధుల్లో ఉన్నారు. ఒక్క పారిస్ నగరంలోనే 6వేల మందిని మోహరించారు. ఫ్రాన్స్ కొత్త ప్రధానిగా సెబాస్టియన్ బాధ్యతలు చేపట్టిన రోజే 'బ్లాక్ ఎవ్రీథింగ్' ఉద్యమం ఊపందుకోవడం గమనార్హం. 2024లో అధ్యక్షుడు మేక్రాన్ మధ్యంతర ఎన్నికలకు వెళ్లినప్పటి నుంచి ఫ్రాన్స్‌లో రాజకీయ అస్థిరత నెలకొంది. సెబాస్టియన్‌తో కలిపితే ఏడాది కాలంలో ఫ్రాన్స్‌లో నలుగురు ప్రధాన మంత్రులు మారారు. మరోవైపు, ఫ్రాన్స్ ద్రవ్య లోటు రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సెబాస్టియన్‌కు ముందున్న ప్రధాని ఫ్రాంకోయిస్.. పెన్షన్లు నిలిపివేయడం, ప్రభుత్వ సెలవు దినాలను తగ్గించడం లాంటి వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. తర్వాత పార్లమెంటులో విశ్వాస పరీక్షలో ఆయన ఓడిపోయారు. ఫలితంగా ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాత అధ్యక్షుడు మేక్రాన్ రక్షణ మంత్రి, తనకు నమ్మకస్థుడైన సెబాస్టియన్‌ను ప్రధానిగా నియమించారు.

నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా సుశీల కర్కి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ నేతగా ఎంపిక చేసుకున్నారు. ఆమె ఆధ్వర్యంలోనే సైన్యంతో చర్చలు జరపాలని నిర్ణయించారు. నేపాల్‌లో హింసాత్మక రూపం తీసుకున్న ఆందోళనలను నియంత్రించేందుకు నేపాల్ సైన్యం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచే దేశవ్యాప్తంగా భద్రతను తమ చేతిలోకి తీసుకుంది. ఆందోళనలపై ఆంక్షలు విధించింది. గురువారం ఉదయం వరకు అమల్లో ఉండేలా కర్ఫ్యూ ప్రకటించింది. ఆందోళనకారులే కాదు ప్రజలెవరూ బయటికి రావొద్దని హెచ్చరించింది. ఈ క్లిష్ట సమయంలో కొందరు సంఘ విద్రోహ శక్తులు దోపిడీలు, విధ్వంసాలకు పాల్పడుతున్నారని.. సాధారణ ప్రజలకు, ప్రభుత్వ ఆస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నారని, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఇలాంటివి జరగకుండా ఉండేందుకే కర్ఫ్యూ తదితర చర్యలు చేపట్టినట్టు ప్రకటించింది. ఆందోళన సమయంలో ఎత్తుకుపోయిన తుపాకులు, బుల్లెట్లు, ఇతర ఆయుధాలను సమీపంలోని పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. శాంతిని పునరుద్దరించడంలో ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేసింది. సైన్యం చేపట్టిన చర్యలతో బుధవారం నేపాల్ రాజధాని కాఠ్మండూ నిర్మానుష్యంగా మారింది. ఎక్కడ చూసినా సాయుధ బలగాలు కాపలా కాస్తూ కనిపించాయి. ఇక వ్యాపార సంస్థల్లో దోపిడీలు, ఆయుధాల అపహరణ, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడిన 27 మందిని అరెస్టు చేశామని, 31 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అధికారులు ప్రకటించారు. మరోవైపు ఆందోళనల సమయంలో నేపాల్‌లోని జైళ్ల నుంచి 13.5 వేల మంది ఖైదీలు తప్పించుకున్నట్టు నేపాల్ పోలీసులు ప్రకటించారు. వారిలో కొందరు సరిహద్దుల మీదుగా భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అలా వస్తున్న ఐదుగురిని భారత బలగాలు పట్టుకుని నేపాల్‌కు అప్పగించాయి. ఇక బైజ్‌నాథ్ పట్టణంలో తప్పించుకునే క్రమంలో ఐదుగురు బాల నేరస్తులు మరణించారు. కాగా, ఆందోళనకారుల దాడి భయంతో నేపాల్ మంత్రి భండారీ అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యను ఇంట్లోనే వదిలేసి పారిపోయారు. ఆయన కోసం వచ్చిన ఆందోళనకారులు.. ఆమె దుస్థితి చూసి, తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించడం గమనార్హం.

చర్చలకు రావాలని పిలుపు

ఇంకా రక్తపాతం వద్దని, తమ డిమాండ్లపై చర్చలకు రావాలని ఆందోళనకారులకు నేపాల్ అధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్ విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాలు ప్రశాంతంగా ఉండాలని, దేశానికి మరింత నష్టం కలగకుండా చూడాలని కోరారు. ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్ కూడా ఆందోళనకారులు చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ఆందోళనల్లో మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.



జైలు నుంచి పారిపోయిన ఖైదీలను అదుపులోకి తీసుకున్న నేపాల్ సైన్యం

విమానాశ్రయంలో రాకపోకలు ప్రారంభం

నేపాల్‌లోని కీలకమైన త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాకపోకలను బుధవారం సాయంత్రం నుంచి పునరుద్ధరించారు. అల్లర్లతో నేపాల్‌లో చిక్కుకుపోయిన విదేశీయులు, పర్యాటకులు తిరిగి వెళ్లేందుకు మార్గం సుగమమైంది. నేపాల్‌లో చిక్కుకుపోయిన విదేశీయులు సమీపంలోని పోలీస్ స్టేషన్లతో, విమాన యాన సంస్థలతో సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఆ ఒక్క ప్రమాదంతో.. ఆగ్రహం అగ్నిపర్వతమైంది!

సోషల్ మీడియా వేదికలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంపై మొదట సాధారణంగా నిరసనలు సాగాయి. 'జనరేషన్ జెడ్' పేరుతో యువత ర్యాలీలు తీశారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 6న ఆ దేశ మంత్రి రామ్ బహదూర్ ప్రయాణిస్తున్న కారు 11 ఏళ్ల ఉషా మగర్ అనే బాలికను ఢీకొట్టింది. ఆమెకు తీవ్రంగా గాయాలయ్యాయి. కానీ మంత్రి పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఈ ఘటన వీడియో వైరల్‌గా మారింది. దీనికితోడు "ఇలాంటి ప్రమాదాలు మామూలే. ఆమెకు తగిన వైద్యం చేయిస్తాం" అని ప్రధాని కేపీ శర్మ ఓలి చులకనగా మాట్లాడటంతో యువతలో ఆగ్రహం పెల్లుబికింది. అప్పటికే ప్రభుత్వంలో అవినీతి, బంధుప్రీతి, నిరుద్యోగంతో నెలకొన్న ఆగ్రహం ఈ పరిణామాలతో అగ్నిపర్వతంలా మారింది.

నేపాల్‌లో చిక్కుకున్న మాడభూషి శ్రీధర్

నేపాల్‌లో తెలంగాణకు చెందిన ఇద్దరు ప్రముఖులు చిక్కుకుపోయారు. వేర్వేరు పనుల నిమిత్తం నేపాల్ వెళ్లిన కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్ రెడ్డి.. ఆందోళనకర పరిస్థితుల వల్ల అక్కడ హోటళ్లలో తలదాచుకున్నారు. మాడభూషి శ్రీధర్ కుటుంబంతో సహా మొత్తం 27 మంది హైదరాబాద్ నుంచి తీర్థయాత్రలకు నేపాల్ వెళ్లారు. తాము కాఠ్‌మాండూ దగ్గరలో ఉన్న హోటల్‌లో క్షేమంగా ఉన్నట్లు శ్రీధర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మన రాజ్యాంగాన్ని చూస్తే గర్వంగా ఉంది

» నేపాల్‌లో పరిస్థితులను ప్రస్తావిస్తూ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: నేపాల్‌లో ఆందోళనలు, హింసాత్మక ఘటనలపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పందించారు. బిల్లులను గవర్నర్లు ఆమోదించడం, ఇందుకు కాలపరిమితి విధింపునకు సంబంధించిన అంశంపై బుధవారం విచారణ జరుగుతుండగా ఆయన నేపాల్‌లో ఆందోళలను ప్రస్తావించారు. "పొరుగుదేశాల్లో పరిస్థితులను చూడండి. నేపాల్‌లో ఏం జరుగుతుందో గమనించండి. వాటిని చూస్తుంటే మన రాజ్యాంగం గొప్పతనం అర్థం అవుతుంది. రాజ్యాంగం పట్ల గర్వంగా ఉంది" అని వ్యాఖ్యానించారు. గతంలో బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం కూలిపోవడం, ప్రస్తుతం నేపాల్‌లో పరిస్థితులపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తొలి మహిళా చీఫ్ జస్టిస్



నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్‌గా ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కిని ఆందోళనకారులు ఎన్నుకున్నారు. ఆందోళనకారుల గ్రూపులు, నిర్వాహకుల మధ్య సుమారు 4గంటల పాటు వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఈ నిర్ణయానికి వచ్చినట్టు కాఠ్మండూ స్థానిక వార్తా సంస్థ 'ఖబర్‌హబ్' వెల్లడించింది. నేపాల్ సుప్రీంకోర్టుకు మొదటి మహిళా చీఫ్ జస్టిస్ సుశీల కర్కి. 2016 జూలైలో బాధ్యతలు చేపట్టిన ఆమె పలు ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబట్టారు. ముఖ్యంగా సీనియారిటీని పట్టించుకోకుండా చేసిన పోలీస్ చీఫ్ నియామకాన్ని కొట్టివేశారు. పాలన వ్యవస్థలో అతిగా జోక్యం చేసుకుంటున్నారంటూ అప్పటి ప్రభుత్వం.. సుశీల కర్కిపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది. కానీ అది ఆమోదం పొందలేదు. 2017 జూన్‌లో సుశీల రిటైర్డయ్యారు. నేపాల్‌లోని బిరాత్‌నగర్‌లో 1952లో జన్మించిన సుశీల కర్కి.. ఉత్తరప్రదేశ్‌లోని బనారస్ హిందూ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ డిగ్రీ చేశారు. తర్వాత నేపాల్‌లోని త్రిభువన్ వర్సిటీలో న్యాయశాస్త్రం చదివారు. చాలాకాలం మానవ హక్కుల సంఘాల్లో సభ్యురాలిగా పనిచేశారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడి గుర్తింపు పొందారు.



రాజ్యాంగాన్ని తిరగ రాయాల్సిందే..

దేశంలో భారీ స్థాయిలో సంస్కరణలు తీసుకురావాలని, వ్యవస్థలను మార్చాలని జెనరేషన్ జెడ్ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన ఆందోళనకారులు అమరవీరులని, వారి కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కాలని పేర్కొన్నారు. నిరుద్యోగం, వలసలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఆందోళనకారులు ప్రధానంగా ఆరు డిమాండ్లు పెట్టారు. అవి.. ప్రస్తుతమున్న ప్రజాప్రతినిధులు వెంటనే చట్టసభలన్నీ రద్దు చేయాలి. పారదర్శకంగా, స్వతంత్రంగా ఎన్నికలను నిర్వహించాలి. ప్రజలు నేరుగా ఎన్నుకునే వ్యక్తి ప్రభుత్వాధినేతగా ఉండాలి. పౌరులు, నిపుణులు, యువతకు భాగస్వామ్యం ఉండేలా రాజ్యాంగాన్ని పూర్తిగా తిరగరాయాలి. అక్రమ ఆస్తులన్నీ జాతీయం చేయాలి. విద్య, ఆరోగ్యం, న్యాయం, భద్రత, సమాచార వ్యవస్థల్లో సంస్కరణలు అమలు చేయాలి.

సైమా టెక్నాలజీస్‌కు 26 ఎకరాలు

» నాయుడుపేట వద్ద కేటాయింపు.. ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

» కుప్పంలో హిందాల్కోకు పాలనామోదం

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ సైమా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్‌కు తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద 26.70 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ సంస్థ స్థాపించే పీసీబీ, సీసీఎల్, ఈఎంఎస్ ప్లాంట్లకు పాలనామోదం తెలిపింది. అలాగే, ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ప్రోత్సాహకాలను ఇస్తూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 586 కోట్లతో 613 మందికి ఉపాధిని కల్పించే హిందాల్కో ఇండస్ట్రీస్ కుప్పంలో స్థాపించేందుకు పాలనామోదం తెలిపింది. సైమా, హిందాల్కో పరిశ్రమలకు ఎలక్ట్రానిక్ పాలసీ 4.0 మేరకు ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రిటైర్మెంట్‌కు ఏడాది ముందు ఎన్‌పీఎస్‌లోకి మారొచ్చు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 : యూపీఎస్(యనిఫైడ్ పెన్షన్ స్కీమ్) విధానాన్ని ఎంపిక చేసుకున్న ఉద్యోగులు తిరిగి ఎన్‌పీఎస్(నేషనల్ పెన్షన్ సిస్టమ్)లోకి మారవచ్చునని ఈపీఎఫ్‌వో బుధవారం వెల్లడించింది. ఓ ఉద్యోగి తన పదవీ విరమణకు ఏడాది ముందు లేదా స్వచ్ఛంద పదవీ విరమణకు మూడు నెలల ముందు మాత్రమే తిరిగి ఎన్‌పీఎస్ విధానంలోకి మారే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

హాల్‌కు ఎస్‌ఎస్‌ఎల్వీ టెక్నాలజీ బదిలీ

» ఇన్‌స్పేస్ ఆధ్వర్యంలో ఇస్రో కీలక ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: అంతరిక్ష రంగంలో పరిశ్రమ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఇస్రో కీలక ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్‌ఎస్‌ఎల్వీ) సాంకేతిక బదిలీకి సంబంధించి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. భారత్‌లో అంతరిక్ష రంగాన్ని ప్రోత్సహిస్తున్న ఇన్‌స్పేస్ ఆధ్వర్యంలో జరిగిన 100వ సాంకేతిక బదిలీ ఒప్పందమిది. బెంగళూరులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో, న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్‌ఐఎల్), ఇన్‌స్పేస్, హాల్... ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. దీనికోసం రేసులో ఉన్న అదానీ గ్రూప్ మద్దతుగల సంస్థ డిజైన్ టెక్నాలజీస్ నేతృత్వంలోని కన్సార్టియంను వెనక్కు నెట్టి హాల్ ఈ ఒప్పందం చేసుకుంది. కాగా, ఎస్‌ఎస్‌ఎల్వీ టెక్నాలజీ బదిలీ కోసం ఇస్రో, హాల్, ఎన్‌ఎస్‌ఐఎల్ సంస్థలు కలిసిరావడం శుభపరిణామమని ఇన్‌స్పేస్ చైర్మన్ పవన్ కుమార్ గోయెంకా అన్నారు. ఒప్పందంపై సంతకం చేసిన 24 నెలల్లోగా ఇస్రో ఎస్‌ఎస్‌ఎల్వీ టెక్నాలజీని హాల్‌కు బదలాయిస్తుంది.

భారత్,చైనాలపై 100% సుంకాలు వేయండి

» ఈయూను కోరిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

» భారత్‌తో అసంబద్ధమైన వాణిజ్యం కోరుకోం

» మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేసిన నవారో



వాషింగ్టన్, సెప్టెంబరు 10: భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నామంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలపై భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణం చూపుతూ భారత్, చైనాలపై వంద శాతం సుంకాలు విధించాలని యూరోపియన్ యూనియన్‌ను కోరారు. ఈయూ కూడా కలిసి వస్తే తాము కూడా భారత్, చైనాలపై 100% సుంకాలు విధించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. అమెరికా, ఈయూ అధికారులతో వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో ఈ మేరకు చర్చించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపేస్తామనే వరకు రెండు దేశాలపై సుంకాలు కొనసాగించాలని, ఈ విషయంలో కలిసి రావాలని అమెరికా సూచించగా ఈయూ అధికారులు సానుకూలంగా స్పందించారంటూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రచురించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆపేందుకు పుతిన్‌పై ఒత్తిడి తెచ్చే వ్యూహంగా దీన్ని చూడాలని అమెరికా వింతవాదన చేస్తోంది.

మళ్లీ నోరుపారేసుకున్న నవారో

భారత్‌తో అసంబద్ధమైన వాణిజ్యాన్ని అమెరికా కోరుకోవడం లేదని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. అమెరికాలో ఉద్యోగాలతో పాటు అమెరికా మార్కెట్ల వైపు భారత్ ఆత్రంగా చూస్తోందన్నారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం చేయడానికి భారత్ చమురు కొనుగోలు చేయడమే కారణమంటూ నవారో కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఈ యుద్ధం మోదీ యుద్ధమని కూడా ఆయన వ్యాఖ్యానించారు. నవారో వ్యాఖ్యలను భారత్ ఇప్పటికే గట్టిగా తిప్పికొట్టింది. అయినా ఆయన తన ఆరోపణలు కొనసాగిస్తూనే ఉన్నారు.

మోదీతో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

ట్రంప్‌తో మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నానన్నారు. రెండు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తామని చెప్పారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణం చూపుతూ ట్రంప్ భారత్‌పై 50% సుంకాలు విధించడంతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఎస్‌సీఓ సదస్సుకు మోదీ హాజరవడంతో అమెరికాకు భారత్ దూరమవుతోందనే ప్రచారం జరిగింది. దీనికి తోడు ట్రంప్ ఫోన్ చేసినా మోదీ మాట్లాడేందుకు నిరాకరించారనే కథనాలు వెలువడ్డాయి. ఈ తరుణంలో ట్రంప్ భారత్‌కు సానుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం ప్రారంభించారు. మోదీ వాటినే తిరిగి ప్రస్తావిస్తూ రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సాధారణ స్థాయికి చేరుకునేందుకు యత్నిస్తున్నారు.

దోహాలో దాడి ఖతార్ సార్వభౌమత్వ ధిక్కరణే

» ఖతార్ అమీర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, వాషింగ్టన్, సెప్టెంబరు 10: ఖతార్ రాజధాని దోహాలో ఉన్న హమాస్ శ్రేణులే లక్ష్యంగా ఇజ్రాయెల్ మంగళవారం జరిపిన దాడులను భారత్ ఖండించింది. ఖతార్ అమీర్.. షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ తహానీతో ప్రధాని మోదీ బుధవారం స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపారు. ఖతార్ సార్వభౌమత్వాన్ని ధిక్కరించేలా జరిగిన ఆ దాడులను భారత్ ఖండిస్తోందని అన్నారు. మోదీ తమకు సంఘీభావం తెలపడం పట్ల ఖతార్ అమీర్ తహానీ ధన్యవాదాలు తెలియజేశారు. మరోపక్క, దోహాలో జరిగిన దాడి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నిర్ణయమేనని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ తమకు మిత్రదేశమే అయినా దాడిపై తనకు ముందస్తు సమాచారం లేదని అన్నారు. తమకు మిత్రదేశమైన ఖతార్‌లో దాడి జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఖతార్‌లో ఇజ్రాయెల్ దాడి వల్ల గాజా యుద్ధాన్ని ఆపేందుకు తాను చేసిన ప్రయత్నాలకు జరిగిన నష్టంపై అమెరికా అధ్యక్షుడు దృష్టి సారించారని వైట్ హౌస్ తెలిపింది.

ఒకే ఒక్కడు.. మోదీ

» అత్యధిక ప్రజాదరణ ఉన్న నేతగా పదకొండేళ్లుగా టాప్‌లో మోదీ

» సోషల్ మీడియాలో పోస్టు వైరల్



"అల్లుడు సీజన్‌లాంటోడు.. వస్తాడు పోతాడు! మనవడు.. చెట్టు.. వస్తే పాతుకుపోతాడు" ...అని ఓ హిట్ సినిమాలో పాపులర్ డైలాగ్ ఉంది! 2014లో భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నరేంద్ర మోదీ కూడా అలాగే పాతుకుపోయారు! ఈ పదకొండేళ్ల కాలంలో పలు దేశాల్లో ప్రభుత్వాధినేతలెందరో మారారు. కానీ.. మోదీ ప్రజాదరణ, పాలన అప్రతిహతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే.. "ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధాని.. నరేంద్రమోదీ! పదకొండేళ్లుగా ఆయన పీఎంగా ఉన్నారు. ఈ పదకొండేళ్లలో నేపాల్‌లో 9 మంది ప్రధానులు మారారు. పాకిస్థాన్‌లో ఐదుగురు.. యూకేలో ఆరుగురు.. జపాన్‌లో ముగ్గురు ప్రధానమంత్రులు మారారు! అమెరికాలో నలుగురు అధ్యక్షులు, శ్రీలంక దేశాల్లో నలుగురు, ఫ్రాన్స్‌లో ఇద్దరు అధ్యక్షులు మారారు!! ఇన్నేళ్లయినా మోదీకి ప్రజాదరణ 70 శాతానికి పైగానే ఉంది" ...అంటూ సోషల్ మీడియాలో ఒక పోస్టు వైరల్ అవుతోంది. లెక్కలు తీస్తే... ఆ పోస్టులో చెప్పిన ప్రభుత్వాల మార్పిడి లెక్కలు కరెక్టేగానీ మోదీలా గానే ఒకే వ్యక్తి ఒకసారికి మించి ప్రధాని/అధ్యక్షుడు అయిన సందర్భాలున్నాయి. ఉదాహరణకు నేపాల్‌నే తీసుకుంటే.. 2014 నుంచి ఇప్పటిదాకా 9సార్లు ప్రభుత్వాలు మారాయి. కానీ.. ఈ సమయంలో ప్రధానులుగా ఉన్నది నలుగురే. సుశీల్ కోయిరాలా (ఒకసారి), ప్రచండ (మూడుసార్లు), షేర్ బహదూర్ దేవ్‌బా (మూడుసార్లు), కేపీ శర్మ ఓలి (రెండుసార్లు) ప్రధానులుగా వ్యవహరించారు. పాకిస్థాన్‌లో.. నవాజ్ షరీఫ్, షాహిద్ ఖాన్ అబ్బాసీ, నసీరుల్ ముల్క్ (ఆపద్ధర్మ ప్రధాని), ఇమ్రాన్ ఖాన్, షెహబాజ్ షరీఫ్ (రెండుసార్లు), అన్వరుల్ హక్ కాకర్ (ఆపద్ధర్మ ప్రధాని) ఈ పదకొండేళ్లలో ప్రధానులుగా ఉన్నారు. వీరిలో ఆపద్ధర్మ ప్రధానులను కూడా కలుపుకొంటే ఏడుగురు ప్రధానులు మారారు. ఇక.. రవి అస్తమించని సామ్రాజ్యంగా ఒకప్పుడు వెలుగొందిన యూకేలో 2014 మే నుంచి ఆరుగురు ప్రధానులు మారారు. మోదీ ప్రధాని అయ్యేనాటికే బ్రిటన్ పీఎంగా ఉన్న డేవిడ్ కామెరాన్ 2015లో మరోసారి ఎన్నికయ్యారు. కానీ.. బ్రిటన్ ఈయూలో ఉండాలా వద్దా అనే అంశంపై నిర్వహించిన రిఫరెండంలో ప్రజాభిప్రాయం తన అభిప్రాయానికి వ్యతిరేకంగా రావడంతో 2016 జూలైలో రాజీనామా చేశారు. ఆ తర్వాత వరుసగా థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి శునాక్, కీర్ స్టార్మర్.. ఆ దేశ ప్రధానులయ్యారు. జపాన్‌లో షింజో అబే, యోషిహిడే సుగా, ఫ్యుమియో కిషిడా, షిగేరు ఇషిబా ప్రధాని పదవిని అధిష్ఠించారు. అమెరికాలో.. బరాక్ ఒబామా, ట్రంప్ (రెండుసార్లు), జో బైడెన్ అధ్యక్షులయ్యారు. లెక్కకు ముగ్గురేగానీ.. ప్రభుత్వాలు నాలుగు మారినట్టు. శ్రీలంకలోనూ మహింద రాజపక్స, మైత్రీపాల సిరిసేన, గొటబాయ రాజపక్స, రణిల్ విక్రమసింఘే, అనురకుమార దిసనాయకె.. ఇలా ఐదుగురు అధ్యక్షులు మారారు. ఇక.. సోషల్ మీడియా పోస్టులో వైరల్ అవుతున్నట్టు మోదీ ప్రజాదరణ ఇప్పటికీ 70% ఉందా అంటే.. అమెరికాకు చెందిన బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' ఈ ఏడాది జూలైలో నిర్వహించిన 'మోస్ట్ పాపులర్ లీడర్ ఇన్ ద వరల్డ్' సర్వేలో 75% అప్రూవల్ రేటింగ్‌తో మోదీ అగ్రస్థానంలో నిలిచారు.

బోధన్‌లో ఉగ్ర లింకుల కలకలం

» యువకుడిని అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు!

» అతడి నుంచి ఓ పిస్టల్ స్వాధీనం

నిజామాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ఉగ్ర లింకులు కలకలం సృష్టించాయి. ఉగ్రసంస్థ ఐఎస్‌ఐఎస్‌తో సంబంధాలు ఉన్నాయన్న కారణంతో బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని ఆనీసా నగర్ కాలనీకి చెందిన ఓ యువకుడిని బుధవారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. జులాయిగా తిరిగే ఆ యువకుడు ఆన్‌లైన్ ద్వారా ఉగ్రసంస్థతో సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో అషర్ డానిష్ అనే వ్యక్తిని అరెస్టు చేయగా అతడు ఇచ్చిన సమాచారం మేరకు.. ఢిల్లీ పోలీసులు నెల రోజులుగా బోధన్‌లో నిఘా పెట్టారు. ఈ క్రమంలో యువకుడిని అదుపులోకి తీసుకొని బోధన్ కోర్టులో ప్రవేశపెట్టి ఢిల్లీకి తీసుకెళ్లినట్లు సమాచారం. అతడి నుంచి ఐఎస్‌ఐఎస్‌కు సంబంధించిన సమాచారాన్ని సేకరించడంతో పాటు ఓ ఎయిర్ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే స్థానిక పోలీసులు, ఢిల్లీ పోలీసులు ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. 23 సంవత్సరాల ఆ యువకుడు తల్లివద్ద ఉంటున్నట్లు తెలుస్తోంది. తండ్రితో ప్రస్తుతం ఆ కుటుంబానికి సంబంధాలు లేనట్లు సమాచారం.



ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాలు వద్ద జస్టిస్ ఎన్వీ రమణకు స్వాగతం పలుకుతున్న అధికారులు

సత్యసాయి సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

పుట్టపర్తి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ బుధవారం రాత్రి శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన పుట్టపర్తి చేరుకున్న ఆయనకు సాయికుల్వంత్ హాలు వద్ద ఆర్డీఓ సువర్ణ, తహసీల్దారు కల్యాణ్ చక్రవర్తి, డీఎస్పీ విజయ్‌కుమార్ స్వాగతం పలికారు. ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్‌లో జస్టిస్ ఎన్వీ రమణ రాత్రి బస చేశారు.

'ఫొటో' ప్రదర్శనపై నిషేధం ఎక్కడుంది?

- రాజకీయ కారణాలతో పిటిషన్ వేశారు
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపముఖ్యమంత్రి చిత్రంపై పిల్ కొట్టేసిన హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి ఫొటో ప్రదర్శించడంపై నిషేధం ఎక్కడ ఉంది? అని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో వ్యాజ్యం వేశారని ఆక్షేపిస్తూ పిల్‌ను కొట్టివేసింది. ఇలాంటివి కాకుండా సమాజానికి, ప్రజలకు ఉపయోగపడే విషయాలను ఎంచుకొని ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను వేయాలని హితవు పలికింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోను ప్రదర్శించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగి వై.కొండలరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'ప్రభుత్వ కార్యాలయాల్లో ఫొటోల ప్రదర్శన విషయంలో నిర్దిష్ట జీవోలు, మార్గదర్శకాలు, నిబంధనలు లేవని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్టీఐ కింద చేసిన దరఖాస్తుకు సమాచారం ఇచ్చింది. రాజ్యాంగంలోని అధికరణ 164లో ఉపముఖ్యమంత్రి పోస్టును నిర్దిష్టంగా గుర్తించలేదు' అని పేర్కొన్నారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. ఉపముఖ్యమంత్రి ఫొటో ప్రదర్శించడంపై నిషేధం ఎక్కడ ఉందో చెప్పాలని పిటిషనర్‌ను ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో పిటిషన్ వేశారంటూ పిల్‌ను కొట్టివేసింది.

అది పింక్ డైమండ్ కాదు.. కెంపు

- 1945లో మైసూరు మహారాజు శ్రీవారికి బహూకరించారు
- ఆధారాలతో తేల్చిచెప్పిన ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి




తిరుమల శ్రీవారికి మైసూరు మహారాజు బహూకరించిన హారం ఇదే

తిరుమల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి మైసూరు మహారాజు బహూకరించింది పింక్ డైమండ్ కాదని, అది కేవలం కెంపు మాత్రమేనని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. తిరుమల ఆలయంలోని అత్యంత విలువైన పింక్ డైమండ్‌ను మాయం చేశారంటూ 2018లో ప్రధాన అర్చకుడు రమణదీక్షితులు చేసిన ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ అంశంపై ఏఎస్ఐ లోతుగా అధ్యయనం చేసింది. మైసూర్‌లోని ఏఎస్ఐ డైరెక్టర్(ఎపిగ్రఫీ) మునిరత్నం రెడ్డి ఆ వివరాలను బుధవారం వెల్లడించారు. తాము సేకరించిన సమాచారం ప్రకారం అది పింక్ డైమండ్ కానేకాదని ప్రకటించారు. 1945 జనవరి 9న మైసూరు మహారాజు జయచామరాజేంద్ర వడియార్ శ్రీవారి దర్శనం కోసం తిరుమల వచ్చారని, తాను బాల్యంలో ధరించిన హారాన్ని స్వామికి సమర్పించారని వివరించారు. మైసూరు ప్యాలెస్ రికార్డుల ప్రకారం అందులో కెంపులు, మరికొన్ని రకాల రత్నాలు మాత్రమే ఉన్నాయని, పింక్ డైమండ్ ప్రస్తావన అందులో లేదని మునిరత్నం రెడ్డి స్పష్టం చేశారు.

రెండోసారి అవకాశం బాధ్యతను పెంచింది

- భక్తుల సూచనలతో సేవల నాణ్యత పెంచుతాం
- టీటీడీ ఈవోగా ఏకే సింఘాల్ బాధ్యతల స్వీకరణ



టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న అనిల్‌కుమార్ సింఘాల్

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవోగా రెండోసారి అవకాశం రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందని అనిల్‌కుమార్ సింఘాల్ అన్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ఆయన ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. పూర్వ ఈవో శ్యామలరావు నుంచి బాధ్యతలు తీసుకున్న ఆయనతో టీటీడీ బోర్డు మెంబర్ సెక్రటరీ ఎక్స్ అఫిషియోగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి సేవల నాణ్యతను పెంచుతామని చెప్పారు. అంతకుముందు సింఘాల్ అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు చేరుకుని తలనీలాలు సమర్పించారు.

నవంబరు 11 వరకు 'ఫ్రీ హోల్డ్'పై నిషేధం

మరో 2 నెలల పాటు పొడిగింపు.. సమస్య పరిష్కారంపై నాన్చుడు

- సీఎం చంద్రబాబు ఆదేశాలను లెక్కచేయని రెవెన్యూ శాఖ
- భూములు సవ్యంగా ఉన్న చిన్నకారు రైతులకూ ఇక్కట్లు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధం మరో రెండు నెలలు అంటే.. నవంబరు 11 వరకు కొనసాగనుంది. బుధవారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి నిషేధం మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో గత 15 నెలలుగా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో చిన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హులకు తక్షణమే న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అయినా ఆ శాఖ ఫ్రీ హోల్డ్ భూముల సమస్యను సాగదీస్తోంది. గత జగన్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం, అస్మదీయులకు మేలు చేసేందుకు, సెటిల్‌మెంట్ల కోసం అసైన్‌మెంట్ భూములను ఫ్రీ హోల్డ్ చేసింది. నిషేధిత భూముల జాబితా నుంచి తప్పించడంలో భారీగా అక్రమాలు జరిగాయంటూ కూటమి ప్రభుత్వం రాగానే వాటి రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించింది. గత ప్రభుత్వం చేసిన తప్పు సరిదిద్దుతున్నామని చెప్పింది. అయితే ఇంత వరకూ ఏ నిర్ణయం తీసుకోలేదు. జూలై 5వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఫ్రీ హోల్డ్ భూముల సమస్యలపై చర్చ జరిగింది. రెవెన్యూ శాఖ సమావేశంలో ఆయన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. "ఫ్రీ హోల్డ్‌కు అర్హులైన వారు వైసీపీ కార్యకర్తలైనా, టీడీపీ కార్యకర్తలైనా, ఏ పార్టీ వారైనా న్యాయం చేయాల్సిందే. అర్హత ఉన్న అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించే విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోండి. ఈ విషయంలో ఇక నాన్చుడు ధోరణి వద్దు. అసైనీలు భూమి పొజిషన్‌లో ఉన్నవి, పక్కా అసైన్‌మెంట్ రికార్డులు కలిగి ఉండి 20 ఏళ్ల గడువు దాటిన వాటిని రాజకీయాలతో సంబంధం లేకుండా ఫ్రీ హోల్డ్ చేయండి" అని సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇలాంటి అర్హత గల భూములు 7 లక్షల ఎకరాలు ఉన్నాయని రెవెన్యూ శాఖ కూడా గుర్తించింది. కనీసం ఆ భూముల వరకైనా నిషేధం ఎత్తేయొచ్చు. 'అసైన్‌మెంట్ రికార్డులు లేని భూములు, కలెక్టర్ ఉత్తర్వులు లేనివి, జీవో 596కి విరుద్ధంగా ఉన్నవి, అధిక విస్తీర్ణం క్లెయిమ్ చేసేవి, ఇతరులు క్లెయిమ్ చేసే భూములు, అభ్యంతరాలున్న పోరంబోకు భూములు, నీటి వనరులున్న పోరంబోకు భూములు, 20 ఏళ్ల గడువు దాటని అసైన్డ్ భూములకు ఫ్రీ హోల్డ్ వద్దు' అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు. అయినా కూడా రెవెన్యూ శాఖ అన్ని భూములను ఒకే గాటన కట్టేసి ఏ నిర్ణయం తీసుకోకుండా ఇంకా నాన్చుతోంది. దీన్ని సాకుగా చూపి స్థానిక నాయకులు ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని ప్రచారం చేస్తూ, తక్కువ ధరలకే ఈ భూములు సొంతం చేసుకుంటున్నారు.

నిబంధనల ప్రకారం ఉన్నా...

గత జగన్ ప్రభుత్వంలో 2024 మే నెల నాటికి 13 లక్షల ఎకరాలు ఫ్రీ హోల్డ్ అయినట్టు గుర్తించారు. ఇందులో 7 లక్షల ఎకరాలు చట్టప్రకారం, నిబంధనలకు అనుగుణంగా ఫ్రీ హోల్డ్ అయినట్టు రెవెన్యూ శాఖ గుర్తించింది. మరో 5 లక్షల ఎకరాల్లో అక్రమాలు జరిగినట్టు పేర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ అక్రమాలపై విచారణ జరుపుతూనే ఉంది. భూ సమస్యలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంపై ప్రభుత్వానికి అక్టోబరులో తుది నివేదిక అందజేస్తామని చెప్పింది. దీంతో నిబంధనల ప్రకారం సవ్యంగా ఉన్న భూములపై దసరా నాటికి నిషేధం ఎత్తేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు మరో 2 నెలలు నిషేధం పొడిగించారు. దీంతో దసరా, దీపావళి కూడా పోయినా నిషేధం మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.

తక్కువ వడ్డీ రుణాలకు మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ అనుమతి

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తక్కువ వడ్డీపై ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి రుణం పొందటానికి ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గతంలో ఇచ్చిన ఆదేశాలకు బుధవారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. తుది ఒప్పందానికి ముందు ప్రభుత్వ సమ్మతి తీసుకోవాలనే అనే షరతును ఆ సవరణ ఉత్తర్వుల్లో పేర్కొంది.

పాడేరు సీట్ల తగ్గుదల జగన్ నిర్వాకమే

- మెడికల్ కాలేజీలపై మాజీ సీఎం విషప్రచారం: మంత్రి సత్యకుమార్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నుంచి ప్రజల దృష్టిని మరల్చే కుట్రలో భాగంగానే మాజీ సీఎం జగన్ విష ప్రచారాన్ని కొనసాగించారని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ధ్వజమెత్తారు. జాతీయ వైద్య సంఘం 2024-25లో పాడేరు కాలేజీలో ప్రవేశాలను కేవలం 50కే కుదించడానికి మాజీ సీఎం నిర్వాకమే కారణమన్నారు. ఈ విషయంలో ఆయనే పూర్తి దోషి అని చెప్పారు. పీపీపీ విధానంలో నూతన వైద్య కళాశాలల నిర్మాణం, హైబ్రిడ్ విధానంలో అందరికీ ఆరోగ్య బీమా పథకాలపై మీడియా సమావేశంలో జగన్ ఆరోపణలను మంత్రి తిప్పికొట్టారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు: రామకృష్ణ

'సీఎం చంద్రబాబు ప్రైవేటు జపం చేస్తున్నారు. తాజాగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ శక్తులకు అప్పగించడం అత్యంత దుర్మార్గం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం విజయవాడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటానికి దిగాలి' అని రామకృష్ణ పిలుపునిచ్చారు.

ఉచిత ఉల్లి కోసం..!



ఊరకే వస్తే.. ఎవరూ వదులుకోరు! అనే సామెతను నిజం చేస్తూ.. ఉచితంగా వస్తున్న ఉల్లిపాయల కోసం తాడేపల్లిగూడెంలో జనం ఎగబడ్డారు. లారీ పైకి ఎక్కి... కిందపడినవి ఏరుకుని.. బస్తాలను బైకులపై పెట్టుకుని మరీ పట్టుకెళ్లారు. అసలేం జరిగిందంటే..! కర్నూలులో ఉల్లిపాయలకు ధర పడిపోయింది. వీటిని కిలో రూ.12కు ప్రభుత్వం కొనుగోలు చేసి, రాష్ట్రంలోని మార్కెట్లకు తరలిస్తోంది. ఈ ఉల్లిని తాడేపల్లిగూడెం మార్కెట్‌కు తరలిస్తే.. నాణ్యతలేదంటూ వ్యాపారులు కొనడం మానేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వాటిని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఆ ఉల్లిని రోడ్లపక్కన పడేసేందుకు సిబ్బంది తీసుకెళ్తుంటే గమనించిన జనం.. పెదతాడేపల్లి వద్ద ఆ లారీల్లోకి ఎక్కి ఉల్లి బస్తాలు పట్టుకుపోయారు. జనం ఎక్కువగా రావడంతో ట్రాఫిక్ జామైంది.

– తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి

నేడు బాపట్లకు డిప్యూటీ సీఎం పవన్

- అటవీ అమరవీరుల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం

బాపట్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ గురువారం బాపట్ల పరిధిలోని సూర్యలంకలో పర్యటించనున్నారు. విధి నిర్వహణలో భాగంగా అసువులు బాసిన అటవీ అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకునే విధంగా సూర్యలంక రోడ్డులోని నగరవనం అటవీ పార్కులో స్థూపం ఆవిష్కరించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 మంది అటవీ అమర వీరుల కుటుంబాలతో పవన్ ఆత్మీయంగా సమావేశం కావడంతో పాటు వారికి ఆర్థిక సాయం అందించనున్నారు. రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తాళపత్ర గ్రంథం మొక్కలను డిప్యూటీ సీఎం సూర్యలంక తీర ప్రాంతం లో నాటనున్నారు. ఇవి తాటి మొక్కలలోనే అరుదైన రకంగా ఖ్యాతి గడించాయి. తీర ప్రాంతంలో మొక్కలతో గ్రీన్‌వాల్ ఏర్పాటయ్యేలా చూసే విధంగా ఈ కార్యక్రమంలో పవన్ కల్యాణ్ అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన కోసం సూర్యలంక తీరంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ బుధవారం పరిశీలించారు.

రైతు సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- జగన్‌కు మంత్రి అచ్చెన్న సవాల్

అమరావతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖలో సంస్కరణలు, రైతు సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సవాల్ విసిరారు. వ్యవసాయ రంగంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను ప్రజల ముందు ఉంచడానికి సిద్ధంగా ఉన్నామని బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. "ఐదేళ్ల పాలనలో పంటలకు మద్దతు ధరలో కోత పెట్టారు. ఉచిత పంటల బీమాకు మూడేళ్ల ప్రీమియం చెల్లించలేదు. రాయితీలు నిలిపివేశారు. డ్రిప్ ఇరిగేషన్ ఇవ్వలేదు. రూ. 3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి పెట్టామన్న జగన్.. ఏ పంట, ఏ రైతు నుంచి ఎంత కొనుగోలు చేశారో చెప్పగలరా?. ధాన్యం డబ్బులు ఎగ్గొట్టారు. వైసీపీ పాలనలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయాయి. మేము నిరుడు కన్నా అదనంగా ఎరువులు తెప్పించి, పంపిణీ చేశాం. యూరియా దొరకడం లేదంటూ వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోంది. బర్లీ పొగాకు, కోకో, మిర్చి, మామిడి, టమాటా, ఉల్లి పంటలకు మద్దతు ధరలు కల్పించి, ఆ పంటల్ని కొనుగోలు చేశాం" అని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రానికి 4,14,388 టన్నుల యూరియా రాక: డిల్లీరావు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్రానికి 6,29,520 టన్నుల యూరియా కేంద్రం కేటాయించగా 4,14,388 టన్నులు మాత్రమే దిగుమతి అయినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు బుధవారం తెలిపారు. ఏప్రిల్‌లో 45,920, మేలో 60,750, జూన్‌లో 67,800, జూలైలో 1,30,000, ఆగస్టులో 1,65,300, సెప్టెంబరు మొదటి పది రోజుల్లో 1,59,750 టన్నుల యూరియా కేటాయించగా.. వరుసగా 79,921, 51,574, 61,242, 82,708, 85,838, 53,106 టన్నులు వచ్చినట్లు ఆయన వివరించారు.

సూపర్ సిక్స్... సూపర్ ఫ్లాప్: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్ అయిందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. బుధవారం ఎక్స్‌లో ఆమె స్పందించారు. 'సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారా? రాష్ట్రంలోని 50 లక్షల మంది నిరుద్యోగుల్లో ఒక్కరికైనా రూ.3,000 చొప్పున ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తున్నారా? ఇస్తానన్న 20 లక్షల ఉద్యోగాలెక్కడ? స్థాపించని పరిశ్రమలతో అగ్రిమెంట్లు చేసుకున్నంత మాత్రాన ఉద్యోగాలు ఇచ్చేసినట్లేనా? ఒక్కరికీ భృతి ఇవ్వకుండా, ఉద్యోగం ఇవ్వకుండా సూపర్ సిక్స్ ఎలా సక్సెస్ అవుతుంది? కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలల్లో ఒక్క మహిళైనా నెలకు రూ.1,500 పొందారా? 14 నెలల తర్వాత ఫ్రీ బస్సును అమలు చేసి.. సూపర్ సక్సెస్ అంటే ప్రజలు నవ్వుతున్నారు. గోరంత చేసి కొండంత చెప్పుకోవడం నిజంగా కూటమి ప్రభుత్వానికే చెల్లుతుంది. ప్రతి యేటా జనవరిలో జాబ్ క్యాలెండర్, విద్యుత్తు చార్జీలు తగ్గింపు, జర్నలిస్టులకు ఉచిత నివాస స్థలం లాంటి మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రధాన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా?' అని షర్మిల ప్రశ్నించారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

చింతూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. కాంకేర్ జిల్లా అద్నర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు బలగాలు అక్కడకి చేరుకున్నాయి. దీంతో ఇరుపక్షాల మధ్య ఎదురు కాల్పులు జరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని, తుపాకిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

ఈఐపీఎల్‌లో మంటలు అదుపులోకి

విశాఖపట్నం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఇండియా పెట్రోలియం ప్రైవేటు లిమిటెడ్ (ఈఐపీఎల్) కంపెనీ మిథనాల్ ట్యాంకులో మంటలు బుధవారం నాటికి పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ఆదివారం సాయంత్రం పిడుగుపడి మంటలు చెలరేగిన సంగతి తెలిసిందే. ట్యాంకులో 6,500 కిలోలీటర్ల మిథనాల్ ఉండడం, దానిని వేరే ట్యాంకులోకి మళ్లించడం కష్టంతో కూడుకున్న పని కావడంతో మంటలు మూడు రోజులు కొనసాగాయి. ట్యాంకులో ఉష్ణోగ్రతలు పెరగకుండా, పక్కనున్న ట్యాంకులకు నష్టం వాటిల్లకుండా అగ్నిమాపక దళాలు మూడు రోజులు శ్రమించాయి.

పండుగ వేళ సరికొత్త డిజైన్లతో వేగ జ్యువెలర్స్ సిద్ధం

- 43వ వార్షిక నివేదిక ఆవిష్కరించిన బాలకృష్ణ



వేగ జ్యువెలర్స్ వార్షిక నివేదిక ఆవిష్కరిస్తున్న బాలకృష్ణ

విజయవాడ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి పండుగలకు, వివాహ వేడుకలకు సరికొత్త డిజైన్‌లను అందించేందుకు వేగ జ్యువెలర్స్ సిద్ధంగా ఉందని సంస్థ చైర్మన్ బండ్లమూరి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా తెలిపారు. వేగ జ్యువెలర్స్ 43వ వార్షిక నివేదికను సంస్థ బ్రాండ్ అంబాసిడర్ నందమూరి బాలకృష్ణ ముంబయిలోని కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్, నవీన్ మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణలో ఖాతాదారుల అభిమానాన్ని చూరగొన్నామన్నారు. అధిక సంఖ్యలో ఉన్న తమ ఖాతాదారుల కోసం సరికొత్త డిజైన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. పండుగ సీజన్‌లలో ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాత నగల మార్పిడిపై ఆకర్షణీయమైన విలువ కట్టడమే కాకుండా ప్రత్యేక ధరలను డైమండ్ క్యారెట్‌పై అందిస్తున్నట్లు వెల్లడించారు. కస్టమర్లకు లాభం చేకూర్చేలా వివిధ రకాల ఆభరణాల కొనుగోలు పథకాలు తమ స్టోర్స్‌లో ఉన్నాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉపరాష్ట్రపతికి సమున్నత బాధ్యత!

'మాన్యత, ఉదాత్తత, విజ్ఞత, వివేకం, ఘనత, గాంభీర్యం ఆయనతో పాటుగానే సభామందిరంలోకి పాదం పెట్టేవి'– తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ సభా సారథ్యం గురించి ఆయన హయాంలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్న ఈ దినపత్రిక సంస్థాపక సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు రాసిన మాటలవి. మంగళవారం నాడు మన 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ తన కొత్త విధులను ఆ దార్శనిక పథ నిర్దేశకుడి స్ఫూర్తితో నిర్వర్తించినప్పుడే, తన బిడ్డ సార్థకనామధేయుడు కావాలన్న మాతృమూర్తి జానకీ అమ్మాళ్ మనోభీష్టాన్ని నెరవేర్చినవారవుతారు.


భారత రాజ్యాంగం ఆవిష్కరించిన ఉత్తమ పాత్ర ఉపరాష్ట్రపతి పదవి. మన అధికార వ్యవస్థలో రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి భావనను అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించినప్పటికీ మన పార్లమెంటరీ పాలనా వ్యవస్థ పరిధిలో ఒక విశిష్టతను సంతరించుకున్న రాజ్యాంగ బాధ్యత అది. ఉపరాష్ట్రపతి ప్రాథమిక విధి రాజ్యసభ (పార్లమెంటు ఎగువసభ)కు అధ్యక్షత వహించడం, దాని కార్యకలాపాలకు పక్షపాత రహితంగా మార్గనిర్దేశం చేయడం. ఈ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడంలో సర్వేపల్లిదే సమున్నత స్థానం. ఆయన తరువాత ఆ పదవిని అధిష్ఠించిన వారిలో ఒక్కరు మినహా తమ బాధ్యతలను ప్రశస్తంగా నిర్వహించినవారే. 14వ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దురదృష్టవశాత్తు తన వ్యవహార సరళితో వివాదాస్పదుడై పదవీకాలం మధ్యలోనే నిష్క్రమించవలసివచ్చింది. ఆ రాజ్యాంగ పదవి మాన్యతను వివాదాల గ్రహణం నుంచి విడిపించి సమున్నతపరచవలసిన బృహత్తర బాధ్యత కొత్త ఉపరాష్ట్రపతిపై ఉన్నది.

ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకొనే లోక్‌సభ (పార్లమెంటు దిగువసభ) సభ్యులకు భిన్నంగా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులు దేశ సమస్యలు, పాలనా వ్యవహారాలు, విస్తృత సమాజ సంబంధ విషయాలపై భావావేశరహిత, విజ్ఞాన సాధికారతతో, సమగ్ర చర్చలు జరిపి ప్రభుత్వానికి సరైన విధాన నిర్దేశం చేస్తూ ప్రజాస్వామ్య పరిపూర్ణతకు దోహదం చేయగలరని మన రాజ్యాంగ నిర్మాతలు భావించారు. ఈ కారణంగానే సాధారణ రాజకీయవేత్తలకు బదులుగా వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఎగువ సభలో ఉండాలని ఆశించారు. అయితే ఇటీవలి కాలంలో రాజ్యసభ సమావేశాలు రాజ్యాంగ నిర్మాతల అభిమతానికి భిన్నంగా ఉంటున్నాయనేది సామాన్యులూ గ్రహించిన సత్యం. పార్లమెంటరీ చర్చలు ప్రభావదాయకంగా, ప్రయోజనకరంగా ఉండాలంటే సభాపతులు తమ విధులు నిష్పాక్షికంగా నిర్వర్తించడంతో పాటు సభా కార్యక్రమాల నిర్వహణలో పాటిస్తున్న నియమ నిబంధనల్లో మౌలిక మార్పులు తీసుకురావలసిన అవసరమున్నది. ఇప్పుడు అనుసరిస్తున్న ఈ నియమ నిబంధనలు వలస పాలకుల కాలం నాటి నిబంధనావళి నవీకరణలే. స్వాతంత్ర్యానికి పూర్వం చట్టసభలు పరిపాలకులకే అనుకూలంగా ఉండేవి. పాలనాపరమైన ఇబ్బందులు ఏర్పడకుండా పార్లమెంటరీ చర్చలను నియంత్రించడమే ఆ నియమ నిబంధనల లక్ష్యంగా ఉండేది. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్యంలో మన చట్టసభలు అసంకల్పితంగా వలసపాలకుల లక్ష్యపరిపూర్తికి అనుకూలమైనవిగా మారిపోవడం మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య దౌర్భాగ్యం. ఈ శోచనీయ పరిస్థితిని తొలగించి, రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించిన విధంగా రాజ్యసభను 'వివేచనా నిలయం' (హౌస్ ఆఫ్ రీజన్)గా తీర్చిదిద్దాలి. ఇందుకు గౌరవనీయ సభ్యులతో సంప్రతింపులు, సమాలోచనలు జరిపి, సభా కార్యక్రమాల కొత్త నిబంధనావళి రూపకల్పనకు కొత్త ఉపరాష్ట్రపతి పూనుకోవాలి. గతం (2007–17)లో ఈ అత్యున్నత పదవిని నిర్వహించిన హమీద్ అన్సారీ తన పదవీ విరమణ చివరిరోజున ఇలా అన్నారు: 'ఏడు దశాబ్దాల స్వాతంత్ర్యంలో ప్రజాస్వామ్యం బాగా వేళ్లూనుకున్నది. ఓటర్లు మరింత అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొంటున్నారు. రాజకీయ రంగంలో పరిణామాలపై సామాన్యులూ విశేష శ్రద్ధ చూపుతున్నారు. అయితే దేశంలో వివిధ స్థాయిలలో రాజకీయ సంస్థలు పనిచేస్తున్న తీరు ఉండవల్సిన విధంగా ఉండడం లేదు'. తన కర్తవ్య పాలనలో సీపీ రాధాకృష్ణన్ ఈ మాటలను సదా గుర్తుంచుకోవాలి.

స్వాతంత్ర్యోద్యమంలోను, ఆ తరువాత మన నాయకులు అనుసరించిన భావసమైక్యతా విధానం మరింత పరిపుష్టమయ్యేందుకు రాజ్యసభ చర్చలు దోహదం చేయాలి. గాంధీజీ ప్రాధాన్యమిచ్చిన వికేంద్రీకరణ పద్ధతులు, ఫూలే–అంబేడ్కర్‌ల సామాజిక న్యాయ దార్శనికత, గ్రామీణ ఉపాధి కల్పనకు చేతివృత్తులను అభివృద్ధిపరచాలనే కమలాదేవి ఛటోపాధ్యాయ ఆలోచన, లౌకికతత్వంలో నెహ్రూ అచంచల విశ్వాసం మొదలైన భావ స్రవంతులు ప్రజా జీవితంలో మరింతగా అంతర్భాగమయ్యేందుకు కృషి చేసేలా పార్లమెంటరీ పెద్దలను కొత్త ఉపరాష్ట్రపతి పురిగొల్పాలి.

మోహన్ భగవత్... కరుణార్ద్ర నేత!





ఈ రోజు సెప్టెంబరు 11.. 'వసుధైవ కుటుంబకం' సూత్రంతో ప్రేరణ పొంది, సామాజిక మార్పు –సామరస్యం, సోదరభావ స్ఫూర్తి బలోపేతం లక్ష్యంగా తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుడి జన్మదినమిది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో అనుబంధంగల లక్షలాది మంది ఆయనను సగౌరవంగా.. ప్రేమాభిమానాలతో పరమ 'పూజ్య సర్‌సంఘ్‌చాలక్' అని పిలుచుకుంటారు. అవును.. నేను చెబుతున్నది మోహన్ భగవత్ గురించే! ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఆయన 75వ జన్మదిన వేడుక నిర్వహించుకోవడం యాదృచ్ఛికం. ఈ సందర్భంగా నా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆ దైవం ఆయనకు దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

మోహన్ భగవత్ కుటుంబంతో నా అనుబంధం ఎంతో లోతైనది. ఆయన తండ్రి దివంగత మధుకర్ రావు భగవత్‌తో సన్నిహితంగా పనిచేసే అదృష్టం నాకు దక్కింది. ఈ అనుభవాన్ని నా రచన 'జ్యోతిపుంజ్'లో విస్తృతంగా వివరించాను. న్యాయ వ్యవస్థతో తన అనుబంధంతో పాటు, దేశ ప్రగతి కోసం ఆయన తనను తాను అంకితం చేసుకున్నారు. గుజరాత్ రాష్ట్రవ్యాప్తంగా 'ఆర్ఎస్ఎస్'ను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. దేశ పురోగమనంపై మధుకర్ రావు తపన ఎంతటిదంటే– తన కుమారుడు మోహన్ రావును భారత పునరుజ్జీవనం దిశగా కృషికి పురిగొల్పింది. మధుకర్ రావు ఒక పరుసవేది కాగా, మోహన్ రావు రూపంలో మరో 'మణి'ని తీర్చిదిద్దారు.

మోహన్ 1970 దశకం మధ్య భాగంలో ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అయ్యారు. 'ప్రచారక్' అంటే– ఏదో ఒక సిద్ధాంతం ఆధారంగా సంబంధిత ప్రబోధాలను ప్రచారం చేసే బాధ్యతగా కొందరు అపార్థం చేసుకోవచ్చు. కానీ, ఆర్ఎస్ఎస్ పనితీరు గురించి తెలిసిన వారికి 'ప్రచారక్' అనేది సంస్థలో కీలక పని సంప్రదాయమనే వాస్తవం చక్కగా తెలుసు. గడచిన వంద సంవత్సరాలుగా దేశభక్తి ప్రేరణగా వేలాది యువత 'భారతదేశమే ప్రధానం' లక్ష్యంగా దాన్ని సాకారం చేసే దిశగా తమ జీవితాలను అంకితం చేశారు. ఇందుకోసం వారు ఇల్లూవాకిలీ సహా కుటుంబ బంధాలన్నిటినీ వదులుకుని దేశమాత సేవలో తరించారు.

ఆయన 'ఆర్ఎస్ఎస్'లో ప్రవేశించిన తొలినాళ్ల సమయాన్ని భారత చరిత్రలో అంధకార యుగంగా అభివర్ణించవచ్చు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత క్రూర ఎమర్జెన్సీ విధించిన సమయమది. ప్రజాస్వామ్య సూత్రాలను గౌరవిస్తూ, దేశం ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించే ప్రతి వ్యక్తీ దీన్ని ప్రతిఘటిస్తూ ఉద్యమంలో దూకడం అత్యంత సహజం. అదే తరహాలో మోహన్ సహా అసంఖ్యాక 'ఆర్ఎస్ఎస్' స్వయంసేవకులు కూడా ఇలాగే చేశారు. మహారాష్ట్రలోని గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో... ముఖ్యంగా విదర్భలో ఆయన విస్తృతంగా పనిచేశారు. తద్వారా పేదలు, అణగారిన వర్గాల సమస్యలను ఆకళింపు చేసుకునే అవకాశం ఆయనకు లభించింది.

> అవిచ్ఛిన్నత, అన్వయం.. మోహన్ జీ మనఃపూర్వకంగా భావించిన, తన కార్యశైలిలో ఇముడ్చుకున్న ముఖ్యమైన అంశాలపై ఆలోచిస్తే ఈ రెండూ నాకు స్ఫురిస్తాయి. మనం గర్వించే సంస్థాగత భావజాలపరంగా రాజీపడకుండా, అదే సమయంలో మారుతున్న సామాజిక అవసరాలకూ అనుగుణంగా.. సంక్లిష్టమైన అంశాల్లోనూ ఆయన సమర్థంగా సంస్థను ముందుకు నడిపారు.

అనంతర కాలంలో భగవత్ 'ఆర్ఎస్ఎస్'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయా విధుల నిర్వహణలో ఆయన అసమాన నైపుణ్యం ప్రదర్శించారు. ముఖ్యంగా 1990 దశకంలో 'అఖిల భారతీయ శారీరక్ ప్రముఖ్' అధిపతిగా మోహన్ పనిచేసిన కాలాన్ని చాలామంది స్వయంసేవకులు నేటికీ ఎంతో ప్రేమాభిమానాలతో స్మరించుకుంటుంటారు. ఆ సమయంలో ఆయన బిహార్ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సంఘ్ నిర్మాణం కోసం అవిరళ కృషి చేశారు. జనజీవనంలోని క్షేత్రస్థాయి సమస్యలపై ఆయన అవగాహనను ఈ అనుభవాలు మరింత పెంచాయి. అటుపైన 21వ శతాబ్దారంభంలో ఆయన 'అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్'గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2000లో 'సర్‌కార్యవాహ్' అయ్యారు. ఈ రెండు పదవుల్లోనూ తనదంటూ ప్రత్యేక పనిశైలిని ఆచరణలో పెట్టారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితులను సులువుగా, కచ్చితత్వంతో నిభాయించారు. ఆ తర్వాత 2009లో 'సర్‌సంఘ్‌చాలక్'గా ఆర్ఎస్ఎస్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ అందరికీ ఉత్తేజమిచ్చే విధంగా పనిచేస్తున్నారు.

ఈ పదవీ నిర్వహణ సంస్థాగత బాధ్యతను మించిన కర్తవ్యం. సంస్థ ఉద్దేశాలు, నిర్దేశాలపై స్పష్టత, భరతమాతపై అపార ప్రేమగల అసాధారణ వ్యక్తులు త్యాగం, అచంచల నిబద్ధతతో ఈ బాధ్యతలకు కొత్త నిర్వచనమిచ్చారు. మోహన్ భగవత్ ఈ గురుతర బాధ్యతను అనితర సాధ్యంగా నిర్వహించడంతోపాటు స్వీయ శక్తిసామర్థ్యాలు, మేధస్సు జోడించి కరుణార్ద్ర నాయకత్వాన్ని ఆచరణాత్మకంగా చూపారు. 'దేశమే ప్రధానం' అన్న సూత్రమే వీటన్నిటికీ ప్రేరణ!

అవిచ్ఛిన్నత, అన్వయం.. మోహన్ జీ మనఃపూర్వకంగా భావించిన, తన కార్యశైలిలో ఇముడ్చుకున్న ముఖ్యమైన అంశాలపై ఆలోచిస్తే ఈ రెండూ నాకు స్ఫురిస్తాయి. మనం గర్వించే సంస్థాగత భావజాలపరంగా రాజీపడకుండా, అదే సమయంలో మారుతున్న సామాజిక అవసరాలకూ అనుగుణంగా.. సంక్లిష్టమైన అంశాల్లోనూ ఆయన సమర్థంగా సంస్థను ముందుకు నడిపారు. ఆయనకు యువతతో సహజమైన అనుబంధం ఉంది. ఎప్పుడూ పెద్ద సంఖ్యలో యువతను సంఘ్‌పరివార్‌లో భాగస్వాములను చేయడంపై దృష్టి సారించారు. ఆయనెప్పుడూ బహిరంగ చర్చల్లో పాల్గొంటూ, ప్రజలతో సంభాషిస్తూ కనిపిస్తారు. నేటి గతిశీల, డిజిటల్ ప్రపంచంలో ఇది అత్యంత ప్రయోజనకరమైన అంశం.

స్థూలంగా చెప్పాలంటే, వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రస్థానంలో భగవత్ జీ బాధ్యతలు నిర్వర్తించిన కాలం అత్యంత విప్లవాత్మక సమయమని చెప్పక తప్పదు. యూనిఫాంలో మార్పు నుంచి శిక్షా వర్గలలో (శిక్షణ శిబిరాలు) మార్పుల వరకు.. ఆయన నేతృత్వంలో అనేక ముఖ్యమైన మార్పులు వచ్చాయి.

మానవత్వం విపత్తుతో తలపడిన కోవిడ్ కాలంలో మోహన్ జీ కృషి నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. మన జీవితకాలంలో మునుపెన్నడూ చూడని ఆ విపత్తు వేళ ఆర్ఎస్ఎస్ సాంప్రదాయక కార్యకలాపాల కొనసాగింపు సవాలుగా మారింది. సాంకేతికత వినియోగాన్ని పెంచాలని మోహన్ జీ సూచించారు. ప్రపంచవ్యాప్త సవాళ్ల నేపథ్యంలో.. సంస్థాగత యంత్రాంగాలను అభివృద్ధి చేస్తూనే, అంతర్జాతీయ పరిణామాలనూ నిశితంగా పరిశీలించారు. స్వీయ రక్షణ చర్యలతోపాటు ప్రజా రక్షణను కర్తవ్యంగా భావిస్తూ.. ఆపన్నులను ఆదుకునేందుకు ఆ సమయంలో స్వయంసేవకులంతా శక్తివంచన లేకుండా కృషి చేశారు. అనేకచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించాం. కష్టపడి పనిచేసే మా స్వయంసేవకులను కూడా మేం కోల్పోయాం. కానీ మోహన్ జీ స్ఫూర్తి వల్ల వారి దృఢ సంకల్పం ఎప్పుడూ సడలలేదు.

ఈ ఏడాది మొదట్లో నాగ్‌పూర్‌లో మాధవ్ నేత్ర చికిత్సాలయ ప్రారంభోత్సవం సందర్భంగా.. ఆర్ఎస్ఎస్ ఒక అక్షయవటం (మర్రివృక్షం) లాంటిదని, అది మన దేశ సంస్కృతిని, సామూహిక చైతన్యాన్ని శక్తిమంతం చేస్తుందని నేను వ్యాఖ్యానించాను. ఈ అక్షయవట మూలాలు లోతైనవి, బలమైనవి. ఎందుకంటే అవి విలువలతో కూడుకున్నవి. ఈ విలువలను పెంపొందించడానికి, ముందుకు తీసుకెళ్లడానికి మోహన్ భగవత్ జీ అంకితభావంతో వ్యవహరించిన విధానం నిజంగా స్ఫూర్తిదాయకం.

మోహన్ జీ వ్యక్తిత్వంలో మరో అద్భుత లక్షణం ఆయన మృదుభాషణం. ఆయన అందరి మాటా వింటారు. ఈ లక్షణం విస్తృత దృక్పథానికి నిదర్శనం. ఇదే ఆయన వ్యక్తిత్వానికి, నాయకత్వానికి శోభనిచ్చింది.

వివిధ ప్రజా కార్యక్రమాలపై ఆయన చూపించిన ఆసక్తి గురించి కూడా నేను రాయాలనుకుంటున్నాను. స్వచ్ఛ భారత్ మిషన్ నుంచి బేటీ బచావో బేటీ పఢావో వరకు.. ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా భాగస్వామ్యం వహించాలని మొత్తం ఆర్ఎస్ఎస్ కుటుంబానికీ ఆయన ఎప్పుడూ చెప్పేవారు. సామాజిక శ్రేయస్సు కోసం మోహన్ జీ 'పంచ పరివర్తన్' అందించారు. సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ అవగాహన, జాతీయ భావన, పౌర విధులు ఇందులోని అంశాలు. జీవితంలోని ప్రతి దశలో ఇవి భారతీయులకు స్ఫూర్తినిస్తాయి. బలమైన, సంపన్నమైన దేశాన్ని చూడాలని ప్రతి స్వయంసేవక్ కలలుగంటాడు. దాన్ని సాకారం చేయడం కోసం.. స్పష్టమైన దార్శనికత, నిర్ణయాత్మక కార్యాచరణ రెండూ కావాలి. మోహన్ జీలో ఈ రెండు లక్షణాలను పుష్కలంగా ఉన్నాయి. భగవత్ జీ ఎప్పుడూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' గురించి బలంగా చెప్తారు. భారతదేశ వైవిధ్యాన్ని గట్టిగా నమ్మే వ్యక్తి. దేశంలో భాగమైన అనేక విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఘనంగా చాటుతారు.

> భగవత్ జీ ఎప్పుడూ 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' గురించి బలంగా చెప్తారు. భారతదేశ వైవిధ్యాన్ని గట్టిగా నమ్మే వ్యక్తి. దేశంలో భాగమైన అనేక విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ఘనంగా చాటుతారు.

> సామాజిక శ్రేయస్సు కోసం మోహన్ జీ 'పంచ పరివర్తన్' అందించారు. సామాజిక సామరస్యం, కుటుంబ విలువలు, పర్యావరణ అవగాహన, జాతీయ భావన, పౌర విధులు ఇందులోని అంశాలు. జీవితంలోని ప్రతి దశలో ఇవి భారతీయులకు స్ఫూర్తినిస్తాయి. బలమైన, సంపన్నమైన దేశాన్ని చూడాలని ప్రతి స్వయంసేవక్ కలలుగంటాడు. దాన్ని సాకారం చేయడం కోసం.. స్పష్టమైన దార్శనికత, నిర్ణయాత్మక కార్యాచరణ రెండూ కావాలి. మోహన్ జీలో ఈ రెండు లక్షణాలను పుష్కలంగా ఉన్నాయి.

తన షెడ్యూల్ ఎంత బిజీగా ఉన్నా.. మోహన్ జీ సంగీతం, పాటల వంటి అభిరుచులకు ఎప్పుడూ సమయం కేటాయించారు. వివిధ భారతీయ సంగీత వాయిద్యాలలో ఆయన చాలా ప్రజ్ఞాశాలి అని కొద్ది మందికే తెలుసు. చదవడం పట్ల ఆయనకున్న మక్కువ ఆయన ప్రసంగాలు, సంభాషణలలో కనిపిస్తుంది.

మరి కొన్ని రోజుల్లో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఈ సంవత్సరం విజయదశమి, గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఒకే రోజున జరగడం కూడా ఒక ఆనందకరమైన యాదృచ్ఛికం. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న లక్షలాది మందికి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టం అవుతుంది. ఈ సమయంలో మోహన్ జీ వంటి తెలివైన, కష్టపడి పనిచేసే సర్ సంఘచాలక్ సంస్థను నడిపిస్తున్నారు. మనం అంతరాలకూ హద్దులకూ అతీతంగా ఎదిగి, ప్రతి ఒక్కరినీ మనవారిగా భావిస్తే సమాజంలో నమ్మకం, సోదరభావం, సమానత్వం బలపడుతుందని చాటిన మోహన్ జీ వసుధైక కుటుంబానికి సజీవ ఉదాహరణగా చెబుతూ నేను ముగిస్తున్నాను. దీర్ఘాయుష్షుతో, ఆరోగ్యంతో మోహన్ జీ భరతమాత సేవలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను.



> మరికొన్ని రోజుల్లో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఈ సంవత్సరం విజయ దశమి, గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి, ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఒకే రోజున జరగడం కూడా ఒక ఆనందకరమైన యాదృచ్ఛికం. భారతదేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న లక్షలాది మందికి ఇది ఒక చరిత్రాత్మక ఘట్టం అవుతుంది. ఈ సమయంలో మోహన్ జీ వంటి తెలివైన, కష్టపడి పనిచేసే సర్ సంఘచాలక్ సంస్థను నడిపిస్తున్నారు.

• నరేంద్ర మోదీ
భారత ప్రధానమంత్రి

నాటి సంస్కరణలను సమీక్షించాల్సిన తరుణం

ఆర్థిక వ్యవస్థలో సంభవిస్తున్న పరిణామాలు పేద మధ్య తరగతి ప్రజల వాస్తవ ఆర్థిక స్థితిని మరింత దిగజార్చుతున్నాయి. 1974లో డబుల్ డిజిట్ (28శాతం)లో ఉన్న ధరల పెరుగుదల సూచిక (ద్రవ్యోల్బణం) క్రమంగా తగ్గుతూ 2002లో 4.30శాతంగా నమోదయింది. రెండు సంవత్సరాల నుంచి మరీ తగ్గుతూ గత మే నెలలో 2.59శాతం మాత్రమే నమోదు అయిందని రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధానకర్తలు హర్షిస్తూ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ద్రవ్యోల్బణం కనిష్ఠ స్థాయికి వచ్చింది వాస్తవమే కానీ అది ఆర్థిక వ్యవస్థ స్తబ్ధతకు నిదర్శనమని ప్రభుత్వ ఆర్థికవేత్తలు గుర్తుచేయడం లేదు.

ధరలు నియంత్రణలో ఉండడం వినియోగదారుల పక్షాన ఆహ్వానించదగిన అంశమే అయినప్పటికీ ద్రవ్యోల్బణ ప్రభావం నగర ప్రజలకు, గ్రామీణ ప్రజలకు ఒకే తీరుగా ఉండదు. ఆహార ధాన్యాల ధరల సూచికలు పారిశ్రామిక ఇతర వినియోగ వస్తువుల ధరలు సూచికలు రంగాల వారీగా వేరువేరుగా ఉంటాయి. రిజర్వ్ బ్యాంక్ సాధారణ వినియోగదారుల ధరల సూచికను మాత్రమే పరిగణిస్తున్నది. కొద్ది సంవత్సరాల నుంచి దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల వృద్ధిరేటుతో పాటు మొత్తం ఉత్పత్తి పెరుగుతూ వస్తున్నది. 1950లో కేవలం 50 మిలియన్ టన్నుల ఆహార ఉత్పత్తి జరగగా అది ప్రస్తుత సంవత్సరం 330 మిలియన్ టన్నులకు చేరింది. ఇది దేశ చరిత్రలోనే అత్యధిక ఉత్పత్తి. వ్యవసాయ ఉత్పత్తి పెరగడం వలన వాటి ధరలు నియంత్రణలో ఉండడం, ఆహార ధాన్యాల ధరల సూచిక కేవలం 0.95 శాతం మాత్రమే నమోదు కావడం విశేషమే. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం కూడా ఒక కారణం కావచ్చు. సాధారణ ధరల సూచిక నిర్మాణంలో కేవలం సంప్రదాయంగా ఆహార ఉత్పత్తులు ఇతర అత్యవసర సరుకులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. మన ప్రజలు విద్య, వైద్య రంగాలపై చేస్తున్న ఖర్చును నగరాలలో ద్రవ్యోల్బణం సూచికలో పరిగణించడం లేదు. ప్రభుత్వ రంగ విద్య, వైద్య రంగాలు నిర్వీర్యమై పేద వర్గాలు కూడా అత్యధిక డబ్బు చెల్లిస్తూ ఆయా సేవలు కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రజలు చేస్తున్న ఈ వ్యయాన్ని ధరల సూచిక అంచనాలో పరిగణించడం లేదు.



> పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ మన దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల గురించి ఇప్పుడు మారుతున్న పరిస్థితులలో పునరాలోచించాలి. వివిధ వర్గాల ప్రజలపై ఆర్థిక సంస్కరణల మంచీ చెడులను అంచనా వేయాలి. వ్యవస్థ మొత్తం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోకముందే తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. మధ్యతరగతి ప్రజలపై ప్రత్యక్ష పన్నులను తగ్గించి ప్రభుత్వ, ప్రైవేటు అసంఘటిత రంగాలలో కనీస వేతనాలను, రైతులకు గిట్టుబాటు ధరలను పెంచాలి.

దేశంలో 50 శాతం ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. కోవిడ్ తర్వాత ప్రైవేట్ విద్య, వైద్య రంగాల సేవలతో పాటు మందుల ధరలు అనేక రెట్లు పెరిగినప్పటికీ దాన్ని ధరల సూచిక అంచనాలలో పరిగణించడం లేదు. ఉన్నత విద్యను అభ్యసించిన దేశ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ ఆదాయ అవకాశాలను కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి. అసంఘటిత రంగాలలో కూడా ముఖ్యంగా నిర్మాణ రంగంలో శ్రామికుల అడ్డాల వద్ద ఉపాధి లభించక నిరాశకు గురవుతున్నారు. కొనుగోలు శక్తి లేక రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కుప్పకూలినాయి. సాంఘిక భద్రత లేక కోట్లాది శ్రామికులు అశాంతికి లోనవుతున్నారు. ఇది ఆర్థిక వ్యవస్థకు శుభ సూచకం కాదు. గత రెండు దశాబ్దాల నుంచి వివిధ రంగాలలో కార్పొరేటీకరణ జరుగుతున్న పరిస్థితులలో వేతనాలు నియంత్రించబడుతున్నాయి, అదనపు పని గంటలు కూడా పెరుగుతున్నాయి. కార్పొరేట్ – అసంఘటిత రంగంలో ఒకటి రెండు శాతం ఉద్యోగులకు మాత్రమే ఒక మోస్తరు స్థాయి వేతనాలు చెల్లిస్తున్నారు, అత్యధిక శాతం కార్మికులకు వేతనాలు తగ్గిపోతున్నాయి. మరోపక్క కార్పొరేట్ సంస్థల వార్షిక నికరాదాయాలు అనేక రెట్లు పెరుగుతున్నాయి. ఇదే మన దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారు.

పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ మన దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల గురించి ఇప్పుడు మారుతున్న పరిస్థితులలో పునరాలోచించాలి. వివిధ వర్గాల ప్రజలపై ఆర్థిక సంస్కరణల మంచీ చెడులను అంచనా వేయాలి. వ్యవస్థ మొత్తం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోకముందే తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. మధ్యతరగతి ప్రజలపై ప్రత్యక్ష పన్నులను తగ్గించి ప్రభుత్వ, ప్రైవేటు అసంఘటిత రంగాలలో కనీస వేతనాలను, రైతులకు గిట్టుబాటు ధరలను పెంచాలి.

ప్రధానమంత్రి మోదీ మన ఆర్థిక వ్యవస్థలో, ఆదాయ పంపిణీలో గల లోపాలను సవరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూనే తగిన స్థాయిలో వేతనాలు చెల్లించనిదే సమగ్ర డిమాండ్ పెరగడం సాధ్యపడదనీ 1929–30 నాటి మహా ఆర్థిక మాంద్యం సందర్భంలో ప్రముఖ ఇంగ్లీష్ అర్థశాస్త్రవేత్త జె.ఎం.కీన్స్ చెప్పిన విధంగా కార్పొరేటు సంస్థలకు ఊడిగం చేయడం కాస్త మాని, అసంఘటిత శ్రామికుల పనిగంటలు తగ్గిస్తూ వేతనాలు పెంచడం ద్వారానే ఆర్థిక వ్యవస్థలో ఏర్పడుతున్న మాంద్యం లక్షణాలను నివారించడానికి వీలవుతుందని విధానకర్తలు గుర్తెరగాలి. నిర్లక్ష్యం చేస్తే నిరాటంకంగా దోపిడీ చేసే కార్పొరేట్ వ్యవస్థతో పాటు, దాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు కూడా ప్రజల ఆగ్రహానికి మట్టికరిచే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.

○ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ఆధిపత్యం కోసం అసంబద్ధ వాదనలు!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లయినా అన్ని రంగాల్లో ఆంధ్రాధిపత్యం కొనసాగుతున్న నేపథ్యంలో, అదనంగా ఉత్తరాది ఆధిపత్యం చొచ్చుకొస్తున్న సందర్భంలో, 'తెలంగాణ పరిరక్షణ వేదిక' ఏర్పడిన సంగతి, నెల నెలా ఒక్కొక్క రంగంలో ఆంధ్రాధిపత్యం గురించి రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ పరంపరలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహం ఏర్పాటు, మరో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్మృతి వనంకు స్థలం ఇస్తున్నట్లు గత నెలలో వార్తలు వచ్చిన నేపథ్యంలో 'మాకెందుకు మీ విగ్రహాలు' అనే శీర్షికన పైన పేర్కొన్న కొన్ని తీర్మానాలు చేసిందీ పాఠకులు గమనించి ఉంటారు.

ఈ తీర్మానాలకు స్పందనగా బి.ఆర్. బాపూజీ జూలై 29న ఆంధ్రజ్యోతి పత్రికలో రాసిన 'ప్రాంతీయ అస్తిత్వం: భ్రమలూ, వాస్తవాలూ!' అనే వ్యాసంలో పాత వాదననే మళ్ళీ వినిపించినారు. ఆ పాచి వాదనకు కొత్త పాఠకుల కోసం పాత సమాధానాన్నే మళ్ళీ ఇవ్వాల్సి వస్తున్నది.

ఒకటి– 'ప్రాంతీయ అస్తిత్వ స్పృహ కలిగించే భ్రమ' ఆ ప్రాంతంలో ఉన్న అసమానతలను (వర్గ, కుల, లింగ, తదితర) వైరుధ్యాలను చూడనివ్వదు. 'స్థానికంగా ఉన్న ఇన్ని రకాల అసమానతల్ని వైరుధ్యాల్ని ప్రాంతీయ అస్తిత్వ స్పృహ అనే మాయ తెర కప్పివేస్తుంది' ఇదీ బాపూజీగారి వాదన.

ఈ ఎరుక మాకు తెలియనిది కాదు. ఈ అసమానతల వల్ల క్షోభపడే ప్రతి వర్గం తన అస్తిత్వ రక్షణ కోసం పోరాడుతూనే ఉన్నది. ఎమ్మార్పీఎస్ చేసిన ఉద్యమం, బి.సి. రిజర్వేషన్ల కోసం నడుస్తున్న ఉద్యమం అందుకు ప్రబల నిదర్శనాలు. అలాగే ముస్లింలు, స్త్రీలు, ఆదివాసీలు ఎవరైనా, అందరూ అన్ని పోరాటాలను చేయరు. తమ పోరాటం తాము చేస్తరు. మేం ప్రాంత అసమానత గురించి చేస్తున్నం. వర్గ ప్రాతిపదికన చేసే పోరాటానికి ఇవేవీ ఆటంకం కాదు.

రెండు– ఉద్యమ కాలంలోని 'సామాజిక తెలంగాణ', 'ప్రజాస్వామిక తెలంగాణ' నినాదాలు తెరమరుగైనవి అనేది ఆయన వాదన. జాతీయోద్యమ కాలంలో కూడ దేశ స్వాతంత్ర్యానికంటే సామాజిక అసమానతల పరిష్కరణ ముఖ్యమనీ, ఆర్థిక అసమానతల నిర్మూలన ముఖ్యమనీ వాదనలు వచ్చినవి. (అందుకే అంబేద్కరిస్టుల మీద, కమ్యూనిస్టుల మీద జాతీయోద్యమ వ్యతిరేకులనే నింద వేసినారు). దేశ విముక్తి తర్వాత ఈ వాదనలు కనుమరుగు కాలేదు. అట్లాగే తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడ పైన పేర్కొన్న నినాదాలు కొనసాగుతూనే ఉన్నవి. మరి బి.ఆర్. బాపూజీ బాధ ఏమిటి? ఆ నినాదాల లక్ష్యంమీద దృష్టిపెడితే తమ ప్రాంత ఆధిపత్యం మీద దృష్టి తగ్గుతది అనే.

మూడు– అంబేడ్కర్, ఫూలే, జగ్జీవన్‌రామ్, గాంధీలు కూడా స్థానికేతరులే కాబట్టి వాళ్ల విగ్రహాల్ని కూడా వారి ప్రాంతాలకు తరలించాలి కదా అన్నది బి.ఆర్. బాపూజీ మరో వాదన.

అంబేడ్కర్ తదితరులు ప్రాంతాలకతీతంగా దేశం మొత్తానికీ ఐకన్స్. వాళ్లెవరూ మా ఐడెంటిటీని భంగపరిచే సమస్యతో సంబంధం ఉన్నవారు కాదు. పైగా అంబేద్కర్ చిన్న రాష్ట్రాల అనుకూలవాది. ఫూలే సకల ఆధిపత్యాలను ధిక్కరించిన యోధ.

మా అస్తిత్వాన్ని ఏనుగు తొక్కినట్టు తొక్కిన వారితోనే మా పేచీ అంతా. 369 మందిని పొట్టనబెట్టుకున్న కాసు బ్రహ్మానందరెడ్డికి ఆ మహానుభావులకి పోలిక ఏమిటి? "తెలుగు తేజం" పేరుతో తెలంగాణ ఆక్రమణకు నాలుగులేన్ల దారి వేసిన ఎన్టీఆర్‌కు, ఆ శిఖర సమానులకు పోలిక ఏమిటి? తెలంగాణ ఉద్యమాన్ని చీల్చి చెండాడిన రాజశేఖరరెడ్డికి ఆ దార్శనికులకు పోలిక ఏమిటి?



> ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు. టాంక్ బండ్ మీద మీ విగ్రహాలు మీరు తీసుకెళ్తే తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాలు నెలకొల్పే విషయంలో మా లిస్ట్ తయారుగా ఉంది. అందులో వివిధ సామాజిక వర్గాల నిష్పత్తి కూడ సిద్ధంగా ఉంది.

తెలంగాణలో ఉన్న విగ్రహ వ్యక్తుల పట్ల మాకు వ్యతిరేకత లేదు. వాళ్ళు మీ ప్రాంత ఆధిపత్య ప్రతీకలు, మీ భావజాల ప్రతీకలు కావడం పట్లనే మా వ్యతిరేకత. వాళ్ళు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కాబట్టి ఇక్కడ స్థానం ఉండాలంటే, మా ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, మా పి.వి. నరసింహారావు, మా అంజయ్య విగ్రహాలెన్ని ఉన్నవి మీ ప్రాంతంల?

నాలుగు – '2009 టాంక్‌బండ్ ఘటన తర్వాత (మిలియన్ మార్చ్), ఈ వార్తవల్ల (తెలంగాణ పరిరక్షణ వేదిక తీర్మానాల వార్త) మరోసారి తేలింది ఏమంటే విగ్రహాలకు ప్రాంతీయ భేదాలుంటాయ'ని, ఆయన మరో ఉవాచ.

అవును కచ్చితంగా ఉంటయ్. ఉండగూడదనేది ఆదర్శవాద ముసుగులోని ఆధిపత్య భావన.

అయిదు– "ప్రాంతీయ అస్తిత్వ మత్తులో అందరినీ నెత్తిన పెట్టుకోవాలా" అనేది ఇంకో వక్రీకరణ.

ఆధిపత్య అహంకారానికి 'అస్తిత్వం మత్తే' సరైన జవాబు. ఎవరిని నెత్తిన పెట్టుకోవాలో మేం నిర్ణయించుకుంటం. అడగడానికి మీరెవరు? టాంక్ బండ్ మీద మీ విగ్రహాలు మీరు తీసుకెళ్తే తెలంగాణ స్ఫూర్తిదాతల విగ్రహాలు నెలకొల్పే విషయంలో మా లిస్ట్ తయారుగా ఉంది. అందులో వివిధ సామాజిక వర్గాల (కుల, లింగ, మత) నిష్పత్తి కూడ సిద్ధంగా ఉంది. చరిత్రలో 'ఎవరిని తిరస్కరించాలో, ఎవరిని ప్రతిష్ఠించాలో' మాకు తెలుసు. మీ లాంటి వాళ్ల పిడివాదనా తెలుసు. తెలంగాణ అస్తిత్వం మత్తు అని, భారతదేశ స్వాతంత్ర్యం బూటకం అని మీరు అంటే అది భౌగోళిక విముక్తి అని మేం అంటం. మేం గతంలోని (భారతదేశ, తెలంగాణ) మంచిని స్వీకరిస్తం. అందుకే మిలియన్ మార్చ్‌లో శ్రీశ్రీ, జాషువా విగ్రహాలను కూలగొట్టేందుకు సందేహించినారు మావారు.

ఆరు– రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, పౌరహక్కుల వ్యతిరేక తదితర చట్టాల గురించి, ప్రస్తావించినారు. యెస్, వాటి గురించి పోరాడాలె. పోరాడుతం. ప్రాదేశిక అసమానతల గురించీ పోరాడుతం.

■ తెలంగాణ పరిరక్షణ వేదిక



డయేరియా లక్షణాలతో బాధపడుతున్న బాలుడు



● అందాల సంయుక్త

నటి సంయుక్త మీనన్ బుధవారం నగరంలో సందడి చేసింది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. ప్రైవేట్ కార్యక్రమం పూర్తయ్యాక ఆమె అభిమానులతో ముచ్చటించారు.

డయేరియా కలవరం

న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కోరలు చాస్తోంది. ఏ ఇంట్లో చూసినా డయేరియా లక్షణాలతో బాధపడుతున్న వారే కనిపిస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా వందల మంది మంచం పట్టారు. అనేక మంది వాంతులు, విరేచనాలు వంటి డయేరియా లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతిచెందగా, 70 మందికి పైగా ఆసుపత్రుల్లో చేరారు. అనేక మంది వ్యాధి లక్షణాలతో బాధపడుతుండగా, అధికారులు మాత్రం చూసీచూడనట్టుగానే వ్యవహరిస్తున్నారు.

న్యూరాజరాజేశ్వరి పేటలో ఇద్దరు మృతి, 70 మందికి అనారోగ్యం





వాంతులు, విరేచనాలతో అపస్మారక స్థితికి చేరిన మహిళను ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మృతురాలు శ్రీరామ నాగమణి, లక్ష్మీకాంతం (ఫైల్)

- చవితి పందిళ్లలో ఫుడ్ పాయిజనింగ్ అంటున్న అధికారులు
- మంచినీరు రంగుమారి వస్తోందని స్థానికుల ఆరోపణ
- కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు
- మంచినీటి ట్యాంక్ క్లీనింగ్, పైపులైన్లకు మరమ్మతులు
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్యశాఖ సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : న్యూ రాజరాజేశ్వరిపేటతో పాటు నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డయేరియా నివారణకు చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు మాత్రం చవితి పందిళ్లల్లో జరిగిన అన్నసమారాధన కార్యక్రమాల వలన ఫుడ్ పాయిజనింగ్ అయ్యి వాంతులు, విరేచనాలు అవుతున్నాయని చెబుతున్నారు. అయితే, స్థానికులు మాత్రం కలుషిత మంచినీటి కారణంగా ఇలా జరుగుతోందంటున్నారు.

ఫుడ్ పాయిజనింగ్ అంటున్న అధికారులు

ఇటీవల చవితి పందిళ్లలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమాలే ఈ వాంతులు, విరేచనాలకు కారణమని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. సమారాధన కార్యక్రమంలో భోజనాలు మిగతా 6లో..

ప్రతి ఇంట్లోనూ బాధితులు

రాజరాజేశ్వరిపేటలో ఇప్పటి వరకు ఇద్దరు మహిళలు వాంతులు, విరేచనాలతో మృతిచెందారు. అపార్ట్‌మెంట్లలో నివాసం ఉంటున్న శ్రీరామ నాగమణి (61) గత మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆమెను సోమవారం నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ వెనుకవైపు ఉంటున్న కె.లక్ష్మీకాంతమ్మ (85) కూడా ఇవే లక్షణాలతో మూడు రోజుల క్రితం మృతి చెందింది. 70 మందికి పైగా డయేరియా లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో చిన్నపిల్లల నుంచి మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. ప్రతి ఇంట్లోనూ ఇద్దరు నుంచి ముగ్గురు వరకు బాధపడుతున్నారు.

కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు

న్యూ రాజరాజేశ్వరిపేటలో పదుల సంఖ్యలో ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందుకున్న వైద్యశాఖ అధికారులు కేర్ అండ్ షేర్ పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేపట్టారు.

కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి నారాయణ

6

బాధితులను పరామర్శించిన కలెక్టర్



తిరువూరులో..

● జోరువాన

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. తిరువూరులో భారీగా కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి.

మిస్ విజయవాడ ఎంట్రీలకు ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ యువతులకు బంపర్ ఆఫర్. 'మిస్ విజయవాడ' పోటీల ఎంట్రీలకు 'విజయవాడ ఉత్సవ్-2025' నిర్వాహక కమిటీ ఆహ్వానం పలుకుతోంది. కళాశాల విద్యార్థినులు, యువతులు, మహిళలు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. విజయవాడ ఉత్సవ్ వెబ్‌సైట్‌లో ఈ ఎంట్రీలను ఆహ్వానిస్తున్నారు. ఈ పోటీలను మూడు కేటగిరీలుగా మిస్ టీన్ విజయవాడ, మిస్ విజయవాడ, మిస్సెస్ విజయవాడగా వీటిని నిర్వహించనున్నారు. 12-18 ఏళ్లలోపు వారికి మిస్ టీన్, 18-ఆపైబడిన వారికి మిస్ విజయవాడ పోటీలు జరుగుతాయి. 21 ఏళ్ల పైబడిన వివాహితులకు మిస్సెస్ విజయవాడ పోటీలు నిర్వహిస్తారు. పోటీలు ప్రిలిమినరీ రౌండ్, సెమీ, గ్రాండ్ ఫైనల్స్‌గా మూడు రౌండ్లలో జరుగుతాయి. గ్రాండ్ ఫైనల్స్‌లో విజేతలను నిర్ణయిస్తారు.

తరలనున్నరా లేదా?

దసరాకు వెళ్తామన్న కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ అసోసియేషన్

- ఇప్పటి వరకు స్పందించింది లేదు
- సకల సౌకర్యాలతో నున్న మార్కెట్ పూర్తి
- అయినా వెళ్లకుండా మీనమేషాలు
- దసరా నాటికి ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు
- ఇప్పటికైనా కదిలించాలని స్థానికుల వేడుకోలు



కేదారేశ్వరపేట మార్కెట్‌లో ఇరుకుగా ఎగుమతులు, దిగుమతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌ను నున్నకు తరలించడం ప్రహసనంగా మారింది. భారీ వాహనాల కారణంగా ఇక్కడ రోజూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈనెల 22 నుంచి ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 'విజయవాడ ఉత్సవ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కేదారేశ్వరపేటలో పరిస్థితి ఇలాగే ఉంటే, ట్రాఫిక్ సంక్షోభం నెలకొనే పరిస్థితి ఉంది.

లారీలు, కంటైనర్లతో హడావిడి

రోజూ ఉదయాన్నే కేదారేశ్వరపేట మార్కెట్ వద్ద లారీలు, కంటైనర్లు సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తున్నాయి. దీనివల్ల ట్రాఫిక్ స్తంభిస్తోంది. రోడ్లపైనే వాహనాలను దిగుమతులు చేస్తుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, వివిధ పనులపై బయటకు వచ్చే వారికి నరకం కనిపిస్తోంది. ప్రజాప్రతినిధులకు స్థానికులు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదు. అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవట్లేదు.

» అందుబాటులోనే నున్న మార్కెట్

బైపాస్ రోడ్డు వెంబడే నున్న పండ్ల మార్కెట్ పూర్తై ఉంది. 22 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. వంద అడుగుల రోడ్లు, డ్రెయినేజీలు, మరుగుదొడ్లు.. ఇలా అన్ని సదుపాయాలు ఉన్నాయి. దసరా నాటికి వెళ్లిపోతామని కేదారేశ్వరపేట మార్కెట్ అసోసియేషన్ చెప్పినా ఇంతవరకు కదల్లేదు. కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో అసౌకర్యాల నడుమ అనేక ఇబ్బందులకోర్చి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా నున్న వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నా- అసోసియేషన్ నాయకులు మాత్రం కదలనివ్వట్లేదు. షాపులను తమ నియంత్రణలో ఉంచుకుని ఎదురుతిరిగిన వారిని సాగనంపే కార్యక్రమాలు చేస్తుండటంతో తమ వ్యాపారాలు ఎక్కడ దెబ్బతింటాయోనని ఆందోళనతో వ్యాపారులు తప్పక కదలని పరిస్థితి ఏర్పడింది. విజయవాడ ఎంపీతో పాటు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్, జిల్లా యంత్రాంగాలన్నీ కలిసి రంగంలోకి దిగకపోతే తప్ప మార్కెట్ ఇక్కడి నుంచి కదిలే పరిస్థితి లేదు.

రెండో భార్య కూతురు ఓ యువకుడితో ప్రేమాయణంలో ఉండటం ఆ తండ్రికి నచ్చలేదు. వద్దని వారించినా వినే పరిస్థితిలో కుమార్తె లేదు. కట్టలు తెంచుకున్న ఆవేశాన్ని ఆమెపై చూపించాడు. ఇనప రాడ్డుతో కొట్టి చంపేశాడు. ఇందుకు మొదటి భార్య కూతుర్లు సాయం చేశారు. జిల్లాలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా కూపీ లాగుతున్నారు. వివరాల్లోకి వెళితే..

ప్రేమ పగ

రెండో భార్య కూతురిని చంపిన తండ్రి

- మృతదేహం అటవీ ప్రాంతంలో పడేసి పరార్
- ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పట్టుకున్న పోలీసులు?
- నిందితుడు గంజాయి వ్యాపారి



విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మైలవరానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఐదుగురు కుమార్తెలు. రెండో భార్యకు ఒక కుమార్తె. అతడి జీవితంలోకి రెండో భార్య వచ్చాక మొదటి భార్య ముఖం చూపించకుండా వెళ్లిపోయింది. రెండో భార్యతో కలిసి గంజాయి విక్రయించడం అలవాటు చేసుకున్నాడు. ఇలా గంజాయి విక్రయిస్తున్న వీరిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి పంపారు.

ఇనుప రాడ్డుతో కొట్టి హత్య

తల్లిదండ్రులిద్దరూ జైలుకు వెళ్లడానికి ముందు నుంచి వారి 14 ఏళ్ల కుమార్తె జి.కొండూరు మండలం గుంటుముక్కలకు చెందిన యువకుడితో ప్రేమాయణం నడుపుతోంది. తల్లిదండ్రులు జైలుకు వెళ్లాక వీరి ప్రేమ ముదిరింది. తండ్రి జైలు నుంచి వచ్చాక బాలికను ప్రేమిస్తున్న వ్యక్తిపై పగను పెంచుకున్నాడు. అతడి కారణంగానే తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందనుకున్నాడు. ఈ నేపథ్యంలో కూతురు, ఆ ప్రియుడు ఒక తోటలో ఉండగా చూశాడు. అతడితో తిరగొద్దని చెప్పినా ఎందుకు వినట్లేదని కూతురుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాను అతడితోనే ఉంటానని బాలిక ఎదురుచెప్పింది. ఆవేశంతో ఊగిపోయిన తండ్రి ఇనుప రాడ్డు బాలిక తలపై బలంగా కొట్టాడు. బాలిక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన జరిగే సమయానికి మొదటి భార్య ఐదుగురు కుమార్తెలు ఇంట్లోనే ఉన్నారు. వారంతా తండ్రికి సహకరించారు. రక్తం కనిపించకుండా నేలను శుభ్రంగా కడిగేశారు. రక్తపు వాసన మిగతా 6లో..

చచ్చినా వదలరు!

జీజీహెచ్‌లోని పోస్టుమార్టంలో శవబేరాలు

- ప్రతి పనికీ ఓ రేటు కట్టి వసూళ్లు
- కుటుంబ సభ్యుల నుంచి డబ్బు డిమాండ్
- పంచనామాకు టోపీ చాస్తున్న పోలీసులు
- పేదలనూ వదలకుండా పీడిస్తున్న సిబ్బంది
- ప్రమాదాలు, ఆత్మహత్య మృతదేహాలకైతే మరీ ఎక్కువ



విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో జరిగే పోస్టుమార్టానికి వచ్చిన మృతదేహాల్లో ప్రమాదాలు, ఆత్మహత్యలు చేసుకున్నవే ఎక్కువ. ఆ సమయంలో కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చలేరు. మానవత్వంతో వ్యవహరించాల్సిన పోస్టుమార్టం సిబ్బంది రాబందుల్లా డబ్బు కోసం వేధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మృతదేహాన్ని నిల్వ చేయడానికి, వారికి కావాల్సిన వస్తువులు సమకూర్చడానికి అంటూ రకరకాల కారణాలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. అలాగే, గది శుభ్రం చేయడానికి, ఫొటోల కోసం అంటూ అనేక రకాల పేర్లు చెప్పి దండుకుంటున్నారు. ముఖ్యంగా ప్రమాదాలు, మిగతా 6లో..

నెల కిందట నగరంలోని రాణిగారితోటకు చెందిన ఓ భవన నిర్మాణ కార్మికుడు విధులు నిర్వహిస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసు కేసు నమోదుకావడంతో పోస్టుమార్టానికి తరలించారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారి వద్ద అక్కడి సిబ్బంది డబ్బు డిమాండ్ చేశారు. రూ.7 వేలు ఇస్తేనే పోస్టుమార్టం చేస్తామని చెప్పడంతో పేదరికంలో ఉన్న ఆ కుటుంబం రూ.4 వేలు ఇచ్చి పోస్టుమార్టం చేయించుకుంది.

వారం కిందట ఇబ్రహీంపట్నానికి చెందిన యువకుడు వ్యక్తిగత సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు కావడంతో యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. చేతికి అందివచ్చిన కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కుమిలిపోయారు. పోస్టుమార్టం చేయాలంటే రూ.8 వేలు అవుతుందని సిబ్బంది నిర్మొహమాటంగా అడగడంతో పక్కనే ఉన్న మృతుడి స్నేహితులు సుమారు రూ.5 వేలు ఇచ్చి పోస్టుమార్టం చేయించుకున్నారు.

..ప్రాణం పోసేవాడు డాక్టర్. ప్రాణంపోయినా పీక్కుతినే వాళ్లను ఏమంటారు. పైగా కటిక పేదరికాన్ని అనుభవించే పేదలను పిండేసే వాళ్లను ఏమని పిలవాలి. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం వద్ద రోజూ శవాలపై జరిగే పైశాచిక వ్యవహారాలివి. పోస్టుమార్టానికి ఓ రేటు, పంచనామాకు మరో రేటు, ఫొటోలు తీసేందుకు కొంత, మృతదేహాన్ని నిల్వ చేసేందుకు ఇంకొంత.. ఇలా అందినకాడికి దండుకుంటున్నారు. అసలే ఇంటి మనిషిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారికి ఈ దోపిడీ మరింత కుంగదీస్తోంది.



ఆన్‌లైన్ మోసాలకు చెక్

- అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన
- ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు
- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థుల హాజరు
- పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు

6

జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలపాలి
● ఇగ్నైట్ సెల్ సందర్శనలో కలెక్టర్ లక్ష్మీశ 6

రైల్వేస్టేషన్ 6వ నెంబరు ప్లాట్‌ఫారంలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం 6

అధునాతన వైద్యం.. అత్యున్నత ప్రమాణాలే లక్ష్యం
» శ్రీవెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్య



బాలికలతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

బాలికలకు ఎలుకలతో గాయాలపై జేసీ ఆరా

● కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ ● మెనూపై ఆగ్రహం

ఎ.కొండూరు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో బాలికలకు సరైన విద్య, ఆహారం అందజేయకపోతే సిబ్బందికి శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా హెచ్చరించారు. మంగళవారం ఎ.కొండూరు కేజీబీవీ పాఠశాలను జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో కొన్ని రోజులుగా కొందరు బాలికలను ఎలుకలు కొరికి గాయపరుస్తున్నాయి. నిద్రపోవాలంటేనే భయం, భయంగా గడుపుతున్నారు. ఈ విషయంపై జేసీ వివరాలు తెలుసుకున్నారు. తక్షణం కిటికీలకు మెస్ ఏర్పాటు, ఎలుకల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయాలైన పిల్లలకు పాఠశాలలోని వైద్యం చేసి మందులు అందజేయాలన్నారు. గతంలో దాతలిచ్చిన వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో, పిల్లలు బోరులోని నీరు తాగుతున్నారు. ఈ వాటర్ ప్లాంట్ రిపేరు చేయించాలని ఆదేశించారు. బాలికలకు మెను ప్రకారం ఆహారం అందజేయడం లేదని, పప్పు, కూరగాయలు, పండ్లు, ఆహారం అందజేయాలని, మెను ప్రకారం ఇవ్వాలన్నారు. అనంతరం క్లాస్ రూమ్స్, స్టాకను పరిశీలించారు. తిరువూరు ఆర్డీవో కే మాధురి, తహసీల్దార్ కే లక్ష్మీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో కే కేశవరావు, ఇన్‌చార్జి ఏఎస్‌వో శ్యామల పాల్గొన్నారు.



దేవదాయ శాఖ రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ

రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గగుడిలో కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం దేవదాయ శాఖ నూతన రెవెన్యూ కార్యదర్శి హరి జవహర్‌లాల్ దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్, అర్చకులు ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి ఆశీస్సులు అందజేయగా ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు వీ శివప్రసాద్ శర్మ వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆయన విధులు స్వీకరించారు.

రైల్వేస్టేషన్ 6వ నెంబరు ప్లాట్‌ఫారంలో

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ 6వ నెంబరు ప్లాట్‌ఫారంలోని ఆర్ఎంఎస్ వై - డివిజన్ నేషనల్ సార్టింగ్ హబ్ కార్యాలయంలో బుధవారం పోస్టుమాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర్ మూర్తి ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. డివిజన్ సూపరింటెండెంట్ జీవీ బాల సరస్వతి మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం రైల్వే స్టేషన్‌లో ప్రారంభించటం వల్ల ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త ఆధార్ నమోదు, సవరణలకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. ఆర్ఎంఎస్ సిబ్బంది పాల్గొన్నారు.




ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన పోస్టుమాస్టర్ జనరల్ దేవిరెడ్డి శ్రీధర్ మూర్తి

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో

ఎస్సీ వర్గీకరణ చట్టం చేయాలి

● పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి మాదిగలకు 7శాతం మొదటి వరుసలో ఇచ్చేలా చట్టం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ విజ్ఞప్తి చేశారు. మాదిగల మహోద్యమ సభ సన్నాహక సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో చట్టం చేసిన వెంటనే చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ జింఖానా గ్రౌండ్స్‌లో నవంబర్ 18న మాదిగల విజయోత్సవ సభ నిర్వహిస్తామన్నారు. జయప్రదం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మాదిగలకు పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, అధికార ప్రతినిధి త ప్పట హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సృజనరావు, నేతలు ఆలేటి ఏసుపాదం, కే బుజ్జిబాబు పాల్గొన్నారు.



చేతులెత్తి సంఘీభావం ప్రకటిస్తున్న నేతలు

గ్రంథాలయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలి

ధర్నాచౌక్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టులను భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి 2 లక్షల మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి పోరాడుతామన్నారు. డీవైఎఫ్ఐ, ఏపీ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఏపీ గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రావి శారద, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీ రామన్న, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కార్యదర్శి లక్ష్మయ్య, ఏపీ లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ కే జగదీశ్ మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్‌ను జమ చేయాలని, పంచాయతీ, మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు నేరుగా గ్రంథాలయల సంస్థల ఖాతాల్లో జమయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయాలని కోరారు. గ్రంథాలయాల్లోని అన్ని పోస్టులను గ్రంథాలయ విద్యను అభ్యసించిన వారితోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ నేతలు పీ కృష్ణ, పిచ్చయ్య, కృష్ణకాంత్, లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జేఏసీ నేతలు రమేష్, రమణాప్ప, శ్రీకాంత్‌బాబు, ఉష పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలకు చెక్

» అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన
» ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్స్ పోటీలు
» మూడు ఉమ్మడి జిల్లాల నుంచి 360 మంది విద్యార్థులు హాజరు
» పది థీమ్స్‌పై సమస్యల పరిష్కారానికి పోటీపడిన విద్యార్థులు



ధనేకుల ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెమీ ఫైనల్ పోటీలకు హాజరైన విద్యార్థులు

కానూరు/పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాక్‌థాన్-2025 సెమీఫైనల్ పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 30 కళాశాలలు, పలు విశ్వవిద్యాలయాల నుంచి 60 విద్యార్థుల జట్లు హాజరయ్యాయి. ఒక్కో జట్టులో ఆరుగురు చొప్పున 60 జట్లలో మొత్తం 360 మంది ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ 60 జట్లకు క్వాంటమ్ కాంప్యూటింగ్‌కు సంబంధించిన పది థీమ్స్‌ను సమస్య పరిష్కారానికి ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించేలా..

బ్యాంక్ అకౌంట్స్, క్రెడిట్ కార్డు, ఆర్థిక, ఆన్‌లైన్ మోసాలను ముందే గుర్తించి ఏవిధంగా బయటపడచ్చో చెప్పే థీమ్‌ను విద్యార్థులు ఇక్కడ ప్రదర్శించారు. ఇది క్వాంటమ్ క్యాంపిటింగ్ ద్వారానే సాధ్యమని విద్యార్థులు పేర్కొన్నారు. మోసం జరిగి డబ్బుల రికవరీకి కష్టపడటం కన్నా ముందే మోసాన్ని గుర్తించి ఏవిధంగా జాగ్రత్త పడవచ్చో విద్యార్థులు వివరించారు. అదేవిధంగా ట్రేడింగ్, షేర్లు, ఇన్వెస్ట్‌మెంట్ తదితర వాటి నుంచి తక్కువ రిస్కుతో ఎక్కువ బెనిఫిట్ ఏవిధంగా పొందాలో విద్యార్థులు చేసి చూపించారు. ఇలాంటి థీమ్స్‌తో అనేక అంశాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

ఫైనల్స్‌కు 20 టీమ్స్‌లు ఎంపిక

త్వరలో జరిగే అమరావతి క్వాంటమ్‌వాలీ హ్యాకథాన్-2025 ఫైనల్ పోటీలకు ఇక్కడ హాజరైన 60 జట్లలో ఉత్తమంగా ఎంపికైన 20 జట్లను పంపనున్నారు. ఒక్కో థీమ్ నుంచి రెండుజట్లు చొప్పున మొత్తం 20 జట్లను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక చేశారు.

ఆన్‌లైన్ మోసాల నుంచి బయపడవచ్చు



- ఆర్.సందీప్‌కుమార్, పీవీపీ సిద్ధార్థ

ఆన్‌లైన్ మోసాల నుంచి ముందే ఏవిధంగా బయటపడవచ్చునో మా టీమ్ సమస్య పరిష్కారంలో భాగంగా నిరూపించింది. దీనివల్ల మోసాలను ముందే గుర్తించవచ్చు. ఇది అందరికీ ఎంతో ఉపయోగం. ఈకార్యక్రమంలో ఎన్నో కొత్త విషయాలను తాము నేర్చుకున్నాం.

క్షేత్రస్థాయి అంశాలను తెలుసుకున్నా



- జి.వర్షిత, విజ్ఞాన్ యూనివర్సిటీ

అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్-2025 సెమీఫైనల్స్ పోటీలకు హాజరుకావడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక అంశాలను తెలుసుకోగలిగాం. తమ బృందం క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం ద్వారా పలు సమస్యలకు ఏవిధంగా పరిష్కారం చూపవచ్చో చెప్పింది.

ఉద్యోగ కల్పనకు సహాయకారి



- పి.శ్రీహాసిని, వీఆర్ సిద్ధార్థ

రానున్న రోజుల్లో ఉద్యోగ కల్పనకు క్వాంటమ్ కంప్యూటింగ్ ఎంతగానో దోహదపడుతుందని భావిస్తున్నా. క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం వల్ల అన్ని అంశాలల్లో సమయం, డబ్బును ఆదా చేయవచ్చు. దీనిపై మరింతంగా అధ్యయనం చేస్తాం. ప్రభుత్వం కూడా ప్రొత్సహిస్తోంది.

పలు ప్రాజెక్టులను అధ్యాయనం చేశాం



- పాటిబండ్ల నవ్య, ట్రిపుల్ ఐటీ (ఒంగోలు)

సెమీ ఫైనల్స్‌లో పది అంశాలపై ఏర్పాటుచేసిన పలు సమస్యల పరిష్కారం ప్రాజెక్టులను అధ్యయనం చేశా. నిజజీవితంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉద్యోగ రూపకల్పనకు కూడా దోహదపడుతుంది.

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో ఎదగాలి



- డీకేఆర్‌కే రవిప్రసాద్, ధనేకుల డైరెక్టర్

క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులు ఎదిగినప్పుడు వారి భవిష్యత్ బంగారుబాటగా ఉంటుంది. సీఎం చంద్రబాబు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ముందుకు తీసుకువెళుతున్నారు. సెమీఫైనల్స్‌కు తమ కళాశాలను ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

ఆవిష్కరణలకు ప్రోత్సాహం



- రవి కడియాల, ధనేకుల ప్రిన్సిపాల్

క్వాంటమ్ కంప్యూటింగ్ వివిధ ఆవిష్కరణలకు ప్రోత్సాహకంగా ఉంటుంది. హ్యాకథాన్-2025 కేవలం ఒక పోటీ మాత్రమే కాదు, ఒక ఉద్యమం. క్వాంటమ్ ఆలోచనపరులు, ఆవిష్కర్తలను తీర్చిదిద్దే చైతన్యవంతమైన సమాజ నిర్మాణ దిశగా అడుగులు వేస్తోంది.

జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలపాలి

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం చేస్తాయని, సాంస్కృతిక, సామాజిక అంతరాలను తొలగించేందుకు ఉపయోగపడతాయని, రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర స్పోర్ట్స్ విజన్‌కు అనుగుణంగా సమష్టి కృషితో ఎన్టీఆర్ జిల్లాను క్రీడల్లో నెంబర్ వన్‌గా నిలబెడదామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు పతకాలు సాధించేందుకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలను, క్రీడా విధానం విశిష్టతను ఔత్సాహికులకు వివరించేందుకు ఇగ్నైట్ సెల్‌లో అందుబాటులో ఉంచిన ప్రచార సామగ్రితో పాటు వాటర్ స్పోర్ట్స్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, బాక్సింగ్ తదితర క్రీడలకు సంబంధించిన సామగ్రిని ప్రదర్శించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, వివిధ క్రీడల కోచ్‌లు పీ రవికుమార్, కే భాస్కర్, కే జగదీష్, ఎస్ సంతోష్‌కుమార్, ఎస్కే రియాజ్, ఎస్కే ముంతాజ్ బేగం, కే స్వామి, కే చిరంజీవి, నాగేశ్వరరావు, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.



బాణాన్ని ఎక్కుపెడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టిపెట్టండి

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా వివిధ విభాగాల కీలక ప్రగతి సూచికల (కేపీఐ) పురోగతిని రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన 4 సూచికలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ, కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది, ఉద్యాన శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనిదినాల కల్పన, సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించడానికి సంబంధించిన అంశాల్లో నిర్దేశించిన నెలవారీ, త్రైమాసిక, వార్షిక లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు సమష్టిగా కృషిచేయాలన్నారు. సగటు వేతనం రూ.307 ఉపాధి హామీ శ్రామికులకు అందేలా ప్రణాళిక ప్రకారం కృషి చేయాలన్నారు. మండలాల వారీగా లేబర్ మొబిలైజేషన్, సీసీ రహదారుల నిర్మాణం, పశువుల షెడ్లు, జీవాల షెడ్ల నిర్మాణం, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం తదితరాలపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో డ్వామా పీడీ ఏ రాము తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ట్యాక్స్ రిటర్న్స్ తప్పనిసరి

» జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ పరిధిలోని పెన్షనర్లు తప్పకుండా 2024-25కు సంబంధించిన ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలని జిల్లా జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు తెలిపారు. నగరంలోని పెన్షనర్స్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐటీ నుంచి మినహాయింపు పొందిన పెన్షనర్లందరూ నగరంలోని తూర్పు సబ్‌ట్రెజరీ వద్ద ఫార్మ్ 16ను పాన్‌కార్డు చూపించి తీసుకోవాలన్నారు. ట్యాక్స్ పడని పెన్షనర్లు కూడా రూ.7.50 లక్షల వార్షిక ఆదాయం వారికి రూ.3.50 లక్షల వరకు ట్యాక్స్‌లో మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. దీనికోసం టాక్స్ పడనివారు కూడా నిల్ రిటర్న్స్ ఫైల్ చేయాలన్నారు. పెన్షనర్లకు ఇబ్బందిలేకుండా ఆడిటర్‌ను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 450 మందికి రిటర్న్స్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. సైబర్ నేరగాళ్లు ఫేక్‌కాల్స్ చేసి పీపీఓ, ఆధార్, ఐడీ నెంబర్లు అడిగితే ఎవరూ ఇవ్వవద్దని సైబర్‌క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. కొత్త నెంబర్ల నుంచి ఫోన్ వచ్చి ఓటీపీ, బ్యాంకుఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలి. ఎవరు ఫోన్‌చేసినా పెన్షనర్లు వారికి సంబంధించిన సమాచారం ఇవ్వవద్దు. పొరపాటున ఇస్తే అకౌంట్లలోని డబ్బుమొత్తం ఖాళీ అవుతుందన్నారు.

అధునాతన వైద్యం.. అత్యున్నత ప్రమాణాలే లక్ష్యం

» శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్య

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యగా వైద్యులు కృషిచేయాలని శ్రీ వెంకటేశ్వర వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్య అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో 'అధునాతన టెక్నాలజీ-వైద్యవిద్య-జాతీయవిద్యావిధానం-2020'పై ఆన్‌లైన్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు, ఇతర కాలేజీల నిర్వహణమండలి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ, కృత్రిమ మేధ, ఏఐటూల్స్ వంటివి ఉపయోగించుకని సులభంగా వైద్యసేవలు అందించే సృజనాత్మక టెక్నాలజీ నేడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మెడికల్ కాలేజీల్లో ల్యాబులు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర మౌలిక వసతులు పెంచడంతో రోగులకు సాంత్వన ఇచ్చే అవకాశాలు ఉన్నాయని సిద్ధయ్య పేర్కొన్నారు. అధిక సంఖ్యలో శస్త్రచికిత్సలు, ప్రజలకు వైద్యసేవలు చేరువగా తీసుకురావడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. జాతీయ వైద్య కమిషన్(ఏఎంసీ) కూడా ఆ దిశగా కృషిచేస్తోందన్నారు. రోగులతో వైద్యుడు వ్యవహరించాల్సిన తీరుతోపాటు నైతిక తను ఒక అంశంగా వైద్యవిద్యలో చేర్చారని, వైద్యవిద్య పూర్తిచేసుకుని బయటకు వచ్చే విద్యార్థి మంచి వైద్యుడిగా సేవలందించడానికి ఇది ఉపకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం కేవలం థియరీ పరీక్షలతోఎంబీబీఎస్ పూర్తిచేయడమే కాకుండా ప్రాక్టీస్‌లోని అనేక అంశాల్లో విద్యార్థులు సామర్థ్యం పెంచుకోవడం చాలా కీలకమన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ ప్రీక్లినికల్ ట్రైనింగ్‌ను క్లినికల్ ట్రైనింగ్‌లో భాగం చేశారని తెలిపారు. మెడికల్ కాలేజీల్లో స్కిల్‌ల్యాబ్‌లను తప్పనిసరి చేశారన్నారు. రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ, యూనివర్సిటీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా మెడికల్ కాలేజీల యాజమాన్యాలు నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్(అకడమిక్) కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ తుమ్మలూరి సిద్ధయ్యను సన్మానిస్తున్న హెల్త్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి తదితరులు

చదువుల్లో టాపర్..

ఆవేశంతో జైలు పాలు

నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి: పుట్టింది నిరుపేద కుటుంబం.. చిన్నతనం నుంచే చదువుపట్ల ఎనలేని మమకారం.. ఏ పరీక్ష రాసినా టాపర్‌గా నిలిచే సత్తా.. ఓ వైపు సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటూనే... మరోవైపు ఎంటెక్ చదువుతున్న ఆ విద్యార్థి ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టేవాడు. అలాంటి యువకుడు క్షణికావేశంలో ప్రొఫెసర్‌పై కత్తితో దాడి చేసి చివరకు జైలు పాలయ్యాడు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడేనికి చెందిన మద్ది వినయ్ పురుషోత్తమ్ ఆవేశంతో తన కెరీర్‌ను చేజేతులా నాశనం చేసుకున్నాడు. సివిల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసిన వినయ్.. ప్రతిష్ఠాత్మక రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్‌జీయూకేటీ) పరిధిలోని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో స్టైపండ్ తీసుకుంటూ ఎంటెక్ చదవొచ్చనే ఆశతో ఎంట్రన్స్ రాశాడు. ఇందులో టాపర్‌గా నిలిచి క్యాంపస్‌లో సీటు సాధించాడు. మరోవైపు సివిల్స్ రాసి ఉన్నతోద్యోగం సాధించాలనే ఆశతో కోచింగ్ సెంటర్‌లో శిక్షణ కూడా తీసుకుంటున్నాడు. అటు కోచింగ్ ఇటు ఎంటెక్ క్లాసులు రెండింటికీ న్యాయం చేయలేకపోతుండడంతో... తన పరిస్థితిని యాజమాన్యానికి వివరిస్తూ ప్రథమ సెమిస్టర్‌లో ఒకటి, రెండు నెలలు తనకు హాజరు నుంచి వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశాడు. అందుకు అధికారులు ఆమోదం తెలపడంతో అటు కోచింగ్‌కు వెళ్తూనే వీలు చిక్కినప్పుడల్లా ఎంటెక్ క్లాసులకు హాజరయ్యేవాడు. మొదటి సెమిస్టర్‌లో 55 శాతం హాజరు మాత్రమే ఉన్నప్పటికీ ప్రత్యేక అనుమతితో పరీక్షలు రాసి ఆ విభాగంలో టాపర్‌గా నిలిచాడు. అయితే.. ఆ తర్వాత ఏమైందో కానీ.. రెండో సెమిస్టర్‌లో ఒక్కరోజు కూడా తరగతులకు హాజరు కాలేదు. దీంతో ఎంటెక్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ప్రొఫెసర్ గోపాలరాజు దీనిపై అభ్యంతరం తెలుపుతూ.. పరీక్షలకు హాజరు కావాలంటే హెచ్‌వోడీ అనుమతులు కావాలని పేర్కొన్నారు. దీంతో సోమవారం హెచ్‌వోడీ అనుమతుల కోసం వెళ్లి వచ్చే క్రమంలో జరిగిన పరిణామాలతో.. కోపోద్రిక్తుడైన వినయ్ తనతోపాటు తెచ్చిన కత్తితో పరీక్ష హాలులో గోపాలరాజుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గోపాలరాజు తీవ్ర గాయాలపాలయ్యారు. తోటి విద్యార్థులు వినయ్‌ను అడ్డుకుని గోపాలరాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బీదరికంలోనూ చదువులో టాపర్‌గా నిలుస్తూ వచ్చిన వినయ్.. క్షణికావేశం చివరకు హత్యాయత్నం కేసులో ముద్దాయిగా నిలిచేలా చేసింది.



ప్రొఫెసర్‌పై దాడి అనంతరం నిర్బంధంలో ఉన్న వినయ్ పురుషోత్తమ్

ప్రేమ పగ

(5వ పేజీ తరువాయి)

రాకుండా బ్లీచింగ్ చల్లారు.

పక్కింటి వ్యక్తి ఆటోలో..

మృతదేహం తరలింపునకు పక్కంటి వ్యక్తి ఆటోను ఉపయోగించుకున్నాడు. చంద్రగూడెం వరకు వెళ్లొస్తానని ఆటో తీసుకున్నాడు. ఆ ఆటో లో కుమార్తె మృతదేహాన్ని తీసుకెళ్లి ఎ.కొండూరు అటవీ ప్రాంతంలో పడేశాడని తెలిసింది. తర్వాత ఆటోను శుభ్రంగా కడిగేసి పక్కింటి వ్యక్తికి అప్పగించాడు. ఈ ఘటన గతనెల 31న జరిగినట్టు తెలుస్తోంది. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచా రం ఇచ్చారు. ఘటన జరిగాక నిందితుడు, మొద టి భార్య కుమార్తెలు తలోదిక్కుకు పారిపోయారు. మన్యం ప్రాంతంలో తలదాచుకుంటున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారణ చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మృతదేహం తరలింపునకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. ఎ.కొండూరు అటవీ ప్రాంతానికి వెళ్లి గాలించగా, అక్కడ బాలిక మృ తదేహం కనిపించలేదని తెలిసింది. తండ్రిని ర హస్యంగా విచారణ చేస్తున్న పోలీసులు మొదటి భార్య, పిల్లల కోసం గాలిస్తున్నారని సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో ఏపీ డ్రోన్లు

కుమార్తెను చంపాక నిందితుడు ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని మన్యం ప్రాంతానికి పారిపోయాడు. అతడిని గుర్తించి పట్టుకోవడానికి పోలీసులు డ్రోన్లకు పని చెప్పారు. నిందితుడు ఛత్తీస్‌గఢ్ పారిపోయాడని తెలుసుకున్న పోలీసులు తమ వద్ద ఉన్న రెండు డ్రోన్లతో ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వాటిని ఎగురవేసి నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు.

డయేరియా కలవరం

(5వ పేజీ తరువాయి)

తెచ్చుకుని, ఇంట్లో నిల్వ ఉంచుకుని, మరుసటి రోజూ అదే భోజనం చేయడం వల్ల వాంతులు, విరేచనాలు అవుతున్నాయంటున్నారు. స్థానికులు మాత్రం పది రోజుల నుంచి మంచినీరు దుర్వాసన వచ్చి, రంగు మారిందని, ఆ కారణంగానే ప్రజలు డయేరియా బారిన పడుతున్నారని చెబుతున్నారు.

మంచినీటి ట్యాంక్ క్లీనింగ్,పైపులైన్లకు మరమ్మతులు

వ్యాధి ప్రబలిన ప్రాంతాల్లో మంచినీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తు న్నారు. అయితే, మంచినీటి పరీక్షల్లో ఎటువంటి వ్యాధి కారకాలు లేవని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. వ్యాధి వ్యాప్తి చెందిన తర్వాత అధికార యంత్రాంగం హడావిడి చర్యలు చేపట్టింది. పైపులైన్లకు లీకులు ఉన్నాయని మరమ్మ తు చర్యలు చేస్తున్నారు. అలాగే, పాఠశాల పక్కనే ఉన్న మంచినీటి రిజర్వాయర్‌ను కూడా శుభ్రపరచాలని అధికారులు సిబ్బందికి సూచించారు. అయితే, పైపులైన్లకు లీకుల కారణంగానే అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కమిషనర్‌తో మాట్లాడిన మంత్రి నారాయణ

కార్పొరేషన్: డయేరియా కేసులపై వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో మునిసిపల్ మంత్రి నారాయణ ఫోన్‌లో మాట్లాడారు. న్యూ ఆర్ ఆర్ పేటకు కార్పొరేషన్ తాగు నీటి సరఫరాను తక్షణం నిలిపివేయాలని మంత్రి నారాయణ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బాధితులను పరామర్శించిన కలెక్టర్

డయేరియాతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యూ రాజరాజేశ్వరిపేట బాధితులను కలెక్టర్ లక్ష్మీశ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డయేరియా బారిన పడిన వారంతా హాస్పిటల్‌లో క్షేమంగానే ఉన్నారన్నారు.

చచ్చినా వదలరు!

(5వ పేజీ తరువాయి)

ఆత్మహత్యలు చేసుకుని పోలీసు కేసు నమోదై పోస్టుమార్టానికి వచ్చే మృతుల కుటుంబసభ్యుల నుంచి అధికమొత్తంలో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

పంచానామాకు

పోస్టుమార్టం అనంతరం మృతుడి కుటుంబీకులకు పంచనామా పోలీసులే ఇవ్వాలి. ఈ పంచనామా ఇస్తేనే ప్రమాదాలు జరిగిన వారికి భీమా, ఇతర పాలసీల ద్వారా రావాల్సిన డబ్బు జమ అవుతుంది. ఇలాంటి సందర్భాల్లో పోస్టుమార్టం సిబ్బందితో కలిసి పోలీసులూ డబ్బు తీసుకుంటున్నారని మృతుల కుటుంబీకులు, స్నేహితులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు డబ్బు ఇవ్వకపోతే పంచనామా ఏ విధంగా రాస్తారోనని భయపడి అడిగినంత ముట్టజెబుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారైతే పర్వాలేదు కానీ, పేదవారు మాత్రం సిబ్బందికి, పోలీసులకు అడిగినంత ఇవ్వలేక బేరాలు మాట్లాడుకుంటున్నారు.

దుఃఖంలో ఉన్నవారి వద్ద దండుకుంటున్నారు : మృతుడి స్నేహితుడు అర్జున్

ఇంట్లో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబీకులు ఎంత దుఃఖంలో ఉంటారో అందరికీ తెలుసు. అందులోనూ వయసులో ఉన్నవారు చనిపోతే ఆ బాధ వర్ణనాతీతం. అటువంటి వారి వద్ద నుంచి డబ్బు వసూలు చేయడం దుర్మార్గం. ప్రభుత్వాలు జీతాలు చెల్లిస్తున్నా శవాలపై దండుకుంటున్నారు. ఆర్థికంగా ఉన్నవారు బాధలో పట్టించుకోరు. అంత మొత్తంలో అంటే పేదలు ఎలా ఇచ్చుకోగలరు. ఈ వ్యవహారంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన



ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థి తిథి సందర్భంగా బుధవారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వేదోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని గణేశుడికి పూజలు చేశారు.



కంపాక్టర్ బిన్ పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించండి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ బుధవారం లయోల కళాశాల రోడ్డు, క్రీస్తురాజుపురం, పంట కాలువ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని కంపాక్టర్ బిన్ లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. నగరంలోని రోడ్లలో గుంతలు పూడ్చాలని తెలిపారు. ప్రధాన రహదారుల్లో డివైడర్ల వద్ద సక్రమంగా పారిశుధ్య నిర్వహణ జరిపించాలని అధికారులకు తెలిపారు. అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పుల్లేటికట్ట ఆక్రమణల తొలగింపు ప్రారంభం

● 37మందికి నోటీసులు జారీ ● ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఇళ్ల కేటాయింపు

గుణదల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుల్లేటికట్ట డ్రెయిన్ విస్తరణకు ఎట్టకేలకు నగర పాలకసంస్థ ఒక అడుగు ముందుకు వేసింది. పుల్లేటికట్ట డ్రెయిన్ వెంబడి ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వద్ద రైవస్ కాల్వలో డ్రెయిన్ కలిసే వరకు డ్రెయిన్ వెంబడి ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని అధికారులు నిర్ణయించారు. దీనిలో భాగంగా ముందుగా డ్రెయిన్‌లో పూడిక తీయడానికి కూడా వీలులేని విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించే పని ప్రారంభించారు. గుణదల సెంటర్ నుంచి ఈఎస్ఐ వరకు డ్రెయిన్ వెంబడి ఉన్న ఆక్రమణల్లో ప్రధానంగా ఇప్పటికే 37 మందికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారికి జక్కంపూడిలో ప్రభుత్వ గృహాలను మంజూరు చేయనున్నట్లు నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు.



గుణదల మెయిన్ రోడ్డు నుంచి, పుల్లేటికట్ట రోడ్డు వైపు నుంచి తొలగించిన ఆక్రమణలు

ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి పుల్లేటికట్ట డ్రెయిన్ గతంలో ఉన్న మాదిరిగా కాకుండా నేరుగా గుణదల ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకొచ్చి అక్కడ నుంచి గుణదల రైవస్ కాల్వలోకి కలిసేలా డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఆక్రమణల తొలగింపు అనంతరం ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వరకు డ్రెయిన్‌ను 10 నుంచి 12 అడుగుల మేర విస్తరణ చేయాలని అధికారులు భావిస్తున్నారు.

అదే సమయంలో డ్రెయిన్ నిర్మాణం అనంతరం పూడిక తీసేందుకు వీలుగా ఇరుపక్కల ఆరు అడుగుల మేర ఖాళీ ఉండేలా చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. పట్టా కాని భూములను పూర్తిగా వీఎంసీ తన ఆధీనంలోకి తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. దీనికి తోడు గుణదల నుంచి బెంజిసర్కిల్, మహానాడు రోడ్డు వైపు వెళ్లే వారంతా గుణదల పుల్లేటికట్ట రోడ్డువైపుగా ప్రయాణాలు కొనసాగిస్తుండటంతో ఇటువైపు ట్రాఫిక్ పెరిగిపోయింది. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా పుల్లేటికట్ట రోడ్డులేదు. ఆ సమస్యను కూడా పరిష్కరించడానికి నగరపాలకసంస్థ అధికారులు ఆలోచనలో ఉన్నారు.

37 మందికి నోటీసులు జారీ చేశాం: మోహన్‌బాబు

పుల్లేటికట్ట డ్రెయిన్‌ను విస్తరించడానికి అడ్డుగా ఉన్న నిర్మాణాల్లో 37మందికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామని అసిస్టెంట్ సిటీప్లానర్ మోహన్‌బాబు తెలిపారు. ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ నుంచి గుణదల సెంటర్ వద్దగల రైవస్ కాల్వ అండర్‌పాస్ డ్రెయిన్ వరకు ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని నిర్ణయించాం. పట్టా కాని భూములను పూర్తిగా తొలగించేందుకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఇళ్లను కేటాయించడం జరుగుతుంది. త్వరలోనే డ్రెయిన్ విస్తరణ పనులు ప్రారంభిస్తాం.

గ్రాము కొకైన్ పట్టివేత

పెనమలూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప శ్రీనివాసనగర్ కట్టకు చెందిన నక్క పార్థసారథి గ్రీన్‌స్పేస్ అపార్టుమెంట్ ఎదురుగా నివాసం ఉంటాడు. ఇతనికి గంజాయి సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో తన స్నేహితుడు నాగవరపు గుణశేఖర్ పదిహేనురోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చి తనకు ఐదువేల విలువైన ఒక గ్రాము కొకైన్ ప్యాకెట్ అమ్మమని ఇచ్చినట్లు తెలిపాడు.

నిందితుని మీద అనుమానంతో అతడిని తనిఖీ చేయగా కొకైన్ ప్యాకెట్ లభించిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మానస



మాట్లాడుతున్న లయన్ అంజనేయులు



ప్రసంగిస్తున్న అబ్దుల్ బాసిత్

ప్రతి సమస్యకు చావు పరిష్కారం కాదు

భారతీనగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐక్యూఏసీ , మాజిక్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానసిక నిపుణులు, మానస చైల్డ్ గైడెన్స్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ మానస ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యకు చావు పరిష్కరం కాదన్నారు. తొందరు పాటు నిర్ణయాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ప్రిన్సిపాల్ మహేష్, ఐక్యూఏసీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ క్యాండీ, డాక్టర్ సుస్మిత, శామ్యూల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పటమట: ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావని లయన్స్ డిస్ట్రిక్ట్ 316బీ జిల్లా గవర్నర్ లయన్ వీవీపీఎస్ అంజనేయులు పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా పటమట త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ విజయవాడ వీఆర్‌కేనగర్ స్పార్క్ ఆధ్వర్యంలో సంఘర్షణ నుంచి శక్తి వైపు, యువ మహిళలకు సాధికారిత అనే శీర్షికన ఒక ప్రభావంతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయవాడకు చెందిన కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ లయన్ డాక్టర్ రమేష్ భావిశెట్టి మాట్లాడుతూ ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు, లక్షణాలు, వాటిని ఎలా అధిగమించాలో తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ సాంబిరెడ్డి, పూర్వపు జిల్లా గవర్నర్ లయన్ అన్నపురెడ్డి కోటిరెడ్డి, లయన్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్ : ఒత్తిడిని ఎదుర్కొనే పద్ధతులపై గురుకుల మహిళా సాధికారత విభాగం, ఇంక్లూజివ్ క్లబ్ సంయుక్తంగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్యశాలకు గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో యోగా, మనస్తత్వ శిక్షకులు అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ తీవ్ర మనోవేదనలను, ఉద్విగ్నతలనూ ప్రాణయామం ద్వారా ఇతరులతో ఆలోచనలు పంచుకోవడం, హాస్య సినిమాలు చూడటం లాంటి విభిన్న పద్ధతులు పాటించడం ద్వారా ఎదుర్కోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధారాణి, సత్యవాణి, లావణ్య, డాక్టర్ నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవడాలి

● పటమట సీఐ వి.పవన్‌కిషోర్

పటమట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యావిధానం నాయకుడికి ప్రధానమని పటమట సీఐ వి.పవన్‌కిషోర్ పేర్కొన్నారు. పటమట శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి నాయకులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దగలరని, అటువంటి నాయకత్వం విద్యార్థి దశలోనే అలవడాలని సూచించారు. గౌరవ అతిథి ఆర్ఐ పద్మ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలను విద్యార్థి దశలోనే నేర్చుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.



విద్యార్థి నాయకులతో సీఐ పవన్‌కిషోర్

అనంతరం స్కూల్ హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, మిగిలిన హౌస్ మానిటర్‌కు ఎంపికైన విద్యార్థులకు అతిథుల చేత బ్యాడ్జిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



పైథాన్ ప్రోగ్రామ్‌ను వివరిస్తున్న జ్ఞానసాయి ఆదిత్య

పీబీ సిద్ధార్థలో పైథాన్ ప్రోగ్రామ్‌పై శిక్షణ

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కాలేజీ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహిస్తోన్న మూడు రోజుల పైథాన్ వర్క్‌షాపును బుధవారం ఎక్సెలర్ ఎడ్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ రిసోర్స్ పర్సన్ వి.జ్ఞానసాయి ఆదిత్య ప్రారంభించారు. సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్, బేసిక్ కోడింగ్‌పై ఆయన విద్యార్థులకు వివరించారు. రెండోరోజు సదస్సు డేటా విశ్లేషణపై జరుగుతుందన్నారు. కాలేజీ డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ, పైథాన్ సాఫ్ట్‌వేర్ కోర్సుకు ఎక్కడ చూసినా డిమాండ్ ఉందని, పైథాన్ ప్రోగ్రాంలో నైపుణ్యం పెంపొందించుకుంటే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.వి.రమేష్ చంద్ర, ప్రొఫెసర్లు కె.విజయ్, శ్రీనివాసులు, కిశోర్, షాలిని పాల్గొన్నారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికుల వస్తువులను చోరీ చేస్తున్న తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు టి.రమేష్ (29)ను బుధవారం అరెస్టు చేసినట్లు విజయవాడ రైల్వేస్టేషన్ సీఐ రమణ తెలిపారు.



వివరాలు తెలియజేస్తున్న సీఐ రమణ

బుధవారం విజయవాడ రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫారంలోని జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లో నిందితుడి చోరీ వివరాలను మీడియా సమావేశంలో సీఐ వివరించారు. ఆగస్టు 23న తిరుపతి నుంచి వరంగల్‌కు పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం చేసిన బండి రాజ్యలక్ష్మి వద్ద 25 గ్రాముల బంగారు నానుతాడు విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు బయలుదేరే సమయంలో చోరీకి గురైంది. బాధితురాలు 25న రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌లతో కలిసి మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు విచారణ చేపట్టారు. పోలీసు అధికారులు సీసీ పుటేజీల ద్వారా నిందితుడుని గుర్తించారు. పోలీసులు నిందితుడి కోసం హైదరాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణాల్లో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడు జైహింద్ కాంప్లెక్స్ వద్ద ఉన్నాడని సమాచారం తెలియటంతో పోలీసులు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నిందితుడు వద్ద నుంచి రాజ్యలక్ష్మికి చెందిన 25 గ్రాముల బంగారు నానుతాడు, 2024 డిసెంబరులో జరిగిన మరో కేసులో 40 గ్రాముల బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న క్రిస్టియన్ సంఘాల ప్రతినిధులు

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించండి

● జాన్ బెన్నీ లింగం డిమాండ్

ధర్నాచౌక్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు జాన్ బెన్నీలింగం కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. పాస్టర్లకు 11 నెలల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని, పంచాయతీ పరిధిలో చర్చిల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఇస్మాయేలు, యోవేలు రాజు, మత్తే రాజ్‌కుమార్, ముద్దు ప్రేమజ్యోతి బాబు, డొక్క జార్జి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ దుర్గా దూబేను సత్కరిస్తున్న సిద్ధార్థ వర్సిటీ వీసీ వెంకటేశ్వరరావు

ఇంజనీరింగ్ విద్యార్థులు సైబర్ సెక్యూరిటీకి పునాది వేసుకోవాలి

కానూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు పటిష్ఠమైన సైబర్ సెక్యూరిటీకి పునాది ఏర్పాటు చేసుకోవాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇన్ఫర్మేషన్ రిస్క్ మేనేజ్‌మెంట్ అండ్ సైబర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ డాక్టర్ దుర్గా దూబే అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వర్సిటీలో బుధవారం ఎవాల్వింగ్ సైబర్ సెక్యూరిటీ ప్యారడైగమ్స్: ఇండస్ట్రీ ఇన్‌సైట్స్ ఫర్ యాస్పిరింగ్ ఇంజనీర్స్ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో దుర్గా దూబే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, ప్రొ.వీసీ ఏవీ రత్నప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు డి. వెంకటేశ్వరరావు, సునీత, రాజేశ్వరరావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యం

● గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు హేమంత్ కోటేశ్వరరావు

గన్నవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు సమష్టి కృషి చేస్తున్నట్లు గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు తెలిపారు.



మాట్లాడుతున్న గణేష్ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు

గన్నవరం పార్క్ ఎలైట్ హోటల్‌లో బుధవారం గణేష్ ఉత్సవ సమితి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవ సమితి మూడు అంశాలను తీసుకుందని చెప్పారు. ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ పై జిల్లాలో విస్తృత పర్యటన చేసి క్షేత్ర స్థాయిలో ఈ మూడింటి పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సమితి ఏర్పడిన రోజుల వ్యవధిలోనే రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులను కలసినట్లు చెప్పారు. అంతరించిపోతున్న హిందూ ధర్మాన్ని కాపాడటమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. తొలుత సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు మాట్లాడారు. కార్యదర్శి మణీంద్రనాథ్, కోనేరు దుర్గా ప్రసాద్, శివాజీ, పొట్లూరి బసవరావు, బి.రవిశంకర్, అశోక్, వెంకటాద్రి రెడ్డి, వీరబాబు, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఈ-సేవ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పటమట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ పటమట ఈ-సేవ కేంద్రం ఎదుట జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ విజయవాడ నగర్ కమిటీ ఆధ్వర్యంలో అగర్ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. నగర ప్రధాన కార్యదర్శి వివి రాజు మాట్లాడుతూ ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికులు పని బంద్ చేసి రాష్ట్ర లేబర్ ఆఫీస్ ధర్నా ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేల్కొని నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.వాసు, ఎం. హరికృష్ణ, కిరణ్‌కుమార్, చెన్నకేశవరావు, సైదా, సింహాచలం, తదితర కార్మికులు పాల్గొన్నారు.

ఎండిపోయిన కొమ్మలు తొలగించండి



మూడవ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీలో ఎండిపోయిన చెట్లు కొమ్మలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. గత వారం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లకు అడ్డువచ్చిన చెట్టు కొమ్మలను తొలగించారు. ప్రస్తుతం కొమ్మలు ఎండిపోయి ప్రమాదకంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -భారతీనగర్, ఆంధ్రజ్యోతి

అమ్మాయిలు..అదే జోరు



సూపర్-4లో కొరియాపై భారత్ గెలుపు

ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఒక్క ఓటమి కూడా కూడా లేకుండా గ్రూప్ దశను టాపర్‌గా ముగించిన మన అమ్మాయిల బృందం.. సూపర్-4లోనూ అంతేదీటుగా విజృంభిస్తోంది. బుధవారం జరిగిన సూపర్-4 తొలి పోరులో భారత్ 4-2తో కొరియాను చిత్తు చేసింది. భారత జట్టులో వైష్ణవి (2వ), సంగీతా కుమారి (33వ), లాల్‌రెమ్సియామి (40వ), రుతుజ (59వ) తలో గోల్ సాధించారు. కొరియా తరఫున యుజిన్ కిమ్ (33వ, 53వ) రెండు గోల్స్ చేసింది. భారత్ తమ రెండో మ్యాచ్‌ను గురువారం చైనాతో ఆడనుంది. నాలుగు జట్లు తలపడే సూపర్-4లో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరతాయి.

అన్‌సీడెడ్ చేతిలో..

● సింధు పరాజయం

● ప్రణయ్, సేన్ ముందంజ

● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా ఆదిలోనే అన్‌సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరచింది. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జూ వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్)పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్/సమ్ యూ వాంగ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. సింగిల్స్‌లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్వికా శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బిష్ణోయ్‌కు 6, అర్ష్‌దీప్‌నకు 10

దుబాయ్: టీమిండియా బౌలర్లు రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చెరోస్థానం మెరుగుపర్చుకుని ముందంజ వేశారు. వీరు వరుసగా 6, 10వ ర్యాంకుల్లో నిలిచారు. వరుణ్ చక్రవర్తి 4వ ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత్ తరఫున టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు.

27 బంతుల్లోనే..

భారత్ సునాయాస విజయం

యూఏఈ 57 ఆలౌట్

కుల్దీప్‌కు 4, దూబేకి 3 వికెట్లు



దుబాయ్: డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కుల్దీప్ యాదవ్ (4/7), శివం దూబే (3/4) తిప్పేయడంతో.. గ్రూప్-ఎలో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. 79 బంతుల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టీమిండియా.. కేవలం 27 బంతుల్లోనే లక్ష్యాన్ని ఊదేసింది. దీంతో మొత్తం 106 బంతుల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ షరాఫు (22), మహ్మద్ వసీం (19) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. శివం దూబే మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 4.3 ఓవర్లలో 60/1 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (30), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్) రాణించారు. జునైద్ ఒక వికెట్ దక్కించుకొన్నాడు.

అలవోకగా..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు అభిషేక్, గిల్ ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉతికి ఆరేశారు. తొలి బంతినే సిక్స్‌కు తరలించిన శర్మ.. రెండో బంతికి బౌండ్రీ సాధించాడు. రెండో ఓవర్‌లో రోహిద్ బౌలింగ్‌లో గిల్ 4,6తో 15 పరుగులు రాబట్టడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. మరో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్‌ను జునైద్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 10 పరుగులు కావల్సి ఉండగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (7 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. మరోవైపు బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసిన గిల్.. మరో 93 బంతులు మిగిలుండగానే జట్టుకు ఘన విజయం అందించాడు.

పెవిలియన్‌కు క్యూ..: పవర్‌ప్లేలో ఫర్వాలేదనిపించినా.. కుల్దీప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న యూఏఈ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఓపెనర్ అలీషాన్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చాడు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన షరాఫు.. అక్షర్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా యార్కర్‌కు అలీషాన్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ బ్యాటర్ జొహైబ్ (2)ను వరుణ్ క్యాచవుట్ చేశాడు. కానీ, ఆరో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో వసీం మూడు బౌండ్రీలతో 12 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను యూఏఈ 41/2తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో కుల్దీప్ మాయాజాలంతో ఒక్కసారిగా కుదేలైంది. 8వ ఓవర్‌లో రాహుల్ చోప్రా (3), వసీంతోపాటు హర్షిత్ కౌశిక్ (2)ను కుల్దీప్ అవుట్ చేయడంతో.. యూఏఈ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసిఫ్ ఖాన్ (2), ధ్రువ్ (1), జునైద్ సిద్దిఖీ (0)ను దూబే పెవిలియన్ చేర్చాడు. హైదర్ అలీ (1)ను క్యాచవుట్ చేసిన కుల్దీప్.. యూఏఈ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x హాంకాంగ్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

స్కోరుబోర్డు

యూఏఈ: అలిషన్ షరాఫు (బి) బుమ్రా 22, మహ్మద్ వసీమ్ (ఎల్బీ) కుల్దీప్ 19, జొహైబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2, రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3, ఆసిఫ్ (సి) శాంసన్ (బి) దూబే 2, హర్షిత్ (బి) కుల్దీప్ 2, ధ్రువ్ పరాషర్ (ఎల్బీ) దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్బీ) అక్షర్ 1, హైదర్ (సి) శాంసన్ (బి) కుల్దీప్ 1, సిద్దిఖీ (సి) సూర్య (బి) దూబే 0, మహ్మద్ రోహిద్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.1 ఓవర్లలో 57 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57; **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, శివమ్ దూబే 2-0-4-3.

భారత్: అభిషేక్ (సి) హైదర్ (బి) సిద్దిఖీ 30, గిల్ (నాటౌట్) 20, సూర్యకుమార్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: 4.3 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-48; **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, పరాషర్ 1-0-13-0, సిద్దిఖీ 1-0-16-1, సిమ్రన్‌జీత్ సింగ్ 0.3-0-6-0.

1

4.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేధించిన భారత్.. టీ20ల్లో తన వేగవంతమైన ఛేదనను నమోదు చేసింది. గతంలో స్కాట్లాండ్‌పై 6.3 ఓవర్లలోనే ఛేదించిన రికార్డును టీమిండియా ఈ మ్యాచ్‌లో తిరగరాసింది.

టైటాన్స్ హ్యాట్రిక్

ముంబాపై గెలుపు ● ప్రొ కబడ్డీ



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ విశాఖపట్నం అంచెను తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ విజయంతో ముగించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. టైటాన్స్ రైడర్లు, డిఫెండర్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తొలి భాగంలో టైటాన్స్‌ను ముంబా ఆటగాళ్లు నిలువరించలేకపోయారు. దీంతో ప్రథమార్థం 27-11తో ముగిసింది. ద్వితీయార్థంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు అదే జోరు కొనసాగించి మరోసారి యు ముంబాను ఆలౌట్ చేసి సురక్షితమైన ఆధిక్యాన్ని సాధించారు. టైటాన్స్ ధాటికి ఒత్తిడికి గురైన ముంబా వరుస లైనౌట్‌లతో పాయింట్లు సమర్పించుకుంది. చివరి నిమిషాలలో అనూహ్యంగా పుంజుకున్న ముంబా ఆటగాళ్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసినా ఫలితం లేకపోయింది. టైటాన్స్‌లో రైడర్ భరత్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా, యు ముంబాలో సందీప్‌కుమార్, అమి మహ్మద్ జఫర్ దనేష్ చెరో ఏడు పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 43-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది.

నిఖత్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో ఓటమి

సెమీఫైనల్‌కు నూపుర్, జాస్మిన్

భారత్‌కు రెండు పతకాలు ఖరారు

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్





లివర్‌పూల్ (ఇంగ్లండ్): తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో టైటిల్ మిస్సయింది. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ పోరాటం ఈసారి క్వార్టర్‌ఫైనల్‌కే పరిమితమైంది. గతసారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది. అయితే బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జరీన్ 0-5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో టోర్నీ నుంచి నిఖత్ రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అయితే, నిఖత్ నిరాశపరిచినా.. హరియాణా బాక్సర్లు నూపుర్ షెరాన్, జాస్మిన్ లంబోరియా తమ విభాగాల్లో సత్తా చాటి భారత్‌కు రెండు పతకాలు ఖాయం చేశారు. మహిళల 80+ కేజీల విభాగంలో నూపుర్, 57 కిలోల కేటగిరిలో జాస్మిన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దిగ్గజ బాక్సర్ హవా సింగ్ మనుమరాలైన 26 ఏళ్ల నూపుర్ క్వార్టర్‌ఫైనల్లో 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒల్టినోయ్ సొతింబేవను చిత్తు చేసింది. మరో క్వార్టర్స్ బౌట్‌లో జాస్మిన్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుమోరాబోను మమజొనొవాపై గెలిచింది. సెమీఫైనల్స్‌లో ఓడినా వీళ్లకు కాంస్య పతకాలు దక్కుతాయి. ఇక..పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్ (48 కి), అబినాష్ జమ్వాల్ (65 కి) క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టి పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచారు. కాగా, మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కి) తొలి రౌండ్ పరాజయంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.

భారత్-పాక్ మ్యాచ్‌కు తగ్గిన డిమాండ్!

పూర్తిగా అమ్ముడుపోని టికెట్లు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ రెండు జట్లు తొలిసారిగా తలపడనుండడంతో.. డిమాండ్ భారీగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఆసియాకప్‌లో ఆదివారం జరిగే ఇండో-పాక్ మ్యాచ్ టికెట్లు ఇంకా అందుబాటులో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హైవోల్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ తగ్గడానికి అధిక ధరలే కారణమని తెలుస్తోంది. రెండు సీట్లకు రూ. 10,000 అన్నింటికంటే తక్కువ. వీఐపీ రాయల్ బాక్స్‌లో జతకు రూ. 2,30,700, స్కైబాక్స్ టికెట్ రూ. 1,67,851గా నిర్ణయించారు. ప్లాటినం రూ. 75,658, గ్రాండ్ లాంజ్ రూ. 41,153 లాంటి మధ్య శ్రేణి టికెట్లు కూడా సగటు ప్రేక్షకుడికి అందుబాటులో లేవు.

తుపాకీ గురిపెట్టి..క్రికెటర్ల దోపిడీ

బార్బడోస్‌లో ఘటన

బార్బడోస్: కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ కిట్స్, నెవిస్ పాట్రియాట్స్ జట్టు ఆటగాళ్లు దోపిడీకి గురయ్యారు. ఆ క్రికెటర్లు, సీపీఎల్ అధికారి ఒకరు ఓ ప్రయివేట్ ఈవెంట్‌ను ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హోటల్‌కు వెళుతూ మార్గమధ్యంలో ఆహారంకోసం ఒకచోట ఆగారు. ఆ సమయంలో కొందరు దొంగలు.. క్రికెటర్లు, ఆ అధికారిని తుపాకీతో బెదిరించి నగలు, ఇతర విలువైన వస్తువులు దోచుకొన్నారు. ఈక్రమంలో క్రికెటర్లు దొంగలను ప్రతిఘటించగా వారి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాటలో దొంగలు ఓ తుపాకీని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో క్రికెటర్లు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలి నుంచి పోలీసులు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

మస్క్‌ను వెనక్కి నెట్టిన ల్యారీ ఎల్లిసన్

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికి



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్ సహ-వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ప్రపంచ ధనవంతుల జాబితాలో టెస్లా సారథి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్స్ లిస్ట్ ప్రకారం.. 81 ఏళ్ల ఎల్లిసన్ వ్యక్తిగత సంపద బుధవారం ఏకంగా 10,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.89 లక్షల కోట్లు) పెరిగి మొత్తం రూ.39,570 కోట్ల డాలర్లకు (రూ.34.82 లక్షల కోట్లు) చేరుకుంది. ఒరాకిల్ షేరు ఒక్కరోజే ఏకంగా 41 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది. 1992 తర్వాత ఒక్క రోజులో కంపెనీ షేరు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. దాంతో ఒరాకిల్ మార్కెట్ విలువ 29,900 కోట్ల డాలర్ల మేర పెరిగి లక్ష కోట్ల డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం సంస్థలో ఎల్లిసన్ 41 శాతం వాటా కలిగి ఉన్నారు. ఒరాకిల్ త్రైమాసిక పనితీరు మార్కెట్ అంచనాలను మించడంతోపాటు క్లౌడ్ వ్యాపారం భవిష్యత్‌పై అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ తీశాయి. కాగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 300 రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన మస్క్ రెండో స్థానానికి జారుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 38,500 కోట్ల డాలర్లకు (రూ.33.88 లక్షల కోట్లు) పరిమితమైంది.

మూడో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో అప్‌ట్రెండ్ బుధవారం నాడు కూడా కొనసాగింది. సెన్సెక్స్ 323.83 పాయింట్ల లాభంతో 81,425.15 వద్ద ముగియగా నిఫ్టీ 104.5 పాయింట్ల లాభంతో 24,973.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభాలతో ముగియడం వరుసగా ఇది మూడో రోజు కాగా నిఫ్టీకి ఆరో రోజు. భారత-అమెరికా వాణిజ్య చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే రావచ్చునన్న ఆశలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో కంపెనీల ఆదాయాలు బాగా పుంజుకుంటాయన్నఅంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు కూడా ఇందుకు తోడయ్యాయి.

● బుధవారం ప్రారంభమైన అర్బన్ కంపెనీ ఐపీఓకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. తొలి రోజు ముగిసే సరికి 3.13 రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్లు సమాచారం.

ఎంఎఫ్ లావాదేవీల్లో ఎన్ఎస్ఈ రికార్డు: మ్యూచువల్ ఫండ్ లావాదేవీల్లో 'ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాం' రికార్డు సృష్టించింది. బుధవారం ఈ వేదికపై రికార్డు స్థాయిలో 15 లక్షలకుపైగా లావాదేవీలు నమోదైనట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ల నమ్మకం, మద్దతుతోనే ఇది సాధ్యమైందని ఎన్ఎస్ఈ పేర్కొంది.

బిజినెస్

రూ.35 తగ్గనున్న సిమెంట్ ధర

ఇండియా రేటింగ్స్


న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో సిమెంట్ ధరలు దిగి రానున్నాయి. ఈ తగ్గింపు 50 కిలోల బస్తాపై రూ.30 నుంచి రూ.35 వరకు ఉంటుందని ఇండియా రేటింగ్స్ అంచనా. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర కంపెనీని బట్టి రూ.330 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. జీఎస్‌టీ ప్రయోజనాలను ఈ నెల 23 నుంచి వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలు భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రిటైల్ మార్కెట్‌లోనూ బస్తా సిమెంట్ ధర రూ.30 నుంచి రూ.35 వరకు తగ్గుతుందని అంచనా.

ఎస్ఎస్ఎల్‌వీ తయారీ కోసం 3 కంపెనీలతో హెచ్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): 500 కిలోల కన్నా తక్కువ బరువు గల ఉపగ్రహాల ప్రయోగానికి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) మధ్య సాంకేతిక బదిలీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా హెచ్ఏఎల్ ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా స్వీకరిస్తుంది. ఇందుకోసం వచ్చే రెండేళ్లపాటు హెచ్ఏఎల్‌కు ఇస్రో అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు రాకెట్ల అభివృద్ధికి సాంకేతిక మద్దతునివ్వనుంది.


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ




హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	111
కర్నూలు	118	నెల్లూరు	116
విశాఖపట్నం	141	అనంతపురం	116
గోదావరి	137		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,510 ▲	1,01,300 ▲	1,40,000 ▲
విజయవాడ	1,13,000 ▲	1,07,000 ▲	1,28,270 ▲
విశాఖపట్నం	1,12,990 ▲	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,700 ▲	1,04,600 ▲	1,28,000 ▼
ముంబై	1,09,640 ▲	1,00,430 ▲	1,24,590 ▼

కృత్రిమ మేధతో ప్రపంచ జీడీపీకి అదనంగా రూ.1,382 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) 21వ శతాబ్దిని నిర్వచించే టెక్నాలజీగా మారిందని, 2030 నాటికి ప్రపంచ జీడీపీకి ఇది 1570 కోట్ల డాలర్లు (రూ.1,382 లక్షల కోట్లు) జోడిస్తుందని ఫిక్కీ-బీసీజీ రూపొందించిన ఒక శ్వేతపత్రంలో అంచనా వేశాయి. అయితే ఏఐని అనుసరించే విషయంలో మాత్రం భారీ వ్యత్యాసాలున్నట్టు ఆ పత్రంలో తెలిపాయి. ప్రపంచ సమ్మిళిత వృద్ధికి ఏఐని ఒక సాధనంగా చేసుకోవాలని పిలుపు ఇచ్చాయి. ఏఐని అందరికీ అందుబాటులోకి తేవడానికి పరిశోధన, పెట్టుబడులు, నైపుణ్యాల కల్పన, నైతిక (రైజ్) నియమావళి అనుసరించాలని సూచించాయి. అందులోని ప్రధానాంశాలు...

● ఈ రంగంలో పరిశోధనలు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.

● ఏఐని అందరికీ ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పెట్టుబడులు, మౌలిక వసతులు విస్తరించాలి.

● ఏఐ ప్రతిభలో వ్యత్యాసాలు తొలగించేందుకు సిబ్బందిలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడంతో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని అందరూ భారీ ఎత్తున పంచుకునే వాతావరణం సృష్టించాలి.

● ఏఐ వ్యవస్థలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఉండేలా చూసేందుకు శక్తివంతమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

అమెజాన్ ఇండియా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025 ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు ఒక రోజు ముందే ఇందులో పాల్గొనవచ్చు. ఈ ఫెస్టివల్‌లో 17 లక్షల మందికి పైగా అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అమ్మకందారులే 80,000 వరకు ఉంటారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) తోట కిషోర్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోని 700కుపైగా డెలివరీ కేంద్రాల ద్వారా ఈ సారి తమ కస్టమర్లకు సరుకులు అందించనున్నట్టు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఏడాది 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025' అమ్మకాలు భారీగా పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్ అమ్మకాల రద్దీకి అనుగుణంగా సరుకులను కొనుగోలుదారులకు అందించేందుకు లక్షన్నర మంది సీజనల్ ఉద్యోగులను అమెజాన్ ఇండియా నియమించింది. తెలంగాణ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కొనుగోలు దారులు ఎక్కువగా మిడ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల వంటి కన్జుమర్ ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆసక్తి చూపిస్తున్నట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) జెబా ఖాన్ చెప్పారు.

ఈ ఏడాది వృద్ధి 6.9 శాతం

అంచనాలను పెంచిన ఫిచ్.. దేశీయ డిమాండ్ వృద్ధికి చోదకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరపతి రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన వృద్ధి నమోదవడంతో పాటు దేశీయంగా వినియోగం భారీగా పుంజుకోనుండటం ఇందుకు కారణంగా పేర్కొంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ సుంకాల నేపథ్యంలో పలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, బహుళజాతి ఆర్థిక సంస్థలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వచ్చాయి. ఇలాంటి ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలోనూ వృద్ధి అంచనాలను పెంచిన తొలి అంతర్జాతీయ ఏజెన్సీ ఫిచ్. పైగా అన్ని ఏజెన్సీల్లోకెల్లా అత్యధిక వృద్ధిని అంచనా వేసింది కూడా ఇదే. దేశీయంగా వినియోగం భారీగా పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల ప్రభావం నుంచి బయటపడేందుకు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలకుగాను ఫిచ్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదికలోని మరిన్ని విషయాలు..

● ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 6.7 శాతం వృద్ధిని అంచనా వేయగా.. 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచుతున్నట్టు తెలిపింది.

● గడిచిన కొన్ని నెలల్లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య అనిశ్చితి పెరిగింది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెంచారు. భవిష్యత్‌లో ఈ సుంకం మళ్లీ దిగిరావచ్చని భావిస్తున్నాం. కానీ, అమెరికాతో వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితి వ్యాపార సెంటిమెంట్, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

● ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగం పెరిగేందుకు దోహదపడనుంది. దేశీయ డిమాండే వృద్ధికి ప్రధాన చోదకం. బలమైన గృహ ఆదాయం వినియోగానికి, సులభమైన ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులకు ఊతమివ్వనున్నాయి.

● ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మాత్రం వృద్ధి కాస్త నెమ్మదించవచ్చు. 2026-27లో వృద్ధిరేటు 6.3 శాతంగా, 2027-28 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతంగా నమోదు కావచ్చని అంచనా.

● ఈ సారి మెరుగైన వర్షపాతం నమోదవడంతో పాటు అధిక స్థాయిలో ఆహార నిల్వలున్న నేపథ్యంలో ధరల సూచీ అదుపులోనే ఉండనుంది. ఈ ఏడాది చివరినాటికి వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.2 శాతంగా, 2026 చివరినాటికి 4.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా.

● ఈ ఏడాది చివర్లో ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించవచ్చు. వచ్చే ఏడాదిలో మాత్రం రెపో యథాతథంగా కొనసాగవచ్చు. ఆర్‌బీఐ 2027లో రెపోరేటును మళ్లీ పెంచేందుకు అవకాశాలున్నాయి.

రాజమండ్రిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా రాజమండ్రిలో 100 బెడ్ల సామర్థ్యంతో కూడిన ఆస్పత్రిని బుధవారం ప్రారంభించింది. ఏపీలో రెయిన్‌బోకు ఇది మూడో హాస్పిటల్. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, ఈ ఆర్థిక సంవత్సరంలో వరంగల్, గువాహటి తర్వాత రెయిన్‌బో ప్రారంభించిన మూడో హాస్పిటల్ కూడా ఇదే. ఈ విస్తరణతో కలిపి రెయిన్‌బో మొత్తం 9 నగరాల్లో 2,300 పడకల సామర్థ్యంతో కూడిన 22 హాస్పిటళ్లు, 5 క్లినిక్‌లను నిర్వహిస్తోంది.

ఎస్రీ ఇండియాతో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ ఎస్రీ ఇండియాతో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ధ్రువ స్పేస్ తన ఆస్ట్రావ్యూ శాటిలైట్ ఇమేజరీ సర్వీస్‌ను ఎస్రీ ఇండియాకు చెందిన ఆర్క్‌జీఐఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించనుంది. తద్వారా 200కు పైగా ఉపగ్రహాల నుంచి భూమి పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు మరింత సులభంగా పొందేందుకు వీలుపడనుంది.

కాకినాడ ఎంపీ పేరిట ఆయన సంస్థకే బురిడీ!

92 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

- వాట్సాప్ డీపీలో ఎంపీ ఫొటో పెట్టి డబ్బుల కోసం పలుమార్లు సందేశాలు
- ఇది నిజమేనని నమ్మిన టీ-టైమ్ మేనేజర్
- 11 సార్లు వివిధ ఖాతాలకు సొమ్ము బదిలీ
- ఇటీవల గుర్తించిన ఎంపీ ఉదయ్.. ఫిర్యాదు

కాకినాడ(కలెక్టరేట్), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు వారు వీరు అనే తేడా లేకుండా పోయింది. తాజాగా కాకినాడ జనసేన పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేరిట.. ఆయనకు చెందిన 'టీ-టైమ్' సంస్థనే సైబర్ నేరగాళ్లు పక్కాగా బురిడీ కొట్టించారు. పలు దఫాలుగా రూ.92.5 లక్షలను తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. అన్ని సార్లూ కూడా వారు ఎంపీ పేరును, ఫొటోను వినియోగించుకోవడం.. అచ్చంగా ఆయన మాదిరిగానే మేసేజ్‌లు పెట్టడంతో టీ-టైమ్ సంస్థ మేనేజర్ సైతం 'ఇది మోసం' అని గుర్తించలేక పోయారు. దీంతో నేరగాళ్లు కోరినంత నగదును వారు చెప్పిన ఖాతాల్లోకి జమ చేశారు. ఇటీవల ఎంపీ తన ఖాతాలను స్వయంగా తనిఖీ చేసుకోవడంతో ఈ మోసం వెలుగు చూసింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ మోసంపై స్థానిక సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎలా చేశారంటే..: ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు చెందిన టీ-టైమ్(తేనీరు) వ్యాపారానికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. గత నెల 22న.. హైదరాబాద్‌లోని టీ-టైమ్ చీఫ్ ఫైనాన్స్ మేనేజర్ గంగిశెట్టి శ్రీనివాసరావు ఫోన్‌కు ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. వాస్తవానికి ఆ ఫోన్ నెంబరు ఎంపీది కాదు. కానీ, వాట్సాప్ డీపీలో ఎంపీ ఫొటో ఉపయోగించిన సైబర్ నేరగాడు.. ఒక మెసేజ్ పంపాడు. "నేను ఎంపీ శ్రీనివాస్‌ను. కొత్త ఫోన్ నెంబరును ఉపయోగిస్తున్నా. ఇప్పుడు నాకు అత్యవసరం కొంత మొత్తం పంపించు." అని పేర్కొన్నాడు. దీంతో మేనేజర్ శ్రీనివాసరావు వాట్సాప్ డీపీని చూసి.. ఆయన తమ యజమాని, ఎంపీ ఉదయ్ శ్రీనివాసేనని నమ్మి నగదు పంపించారు. ఇలా.. మొత్తం 11 సార్లు మెసేజ్‌లు రావడంతోపాటు వేర్వేరు బ్యాంకు ఖాతా నెంబర్లను పేర్కొనడంతో మేనేజర్.. మొత్తం రూ.92.5 లక్షల సొమ్మును ఆయా ఖాతాలకు బదిలీ చేశారు. ఇదిలావుంటే, ఈ నెల 8న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తన ఖాతాలను తనిఖీ చేసినప్పుడు.. వేర్వేరు బ్యాంకు ఖాతాలకు సొమ్ము బదిలీ కావడాన్ని గుర్తించి.. మేనేజర్‌ను ప్రశ్నించారు. తానేమీ సందేశం పంపలేదని, ఫోన్ నెంబరును కూడా మార్చలేదని చెప్పడంతో మేనేజర్ ఉలిక్కిపడ్డారు. ఇది సైబర్ మోసమేనని భావించిన ఆయన సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 319(2), ఐటీ చట్టం సెక్షన్ 66-డీ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తొలిసారి నగదు బదిలీ జరిగిన 2 వారాల తర్వాత ఫిర్యాదు చేయడంతో కేవలం రూ.7 లక్షలు మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఫ్యూచర్‌సిటీ టు అమరావతి.. 211 కి.మీ

- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే అలైన్‌మెంట్ దాదాపు ఖరారు
- హైదరాబాద్ దగ్గర్లోని తిప్పారెడ్డిపల్లి వద్ద కుడివైపు నుంచి రోడ్డు ప్రారంభం
- అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు రోడ్డు
- మొత్తం పొడవు 297 కిలోమీటర్లు.. 2 కొత్త వంతెనలు.. ప్రస్తుత విజయవాడ మార్గంతో పోల్చితే 57 కి.మీ తక్కువ



హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-అమరావతి మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ మార్గందిశగా కీలక అడుగు పడింది. దీనికి సంబంధించిన అలైన్‌మెంట్ దాదాపు ఖరారైంది. ఎక్కడి నుంచి ఎక్కడివరకు, ఎటువైపు నుంచి నిర్మించనున్నదీ స్పష్టత వచ్చింది. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్)- రీజనల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) మధ్యలో ప్రభుత్వం ప్రతిపాదించిన భారత్ ఫ్యూచర్ సిటీ (ముచ్చర్ల)కు సమీపంలోని తిప్పారెడ్డిపల్లికి కొంత దూరంలో ఈ రహదారి ప్రారంభం కానుంది. ప్రస్తుత విజయవాడ రహదారికి కుడివైపుగా ఇది కొనసాగుతుంది. ఏపీలోని అమరావతి మీదుగా బందరు పోర్టుకు అనుసంధానం అవుతుంది. ఈ మేరకు ప్రాథమికంగా రూపొందించిన అలైన్‌మెంట్ వివరాలు 'ఆంధ్రజ్యోతి'కి లభించాయి. దాని ప్రకారం ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి వరకు 211 కిలోమీటర్ల దూరమే ఉండనుంది. ప్రస్తుత హైదరాబాద్-విజయవాడ మార్గంతో పోలిస్తే ఇది 57 కి.మీ తక్కువ. ప్రస్తుత మార్గంలో ప్రయాణానికి నాలుగున్నర గంటలు పడుతోంది. కొత్త ఎక్స్‌ప్రెస్ వేలో రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చని అంచనా.

ఇదీ అలైన్‌మెంట్ స్వరూపం..

కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డు ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి-గుంటూరు మీదుగా బందరు వరకు ఉంటుంది. తెలంగాణలో రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట జిల్లాల మీదుగా హుజూర్‌నగర్‌కు కుడివైపు నుంచి కొనసాగుతుంది. ఏపీలోని సత్తెనపల్లి సమీపంలో అమరావతికి చేరుతుంది. అమరావతి క్యాపిటల్ సిటీకి కూడా అనుసంధానం అవుతుంది. తర్వాత లంకెలపల్లి మీదుగా బందరు పోర్టుకు చేరుతుంది. ఈ మార్గంలో రెండు వంతెనలు నిర్మించనున్నారు. రోడ్డు మొత్తం పొడవు సుమారు 297.82 కిలోమీటర్లు. అందులో ఫ్యూచర్‌సిటీ నుంచి తెలంగాణ సరిహద్దు వరకు సుమారు 118 కిలోమీటర్లు, అక్కడి నుంచి బందరు పోర్టు వరకు 180 కి.మీ ఉంటుంది. దీని ప్రకారం ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి వరకు 211 కి.మీ దూరం ఉంటుంది. ఇక ఈ రోడ్డు పక్కనుంచే హైస్పీడ్ రైలు మార్గాన్ని కూడా నిర్మించాలని కేంద్రాన్ని ఏపీ, తెలంగాణ కోరుతున్నాయి. ప్రాథమిక అలైన్‌మెంట్ ప్రకారం ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, భూపరిహారం కలిపి రూ.10 వేల కోట్లకుపైగా వ్యయం అవుతుందని అంచనా. అయితే ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు రోడ్డును 12 వరుసలతో నిర్మించేందుకు అవకాశం కల్పించాలని తెలంగాణ సీఎం రేవంత్ ఇటీవల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. దీనికి కేంద్రం సమ్మతిస్తే నిర్మాణ వ్యయంలో మార్పు ఉంటుందని భావిస్తున్నారు. ఈ 12 వరుసల్లో మొదట 6 లేదా 8 వరుసలతో రోడ్డు నిర్మించి.. దశలవారీగా విస్తరించవచ్చని సమాచారం. ప్రస్తుతం దేశంలో ఢిల్లీ-మీరట్ హైవే 12 వరుసలతో, ఢిల్లీ-గుర్గావ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే 16 లేన్ల (8 ఎలివేటెడ్‌గా, 8 సర్వీస్ రోడ్ల)తో ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్-అమరావతి రోడ్డును 12 వరుసలతో నిర్మించేందుకు కేంద్రం సమ్మతిస్తే.. దక్షిణ భారతదేశంలోనే ఇది మొదటి రోడ్డు అవుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★




మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి దర్శకత్వంలో నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్ గారు' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్న సంగతి తెలిసిందే. దగ్గర్లోనే పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటిస్తున్న చిత్రం షూటింగ్ కూడా జరుగుతోంది. షాట్ గ్యాప్‌లో పూరి జగన్నాథ్ విజయ్ సేతుపతితో కలసి చిరంజీవి చిత్రం సెట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా దిగిన ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తోంది.



వరుణ్‌తేజ్, లావణ్య త్రిపాఠి దంపతులకు బుధవారం పండంటి మగబిడ్డ జన్మించాడు. మనవడిని చూసి నాగబాబు, పద్మజ మురిసిపోయారు. 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రీకరణలో ఉన్న చిరంజీవి, ఆస్పత్రికి వెళ్లి వరుణ్, లావణ్యకు శుభాకాంక్షలు తెలిపారు. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్‌మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

అవినీతి అక్రమాలపై 'భద్రకాళి' పంజా



విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటించిన చిత్రం 'భద్రకాళి'. అరుణ్ ప్రభు దర్శకత్వంలో. రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. ఈ నెల 19న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్, స్పిరిట్ మీడియా తెలుగురాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. తాతా మనవళ్ల అనుబంధం, రాజకీయ నాయకుల అవినీతి, అక్రమాల నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రమిదని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక పొలిటికల్ థ్రిల్లర్. వాణిజ్య అంశాలకి, సామాజిక అంశాలను కలిపి తెరకెక్కించాం. విజయ్ ఆంటోని సినీ కెరీర్‌లో ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలుస్తుంది. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అన్నారు.

దుల్కర్‌కు జంటగా పూజా



వరుస చిత్రాలతో దూసుకుపోతున్న దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా రవి నేలకుడితి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'డీక్యూ 41' వర్కింగ్ టైటిల్. ఈ సినిమాలో కథానాయికగా ఎంపిక పూజ హెగ్డేను ఖరారు చేసినట్లు మేకర్స్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లోకి ఆమెను ఆహ్వానిస్తూ టీమ్ ఓ వీడియో విడుదల చేసింది. ఇందులో దుల్కర్‌ను తన స్కూటీపై ఆమె ఎక్కించుకునే సన్నివేశం ప్రత్యేకాకర్షణగా నిలిచింది. 'అద్భుతమైన భావోద్వేగాలు నిండిన డ్రామాగా చిత్రం తెరకెక్కుతోంది. ఇందులోని ప్రేమకథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది' అని మేకర్స్ పేర్కొన్నారు.

ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది

బెల్లంకొండ సాయి శ్రీనివాస్



'కిష్కింధపురి' లాంటి హారర్ చిత్రం ఇప్పటివరకూ రాలేదు. ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. హారర్ మిస్టరీ ఉన్న ఒక కొత్త జానర్ ఇది. క్షణ క్షణం ఉత్కంఠభరితంగా సాగుతూ ప్రేక్షకులను థ్రిల్ చేస్తుంది' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించిన చిత్రమిది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ప్రేక్షకులకు నచ్చే సినిమాలు చేయడానికి నేను ఎక్కువ ఇష్టపడతాను. ఆ క్రమంలో నా నుంచి చాలావరకూ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్స్ వచ్చాయి. నాకు మాత్రం 'కిష్కింధపురి' లాంటి వైవిధ్యమైన కథలతో రూపొందే సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ సినిమా కథ వినగానే నాకు బాగా నచ్చింది.
- కౌశిక్ విజన్‌కు సాహు గారపాటి బడ్జెట్ పరిమితులు పెట్టలేదు. సాంకేతికంగా, గ్రాఫిక్స్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను నిర్మించారు. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. ఇదొక సీరియస్ హారర్ ఫిల్మ్ అయినా అనుపమా పరమేశ్వరన్‌కు నటనకు ఆస్కారమున్న పాత్ర లభించింది. చాలా కష్టమైన భావోద్వేగాలను ఆమె అలవోకగా పలికించిన తీరు ప్రేక్షకులను అలరిస్తుంది. అలాగే ఈ సినిమాకు సౌండ్ ప్రత్యేకాకర్షణగా నిలుస్తుంది. 'సలార్', 'యానిమల్', 'కాంతార' లాంటి సినిమాలకు పనిచేసిన సౌండ్ ఇంజినీర్ రాధాకృష్ణ గారు ఈ చిత్రం సౌండ్‌ని అద్భుతంగా డిజైన్ చేశారు. నా తదుపరి చిత్రాల్లో 'టైసన్ నాయుడు' షూటింగ్ పూర్తయింది. 'హైందవి' చిత్రీకరణ తుది దశలో ఉంది. పొలిమేర దర్శకుడు అనిల్‌తో ఓ న్యూ ఏజ్ థ్రిల్లర్ చేస్తున్నాను.

పవిత్ర దృశ్యకావ్యం



చందూ మొండేటి దర్శకత్వంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ 'వాయుపుత్ర' అనే చిత్రాన్ని నిర్మించనున్నారు. బుధవారం ఈ ప్రాజెక్ట్‌ను నాగవంశీ అధికారికంగా ప్రకటించి ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. వచ్చే ఏడాది దసరాకి చిత్రం విడుదలవుతుందని తెలిపారు. 'హనుమంతుడి కథతో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇది కేవలం సినిమా కాదు, థియేటర్లను దేవాలయాలుగా మార్చే పవిత్ర దృశ్యకావ్యం' అని పేర్కొన్నారు. పాన్ ఇండియా స్థాయిలో త్రీడీలో చిత్రాన్ని రూపొందించనున్నారు.

భిన్న కోణాలను ఆవిష్కరించే పాత్ర

రితికా నాయక్



"అశోకవనంలో అర్జున కల్యాణం' కథానాయికగా నా తొలి చిత్రం. అది పూర్తయ్యాక ఒక మంచి పాత్ర కోసం ఎదురుచూస్తున్న సమయంలో 'మిరాయ్' చిత్రంలో తేజ సజ్జ సరసన అవకాశం వచ్చింది. ఇందులో బలమైన వ్యక్తిత్వమున్న యువతి పాత్రలో నటించాను. నటిగా నాలోని భిన్న కోణాలను ఆవిష్కరించే పాత్ర ఇది' అని రితికా నాయక్ చెప్పారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతున్న సందర్భంగా రితికా నాయక్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమాలో పోరాట ఘట్టాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాయి. పనిపట్ల నిబద్ధత ఉన్న వ్యక్తి తేజ. మంచు మనోజ్ గారు శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు. జగపతి బాబు, శ్రియ గారితో కలసి నటించడం వల్ల నటనలో మెలకువలు తెలుసుకున్నాను. కార్తీక్ ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించి సినిమాను తెరకెక్కించారు. విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలు చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలనేది నా కోరిక' అని రితిక చెప్పారు.

నయనతార.. కేసు మీద కేసు!



అగ్ర కథానాయిక నయనతార తన జీవిత విశేషాలపై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రంలో ఉన్న 'చంద్రముఖి' చిత్ర దృశ్యాలను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు ఆ లఘుచిత్ర నిర్మాణ సంస్థకు నోటీసులు జారీ చేసింది. గత యేడాది నవంబర్‌లో నయనతార నిర్మాణ సంస్థ డార్క్ స్టూడియో రూపొందించిన లఘుచిత్రాన్ని ఓటీటీలో ప్రదర్శించారు. ఆ లఘుచిత్రంలో హీరో ధనుష్ నిర్మాణ సంస్థ 'వండర్‌బార్' నిర్మించిన 'నానుమ్ రౌడీదాన్' మూవీ దృశ్యాలు ఉండటం వివాదాస్పదంగా మారింది. కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలంటూ ధనుష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఆ లఘుచిత్రంలో ఉన్న 'చంద్రముఖి' చిత్ర దృశ్యాలను తొలగించాలని కోరుతూ ఆ మూవీ నిర్మాణ సంస్థ ఏబీ ఇంటర్నేషనల్ తాజాగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం గమనార్హం.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

భారత ప్రభుత్వం

రైల్వే మంత్రిత్వ శాఖ (దక్షిణ మధ్య రైల్వే)

నోటిఫికేషన్

సికింద్రాబాద్,4-09-2024

ఆర్.సి.నెం.1381/2023 -సి   తేదీ :10.09.2025

రైల్వే చట్టం, 1989 సెక్షన్ 20-ఎ లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను అమలు చేయు నిమిత్తం కేంద్ర ప్రభుత్వం వారు ప్రజా ప్రయోజనార్థం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని పల్నాడు జిల్లా "గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్" అను ప్రత్యేక ప్రాజెక్టు అమలు, నిర్వహణ, ఆపరేషన్ కోసం అవసరమైన భూమిని భూసేకరణ నిమిత్తం తేది: 12-09-2024 న ప్రచురించడమైనది.

సదరు భూమిపై సంబంధిత చట్టం లోని సెక్షన్ 20-డి సబ్-సెక్షన్ (1) దాఖలా పై తెలిపిన నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి ఎటువంటి అభ్యంతరములు వ్రాతపూర్వకముగా సమర్థప్రాధికారి (భూ సేకరణ) & రెవిన్యూ డివిజినల్ అధికారి, గురజాల వారికి వ్యక్తిగతంగా గానీ న్యాయవాదుల ద్వారా గానీ వ్యక్తం చేసి యుండలేదు.

కావున, రైల్వే చట్టం, 1989 సెక్షన్ 20-ఇ ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని పల్నాడు జిల్లా "గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్" అను ప్రత్యేక ప్రాజెక్టు అమలు కొరకు ఈ దిగువ షెడ్యూలు నందు పొందుపరిచిన భూములను భూ సేకరణ ద్వారా ప్రతిపాదించడమైనది.

సదరు చట్టం లోని సెక్షన్ 20-డి నందలి సబ్-సెక్షన్ (2) ప్రకారం సమర్థప్రాధికారి చేసిన ఉత్తర్వులే తుది నిర్ణయం అవుతుంది.

ఈ నోటిఫికేషన్ కింద భూ సేకరణ చేయబడిన భూములకి సంబంధించి ల్యాండ్ ప్లానులు, మరియు ఇతర వివరములు పైన తెలుపబడిన సంబంధిత సమర్థప్రాధికారి వారి కార్యాలయంలో అందుబాటులో ఉంటాయి మరియు ఆసక్తి గలవారు వాటిని తనిఖీ చేసుకోవచ్చు. భూసేకరణలో సముచిత పరిహారం పొందే హక్కు మరియు పారదర్శకత, పునరావాసం మరియు పునర్ ఉపాధికల్పన చట్టం, 2013 (చట్టం నం.30 2013) ప్రకారం అందించబడుతుంది.

షెడ్యూలు :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని పల్నాడు జిల్లా "గుంటూరు-బీబీనగర్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్" అను ప్రత్యేక ప్రాజెక్టు కోసం నిర్మాణంతో లేదా నిర్మాణం లేకుండా భూసేకరణ నిమిత్తం సేకరించిన భూమి యొక్క వివరణ.

గ్రామము : నడికుడి   మండలము : దాచేపల్లి

క్ర. సం	మండలము పేరు	గ్రామము పేరు	సర్వే నెం/ & సబ్ డివిజన్ నెం.	విస్తీర్ణము (య.-సెంట్లు)	లబ్దిదారుని పేరు (తండ్రి లేక భర్త)	భూ వర్గీకరణ (పట్టా/ ప్రభుత్వ/ అసైన్మెంట్)	భూ స్వభావము (మాగాణి / మెట్ట)	నిర్మాణాలు / చెట్లు మరియు భూమి పై ఉన్న ఇతరములు	రిమార్కులు
1	దాచేపల్లి	నడికుడి	218/16-2B2	0.32	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ		...	
2			218/24-A2A	0.06	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ		...	
3			220-3A	0.07	పగడాల నాగేశ్వరరావు తండ్రి గురవయ్య	ఇనాం	మెట్ట	...	
4			224/1-3C1	0.36	చల్లగుండ్ల విజయ లక్ష్మి భర్త శ్రీరామ మూర్తి	ఇనాం	మెట్ట	వేప చెట్టు	
5			224/1-3C1	0.18	పగడాల నాగేశ్వరరావు తండ్రి గురవయ్య	ఇనాం	మెట్ట	...	
6			218/17-1B	0.03	షేక్ సామ్ సైద తండ్రి మస్తాన్	పట్టా	మెట్ట	...	
7			218/17-3A1	0.11	షేక్ అల్లుల్లా తండ్రి నాసర్ సాహెబ్	పట్టా	మెట్ట	వేప చెట్టు	
8			218/17-3C1	0.06	షేక్ సైదాబి భర్త పుల్లయ్య	పట్టా	మెట్ట	...	
9			218/19-A/B	0.03	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ	....	...	
10			218/19-A3A1	0.14	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ	....	...	
11			218/23-B1B1A	0.03	ప్రభుత్వ భూమి	ప్రభుత్వ	.....	...	
	మొత్తం :			1.39					

గ్రామము : పెదగార్లపాడు   మండలము : దాచేపల్లి

1	దాచేపల్లి	పెదగార్లపాడు	2/B-2	0.02	నాదెండ్ల సురేష్ తండ్రి వెంకటేశ్వర్లు	పట్టా	మెట్ట	...	
2			7/B-2	0.09	సజ్జా సాంబశివరావు తండ్రి వెంకటప్పయ్య	పట్టా	మెట్ట	...	
110	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	679/2B-1	0.25	అల్లు సత్యనారాయణ రెడ్డి	పట్టా భూమి	మెట్ట		
111	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	680/B	0.01	ఇతరులు	పట్టా భూమి	మెట్ట		
112	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	682/A-1B	0.17	1) అల్లు సైదారెడ్డి 2) కొమ్మ శ్రీనివాస రెడ్డి	సర్వీసు ఇనాం	మెట్ట		
113	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	682/A-1C	0.19	మద్యాల గురవారెడ్డి	సర్వీసు ఇనాం	మెట్ట		
114	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	682/B-3A	0.83	ఇతరులు	పట్టా భూమి	మెట్ట		
115	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	840/B-1	0.61	రాళ్ల గుట్ట	ప్రభుత్వ భూమి	-		రాళ్ల గుట్ట
116	పిడుగురాళ్ల	తుమ్మల చెరువు	842/B-1	0.43	రాగిడి రాజారావు	పట్టా భూమి	మెట్ట		
		పూర్తి విస్తీర్ణం :		22.03					

ప్రదేశం : గురజాల
తేది : 10-09-2025

సం/- వి. మురళీకృష్ణ,
కాంపిటెంట్ అథారిటీ (యల్.ఎ) & రెవిన్యూ డివిజనల్ అధికారి
గురజాల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

సచివాలయ సిబ్బందికి పీ-4 బాధ్యతలు

బంగారు కుటుంబాలకు మ్యాపింగ్

- 21.56 లక్షల కుటుంబాలను 2.14 లక్షల క్లస్టర్లుగా విభజన
- ఒక్కో ఉద్యోగికి మూడు క్లస్టర్లు
- బంగారు కుటుంబాలు, మార్గదర్శులకు సమన్వయకర్తగా సచివాలయ ఉద్యోగి

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పీ-4 బాధ్యతలు అప్పగించారు. ఆయా సచివాలయాల పరిధిలో ఉన్న బంగారు కుటుంబాలకు, వారిని దత్తత తీసుకునే మార్గదర్శులకు మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు. సచివాలయాల పరిధిలో బంగారు కుటుంబాలను క్లస్టర్లుగా విభజించి, వాటికి మ్యాపింగ్ చేశారు. బుధవారం ప్రణాళిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు తమకు కేటాయించిన క్లస్టర్ల పరిధిలోని బంగారు కుటుంబాలతో సమన్వయం చేసుకుంటారు. ఒక్కో సచివాలయ ఉద్యోగికి కనీసం మూడు క్లస్టర్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 14,954 సచివాలయాల్లో 1,08,311 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. మొత్తం 21,56,637 బంగారు కుటుంబాలను ఎంపిక చేసి, 2,14,084 క్లస్టర్లుగా విభజించారు. ఆయా సచివాలయ ఉద్యోగులకు ఏయే క్లస్టర్లు కేటాయించారో దానికి సంబంధించిన వివరాలను కూడా ప్రణాళిక శాఖ విడుదల చేసింది. మార్గదర్శి, బంగారు కుటుంబాల మధ్య ఉద్యోగులు సమన్వయం చేస్తారు. ఈ బాధ్యతలు ఆయా ఉద్యోగుల విధుల్లో భాగంగా పేర్కొన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన ఆయా కుటుంబాలను కనీసం వారానికి ఒకసారి సంప్రదించాలి. మార్గదర్శుల నుంచి అవసరమైన సహకారాన్ని బంగారు కుటుంబాలకు అందించేందుకు కృషి చేస్తారు. బంగారు కుటుంబాల సమస్యలను మార్గదర్శులకు తెలియజేయడం, అవసరమైనప్పుడు వారికి సహకరించడం చేస్తారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శుల మధ్య వ్యవహారాలను జీరో పావర్టీ పీ-4 పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. దీనికోసం మొబైల్ /వెబ్ అప్లికేషన్‌ను అందిస్తారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక శాఖ పరిధిలో మానిటర్ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రణాళిక శాఖదే. ఒక్కో సచివాలయ ఉద్యోగికి 100 బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేసి, వారి కోసం ప్రత్యేక లాగిన్ క్రియేట్ చేస్తారు. ప్రతి ఉద్యోగి పరిధిలో బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాల్సి వచ్చినప్పుడల్లా అలెర్ట్ మెసేజ్ వస్తుంది. ప్రతి సచివాలయ ఉద్యోగి ఎంపీడీఓ పర్యవేక్షణలో పనిచేస్తారు. మొత్తంగా ఈ కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయ శాఖ, ప్రణాళిక శాఖలు పర్యవేక్షిస్తాయి. బంగారు కుటుంబాలు విద్య, వైద్యం, హౌసింగ్, జీవనోపాధి మెరుగుదల తదితర సేవలు పొందుతాయి. ఏదైనా నైపుణ్య శిక్షణలో బంగారు కుటుంబాలను పాల్గొనేలా చూడాలి. మార్గదర్శుల నుంచి స్వీకరించిన సేవలకు సంబంధించిన రికార్డులను నిర్వహించాలి.



పాల్ అధ్యయన ఫలితాలను విడుదల చేస్తున్న నోబెల్ అవార్డు గ్రహీత మైఖేల్ క్రెమర్, ఐఏఎస్ బీ శ్రీనివాసరావు తదితరులు

'పాల్' అమలులో రోల్ మోడల్ ఏపీ

- నోబెల్ గ్రహీత మైఖేల్ క్రెమర్ ప్రశంస

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగతీకరణ అనుకూల అభ్యాసం(పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్-పాల్) అమలులో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని నోబెల్ అవార్డు గ్రహీత ఆచార్య మైఖేల్ క్రెమర్ ప్రశంసించారు. విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉన్నతాధికారుల దూరదృష్టి, నాయకత్వం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల అభ్యసనా ఫలితాల్లో పాల్ ప్రభావంపై క్రెమర్, అతని బృందం అధ్యయనం చేసింది. ఆ ఫలితాలను బుధవారం ఢిల్లీలో విడుదల చేశారు. పాల్ అమలులో ఉత్తమ ప్రదర్శన చూపించిన ఏపీ సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్‌పీడీ) బి.శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పీడీ మాట్లాడుతూ... 'పాల్ అమలులో పాఠశాల విద్యాశాఖ కీలక పాత్ర పోషిస్తోంది. పాల్ ల్యాబ్స్ వినియోగంపై 2023 నుంచి 2025 వరకు కన్విజీనియస్ ఏఐ సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా 60 పాఠశాలల్లో అధ్యయనం చేశాం. పాల్ లేని పాఠశాలల్లోని విద్యార్థులతో పోలిస్తే పాల్ ల్యాబ్స్ ఉన్న విద్యార్థులు 2.35 రెట్లు ఎక్కువ అభ్యసన సామర్థ్యాలను ప్రదర్శించారు. 1,200కు పైగా పాఠశాలల్లో పాల్ అమలుచేస్తున్నాం' అని చెప్పారు.

20లోగా ఫీజులు విడుదల చేయాలి

- ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సంఘం డిమాండ్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): భారీగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఈనెల 20లోగా విడుదల చేయాలని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం డిమాండ్ చేసింది. సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. అనంతరం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి విద్యాసాగర్, పెద్దిరెడ్డి మధుసూదనరావు ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజులు పెండింగ్‌లో ఉన్నందున కాలేజీల నిర్వహణ కష్టంగా మారింది. బోధనా సిబ్బందికి, ఇతర సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నాయి. పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలి. ఈనెల 20 వరకు ప్రభుత్వ ప్రతినిధులను, అధికారులను కలిసి పరిస్థితిని వివరిస్తాం. అప్పటికీ ఫీజులు విడుదల చేయకపోతే మరోసారి సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తాం' అని వారు తెలిపారు.

పట్టణప్రాంత రీ సర్వేపై
సీఎస్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా 10 పట్టణ ప్రాంతాల్లో అమలు చేస్తోన్న 'నక్ష ప్రాజెక్టు' పర్యవేక్షణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. ఈ మేరకు రెవెన్యూ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి ఉత్తర్వు జారీ చేశారు. గతంలో జగన్ హయాంలో ఆయన ప్రధాన సలహాదారు అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ ఉండేది. ఇప్పుడు ఈ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తూ సీఎస్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ), రెవెన్యూ, ఆర్థిక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక, ఐటీ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. సర్వే కమిషనర్ సభ్య కార్యదర్శిగా ఉంటారు. కాగా, జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఇదిలా ఉంటే, రెగ్యులర్ భూ సర్వేకు కూడా ఇవే కమిటీలు ఉంటాయి. రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ అజెండా ప్రకారం సమావేశమై రీ సర్వేపై నిరంతరం సమీక్ష చేయనుంది.



కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజును నాయుడమ్మ అవార్డుతో సత్కరిస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్

వికసిత భారత్ కోసం
శాస్త్రవేత్తలు కృషి

- నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ కోసం శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు కృషి చేస్తున్నారని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. బుధవారం దివంగత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారం ప్రదానోత్సవం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజుకు ఈ అవార్డును జిష్ణుదేవ్‌వర్మ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణుల లక్ష్యం సమాజం బాగుండాలన్నదేనని అన్నారు. తెనాలి రామకృష్ణ కవి ప్రాంతానికి తాను రావడం ఆనందంగా ఉందన్నారు. తాను త్రిపుర ఉపముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఐఏఎస్ అధికారి నాగరాజు సహకారం అందించారని చెప్పారు. పురస్కార గ్రహీత, ఐఏఎస్ అధికారి నాగరాజు మాట్లాడుతూ.. నాయుడమ్మ ప్రపంచస్థాయి శాస్త్రవేత్త అని కొనియాడారు. ఆయన పేరిట పురస్కారాన్ని అందుకున్న తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త స్వర్ణ వి కాంత్, నాయుడమ్మ అవార్డు ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

ఏపీ గవర్నర్‌ను కలిసిన తెలంగాణ గవర్నర్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం రాజ్‌భవన్‌కు వచ్చిన జిష్ణుదేవ్ వర్మను అబ్దుల్ నజీర్ సాదరంగా ఆహ్వానించారు. ఇద్దరు గవర్నర్లు కాసేపు ముచ్చటించుకున్నారు. తెలంగాణ గవర్నర్‌ను ఏపీ గవర్నర్ శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే తెలంగాణ గవర్నర్ కూడా ఏపీ గవర్నర్‌ను సత్కరించి జ్ఞాపిక అందించారు.

సంస్కారం లేని విద్య.. దండగ

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

కవాడిగూడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సంస్కారం లేని విద్య పరమ దండగ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠంలో ఉన్న స్వామి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సంస్థ 25 ఏళ్లుగా వేలాదిమందిని సంస్కారవంతులుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. పాశ్చాత్య వ్యామోహాలకు లోనుకాకుండా స్వదేశీ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని కోరారు. రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పాల్గొన్నారు.

గనుల అనుమతులకు
రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గనుల లీజులకు పలు శాఖల అనుమతులు కావాలి. వాటిని సకాలంలో పొందేందుకు, పనులను సమన్వయంతో సాధించడానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీలో గనుల శాఖ కార్యదర్శి, పర్యావరణ, అటవీ శాఖ, పరిశ్రమలు, రెవెన్యూ శాఖ కార్యదర్శులు, కాలుష్య నియంత్రణ మండలం సభ్య కార్యదర్శి, సియా సభ్య కార్యదర్శి, ప్రధాన అటవీ సంరక్షణాధికారి(పీసీసీఎఫ్), గనుల శాఖ డైరెక్టర్, ఇంకా న్యాయ నిపుణులు, ఆయా విభాగాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. ఇక జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు.



అనంతపురంలో 'సూపర్ హిట్' బహిరంగ సభలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా. వేదికపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు నిమ్మల, సత్యకుమార్, టీజీ భరత్, సంధ్యారాణి, సవిత, నాదెండ్ల, నారాయణ, పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు

ఏపీ సూపర్ హిట్!



సూపర్ హిట్ పతాకాలను చేతబట్టి వేదికపైకి వస్తున్న పవన్ కల్యాణ్, చంద్రబాబు, మాధవ్



(మొదటి పేజీ తరువాయి)

పులివెందులలోనే ప్రజలు బుద్ధి చెప్పారని ఇకపై వారి ఆటలు సాగవని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది. అందుకే రెండంకెల వృద్ధి. సంపద సృష్టిస్తానని చెప్పాను. పెంచిన సంపదను పేదలకు పంచుతానన్నాను. 2025-26లో రాష్ట్రం 10.5 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటు నమోదు చేసింది. ఇది జాతీయ స్థాయి కంటే ఎక్కువ. ఇదీ కూటమి ప్రభుత్వ సత్తా' అని ప్రకటించారు. 'రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలల పాలనపై నిర్వహిస్తున్న తొలి సభ ఇది. నేటి సభకు కారణమైన స్త్రీశక్తికి, యువకిశోరాలకు, ప్రతి తల్లికి, అన్నదాతకు వందనం.. కార్యకర్తల కష్టానికి.. త్యాగానికి వందనం' అని పేర్కొన్నారు. సంక్షేమం అంటే.. ఓట్ల రాజకీయం కాదని, తాత్కాలిక అవసరాలు తీర్చడం కాదని.. సంక్షేమం అంటే పేదల జీవితాలను మార్చడమేనని చెప్పారు. పథకాలు పేదల జీవనప్రమాణాలు పెంచేవని, అందుకే అన్ని వర్గాలతో మాట్లాడి 2024లో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చామని తెలిపారు. ఈ ఎన్నికలు చరిత్రను తిరగరాశాయని, కనివినీ ఎరుగని రీతిలో కూటమికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యబీమా

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దసరా కానుకగా పన్నులు తగ్గిస్తున్నారు. ఆ స్ఫూర్తితో చిన్నా పెద్దా.. ధనిక పేద వ్యత్యాసం లేకుండా యూనివర్సల్ హెల్త్ స్కీం తీసుకొస్తున్నాం. అందరికీ రూ.2.50 లక్షలు ఆరోగ్య బీమా కల్పించిన ఏకైక ప్రభుత్వం దేశంలో కూటమి ప్రభుత్వం మాత్రమే. పేదవారికి రూ.25 లక్షలు ఆరోగ్యశ్రీ కింద ఆరోగ్య బీమా అందిస్తాం. దీంతోపాటు సంజీవని ప్రాజెక్టు తీసుకొస్తున్నాం. దీని ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది.

అగాధంలోకి నెట్టారు..

గత పాలకులు ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలుపెట్టి రాష్ట్రాన్ని అగాధంలోకి నెట్టేశారు. పెట్టుబడుల్ని తరిమేసి పరిశ్రమలు రాకుండా చేశారు. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను నిలిపివేశారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. నిరుద్యోగం, గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రాన్ని కేంద్రంగా మార్చేశారు. మా

మెడికల్ కాలేజీలంటే తెలియని నాయకుడు..

రాష్ట్రంలో ఓ నాయకుడు ఉన్నాడు. మెడికల్ కాలేజీలంటే తెలియదు.. ఏదో పొడిచేశానని చెబుతున్నాడు. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్యను పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిది. ఆస్తి మనది.. వేరేవారు నిర్వహిస్తారు. 2026-27కి నాలుగు, 2027-28కి ఏడు మెడికల్ కాలేజీలు వస్తాయి. వీటిలో 50శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద వస్తాయి. వైసీపీ హయాంలో 42 శాతమే వచ్చేవి. వైసీపీ వారు శాసనసభకు రాకుండా రప్పా రప్పా అని రంకెలు వేస్తున్నారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకోం. ఇక్కడ ఉండేది సీబీఎన్, పవన్ కల్యాణ్. ఆడబిడ్డలను అవమానిస్తే ఖబడ్దార్. పోస్టు పెట్టిన 5 నిమిషాల్లో మీ చొక్కా పట్టుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారు.

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలలుగా అనేక సవాళ్లను అధిగమించి ఒక్కో అడుగు వేస్తూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. నిర్వీర్యమైన వ్యవస్థలను సరిదిద్ది.. మాట ఇచ్చినట్లుగా అన్ని పథకాలూ అమలు చేస్తున్నాం. అందులో భాగంగానే పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు మార్చే సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి.. సూపర్ హిట్ చేసి మాట నిలబెట్టుకున్నాం. నాడు మేం సూపర్ సిక్స్ అంటే అవహేళన చేశారు. పింఛన్ల పెంపు అంటే అసాధ్యమన్నారు. పిల్లలందరికీ తల్లికి వందనం అంటే ట్రోల్ చేశారు. మెగా డీఎస్సీ అవ్వదన్నారు.. దీపం వెలగదన్నారు.. ఫ్రీబస్సు కదలదన్నారు. కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం.

అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నాం

రాష్ట్రం కోసం నేను, పవన్ కల్యాణ్ అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నాం. ప్రజలకు న్యాయం చేయాలి. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలనేదే మా ఆలోచన. ఇది తప్ప మాకు వేరే ధ్యాస లేదు. ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యం. రాష్ట్రానికి మంచి చేయాలనే మా సంకల్పానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది. మాకు మద్దతుగా నిలిచిన ప్రధాని మోదీకి అనంతపురం నుంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఈ సందర్భంగా మూడు పార్టీల కార్యకర్తలకు, నాయకులకు ఓ మాట స్పష్టం చేస్తున్నా.. మనం పాలకులం కాదు.. సేవకులం. పెత్తందారులం కాదు ప్రజల భవిష్యత్ కోసం పనిచేసే వారసులం. అహంకారం, అవినీతి, అలసత్వం, అసంతృప్తి అనేది దరికి రానివ్వద్దు. ఏ పొరపాటూ చేయవద్దు. అదే సమయంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం చేసే బాధ్యత మనందరిపై ఉంది. ఐకమత్యంతో ఉండాలి. కలిసి ఉంటేనే మనకు బలం. 47 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా.. నాలుగో సారి సీఎంగా ఉన్నా. నా దృష్టిలో సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు కామన్ మ్యాన్. నేనే క్యామన్ మ్యాన్ అంటే మన ఎమ్మెల్యేలు కూడా కామన్ మ్యాన్‌లానే ఉండాలి. ఆర్భాటాలకు దూరంగా ఉండండి, ఇష్టానుసారం వ్యవహరించొద్దు. నేను, పవన్, మాధవ్ (బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు) ఓ కమిట్‌మెంట్‌తో ముందుకెళ్తున్నాం. రాష్ట్రంలో రామరాజ్యం లాంటి పాలన ఇచ్చే బాధ్యత నాది, పవన్, మాధవ్‌ది. ఎమ్మెల్యే తప్పు చేసినా.. కార్యకర్త తప్పు చేసినా.. అధికారి తప్పు చేసినా.. ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. అందుకే అందరితో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నా, పవన్, మాధవ్ కూడా వారి వారి పార్టీల వారితో మాట్లాడుతున్నారు. మేం ప్రజల కోసం పనిచేస్తున్నాం.. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలూ సహకరించాలి. కలిసి పోటీ చేశాం.. కలిసి గెలిచాం.. కలిసి పనిచేస్తున్నాం. ప్రజల దీవెనలతో ఈ హిట్ కాంబినేషన్ కొనసాగుతుంది.



జగన్‌కు క్లాస్ తీసుకోండి..

వైసీపీ వారిది ధృతరాష్ట్ర కౌగిలి. ఎవరైనా పొరపాటున వారి ఫేక్ మాటలు నమ్మి దగ్గరకు వెళ్తే ఆ ధృతరాష్ట్ర కౌగిలికి బలవుతారు. ఆ ఐదేళ్లూ రాష్ట్ర ప్రజలందరిదీ అదే పరిస్థితి. ఉనికి కోల్పోతున్నందునే వైసీపీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. పార్టీ కార్యాలయాలు మూసుకుని సోషల్ మీడియా కార్యాలయాలు తెరుస్తున్నారు. సిద్ధం సిద్ధం అంటూ నాడు ఎగిరిపడ్డారు. నేడు అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అంటే కిక్కురుమనడం లేదు. ప్రజలంతా కలిసి జగన్‌కు క్లాస్ తీసుకోండి. ప్రతిపక్ష హోదా లేకపోయినా అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలు చర్చించాలని చెప్పండి.

నేపాల్లోని తెలుగువారిని తీసుకొచ్చే బాధ్యత లోకేశ్‌కు

నేపాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. అక్కడ సుమారు 200 పైచిలుకు తెలుగువారు చిక్కుకుపోయారు. 'ఆపదలో ఉన్న మన తెలుగువారిని ఆదుకునేందుకు.. వారికి ధైర్యం చెప్పేందుకు మంత్రి లోకేశ్‌ను ఆర్టీజీఎస్‌లో ఉండి పర్యవేక్షించాలని చెప్పా. తెలుగువారందరినీ క్షేమంగా ఇంటికి తీసుకొచ్చే బాధ్యత అప్పగించా. అదీ బాధ్యత అంటే.

సీమ ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చింది టీడీపీనే..

తెలుగుదేశం ఆవిర్భావంతోనే రాయలసీమ ప్రజల జీవితాల్లో మార్పు మొదలైంది. వారి జీవితాలు మార్చేందుకు సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులు మా హయాంలో వచ్చినవే. ఈ ఏడాది రాయలసీమలో వర్షాలు పడలేదు. అయినా అన్ని చెరువుల్లోకి నీరు పారిస్తున్నాం. సీమలో 52 సీట్లకు 45 సీట్లు గెలిచాం. భవిష్యత్‌లో 52 స్థానాలూ గెలుస్తాం. 15 నెలల పాలనతో సీమలో కూటమి మరింత బలపడింది. ఈ ప్రాంత అభివృద్ధికి బ్లూ ప్రింట్ అమలు చేస్తున్నాం. రూ.3,850 కోట్లతో హంద్రీ-నీవా కాలువ విస్తరించి కృష్ణమ్మను కుప్పం వరకు తీసుకొచ్చాం. ఐదేళ్లలో వైసీపీ వారు చేయలేని పనిని 100 రోజుల్లో చేశాం. అన్ని ప్రాజెక్టుల్లో నీటిని నింపుతాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు.. రతనాల సీమని నిరూపిస్తాం. ఎవరు అడ్డుపడినా సీమ అభివృద్ధి ఆగదు. ఇది నా భరోసా.. సీబీఎన్ భరోసా!

బిడ్డల బంగారు భవిష్యత్‌కు పెట్టుబడి..

ఏ వ్యక్తి జీవితాన్నైనా.. ఏ కుటుంబ స్థితిగతులనైనా మార్చేది చదువు. ప్రతి పేద బిడ్డా చదవాలని తల్లికి వందనం తీసుకొచ్చాం. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా అంతమందికీ రూ.15 వేలు చొప్పున ఇచ్చాం. 67 లక్షల మందికి ఒకేసారి రూ.10 వేల కోట్లు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది. నా కళ్లతో చూశాను. ఒక తల్లి వచ్చి నాకు ఏడు మంది పిల్లలు ఉన్నారు. అందరికీ డబ్బులు ఇచ్చారని చెబుతుంటే దాని కన్నా ఆనందం ఏముంది. ఇది రూ.10 వేల కోట్ల పథకం కాదు. మీ బిడ్డల బంగారు భవిష్యత్ కోసం ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి.

- స్త్రీశక్తి పథకాన్ని అమలు చేసి ఆడబిడ్డలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాం. నాడు బాబే మీ డ్రైవర్ అని చెప్పాను. చెప్పినట్లుగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 5 కోట్ల మంది ఉచిత ప్రయాణాలు చేశారు. మహిళలకు రూ.200 కోట్లు ఆదా అయింది.
- రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది. అన్నం పెట్టే రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకాన్ని తెచ్చాం. కేంద్రం ఇచ్చే మొత్తంతో కలిపి ఏటా మూడు విడతల్లో రూ.20వేలు ఇస్తున్నాం. తొలి విడతగా ఇప్పటికే రూ.7వేలు ఇచ్చాం. 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు జమ చేశాం. ఏ రైతుకూ యూరియా కొరత లేకుండా చూసుకుంటాం. ఎంత యూరియా కావాలో అంతే వాడండి.
- ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చి మహిళల వంటింటి కష్టాలు తీర్చాం. నేడు మళ్లీ దీపం-2 పథకం ద్వారా ఉచితంగా 3 సిలెండర్లు ఇస్తున్నాం. ఇప్పటికే రూ.1,704 కోట్లు ఖర్చు చేసి 2.45 కోట్ల ఉచిత సిలెండర్లు మహిళలకు ఇచ్చాం.
- యువకిశోరాలకు అండగా ఉంటే కొండలనైనా బద్దలు చేస్తారు. 20 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని సూపర్ సిక్స్‌లో చెప్పాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు ఏడాదిలోనే భర్తీ చేశాం. నైపుణ్య శిక్షణ ద్వారా లక్ష మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చాం. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. మనం ఏడాదిలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చాం. మీ భవిష్యత్‌ను బంగారు భవిష్యత్ చేసే బాధ్యత మాది.
- ఒకప్పుడు ప్రతి ఇంటికీ ఒక ఐటీ ఉద్యోగి ఉండాలని అన్నాను. ఈసారి ప్రతి ఇంటికీ ఓ పారిశ్రామికవేత్తను తయారు చేస్తానని చెబుతున్నాను. లక్ష మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం.
- దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం మనం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు. పేదల సేవలో భాగంగా ప్రతినెలా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఇప్పటి వరకు రూ.45 వేల కోట్లు ఇచ్చాం.
- పేదవాడి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు పెట్టాం. వాటి ద్వారా ఇప్పటి వరకు 5.60 కోట్ల భోజనాలతో పేదల కడుపు నింపాం. ఇంతకంటే ఆనందం ఏముంది? గత ప్రభుత్వం పేదల పొట్టకొట్టి.. అన్న క్యాంటీన్లు మూసేసింది.

ఆటో కార్మికులకు దసరా కానుక

ప్రతి ఒక్కరికీ ఏటా 15 వేలు

ఎన్నికల్లో చెప్పాం.. ఎన్ని కష్టాలున్నా అమలుచేస్తాం: ముఖ్యమంత్రి

'కూటమి ప్రభుత్వం అందరి ప్రభుత్వం.. అన్ని వర్గాల జీవితాలు మార్చే ప్రభుత్వం.. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్లు నష్టపోకుండా వారందరికీ ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తాం. ఈ దసరా రోజునే అందజేస్తాం. ఎన్నికల్లో చెప్పాం.. ఎన్ని కష్టాలున్నా చేస్తాం. ఇదీ పేదలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న ప్రేమ' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హెల్తీ వెల్తీ హ్యాపీ సొసైటీ ఉండాలన్నది తన కోరికని, దానికోసమే పీ-4 తెచ్చామని అనంతపురంలో జరిగిన 'సూపర్‌సిక్స్-సూపర్‌హిట్' సభలో చెప్పారు. తన జీవితాంతం పేదవారి పక్షానే ఉంటానని, చివరి శ్వాస వరకు.. ప్రతి ఒక్క రక్తపు బొట్టూ పేదవారి కోసం చిందిస్తానని స్పష్టం చేశారు.



బహిరంగ సభలో స్పీకర్ల స్టాండ్ ఎక్కి, యువకుల హల్‌చల్





బహిరంగ సభకు హాజరైన జనం



సూపర్ సిక్స్ పథకాల ప్లకార్డులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

త్రికరణ శుద్ధితో పని చేస్తున్నాం

రాష్ట్రం బాగు పడాలన్నదే కూటమి ఆకాంక్ష

2047 నాటికి దేశంలో ఏపీని నెంబర్ వన్ చేస్తాం: డిప్యూటీ సీఎం పవన్



అనంతపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రం బాగుండాలి. ఇంకా ఇంకా బాగుపడాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలి. ఈ ఆకాంక్షతోనే కూటమి ప్రభుత్వం త్రికరణ శుద్ధితో పని చేస్తోంది." అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన 'సూపర్‌సిక్స్-సూపర్ హిట్' సభకు సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. సభకు విచ్చేసిన జన వాహినిని ఉద్దేశించి పవన్ ప్రసంగించారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రగతి, ప్రజల శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు నాయకత్వంలో హామీలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో ప్రతి కుటుంబానికీ రూ.25లక్షల ఆరోగ్య బీమా అమలు చేయనున్నట్టు తెలిపారు. "రాళ్లసీమను రతనాల సీమగా మార్చే ప్రణాళికలతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గ్రామ స్వరాజ్య స్థాపన లక్ష్య సాధనలో భాగంగా 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించాం. 'పల్లె పండుగ' ద్వారా గ్రామాల్లో 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2,007 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశాం. రైతులకు అండగా లక్షా 55 వేల నీటి కుంటలు నిర్మించాం. వీటి ద్వారా ఒక టీఎంసీ నీటిని నిల్వచేయగలిగాం. ప్రధాని మోదీ సహకారంతో 'పీఎం జన్‌మన్' పథకం అమలు చేస్తున్నాం. ఉపాధి హామీ పథకం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.1,005 కోట్లతో 625 గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ 1,069 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మిస్తున్నాం. తద్వారా గిరిజన ప్రాంతాల్లో నివసించే గర్భిణులకు డోలీ మోతల నుంచి విముక్తి కల్పించనున్నాం. రాష్ట్ర సరిహద్దు జిల్లాల్లో అటవీ ఏనుగుల బెడద నుంచి రక్షణ కల్పించేందుకు కర్ణాటక ప్రభుత్వ సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చాం." అని పవన్ చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అత్యంత కీలకమని, ఈ విషయంలో తరతమ బేధాలు లేకుండా ముందుకు వెళ్తామని శాసన సభ సాక్షిగా సీఎం అన్నారని గుర్తు చేశారు. తాను అదే మాట చెప్పానని, దానికి కట్టుబడి ముందుకు వెళ్తున్నామని తెలిపారు. 2047 నాటికి ఏపీని నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

> "శివతాండవం కావ్యం రచించిన కవి పుట్టపర్తి నారాయణాచార్యులు పుట్టిన నేల రాయలసీమ. తెలుగు భాష గౌరవం పెంచిన బళ్లారి రాఘవ లాంటి రంగస్థల ప్రముఖులు, విద్వాన్ విశ్వం, గజ్జల మల్లారెడ్డి లాంటి మహానుభావులు పుట్టిన నేల రాయలసీమ. కొందరు కవులు 'రుతువులెన్ని ఉన్నా మా రాళ్ల సీమకు ఒకటే రుతువు. అదే కరువు రుతువు. కాలాలు ఎన్నున్నా మాకు ఒక్కటే కాలం అదే.. ఎండా కాలం' అని వ్యాఖ్యానించారు. అయితే, ఆ పరిస్థితులను రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది."
> - ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



సభలో అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు సంధ్యారాణి, కేశవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా తదితరులు

అందరి జీవితాల్లో వెలుగులు నింపుతాం

మోదీ సహకారం.. బాబు అనుభవంతో రాష్ట్రం పురోభివృద్ధి

- వైసీపీ ధ్వంసం చేసిన రాష్ట్రాన్ని కూటమి నిర్మిస్తోంది
- 'సూపర్ సిక్స్' సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి



అనంతపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధితో పాటు అందరి జీవితాల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తోన్న సహకారం.. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్నాయని కొనియాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ధ్వంసం చేసిందని, తిరిగి కూటమి పాలనలో నిర్మించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. అనంతపురంలో బుధవారం నిర్వహించిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వ అవినీతి, అరాచకాలకు చెక్ పెట్టి ఎన్డీఏ కూటమిపై మీరు పెట్టుకున్ని నమ్మకం, విశ్వాసానికి ప్రతిరూపమే సూపర్ సిక్స్' అన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్నో సిక్స్‌లు కొట్టామని.. అభివృద్ధి, సంక్షేమంతో పాటు సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం డబులింజన్ సర్కార్ కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతికి, మన జీవనాడి పోలవరానికి వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తోన్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలు, ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రూ.9.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దాంతో 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతోన్న సంస్కరణల్లో భాగంగా రెండు శ్లాబుల జీఎస్టీతో రైతులు, మధ్య తరగతి, చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరుతోందన్నారు. స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేయాలని, మన చేనేతల ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఉత్తరాంధ్రలో స్టీల్ ప్లాంట్‌కు ఊతం మొదలు కొని రాయలసీమలో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటు వరకూ పరిశ్రమలకు డబులింజన్ సర్కారు ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఐక్యత వర్ధిల్లుతుందని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి, అరాచకాలతో పాటు అమ్మభాషను సైతం గత ప్రభుత్వం బతకనివ్వలేదని, మాతృ భాషను బతికించే ప్రయత్నం కూటమి చేస్తోందని తెలిపారు. రెండేళ్లలో పోలవరం నిర్మాణం పూర్తి చేయడం, అద్భుతమైన రాజధాని అమరావతిని నిర్మించడం, సీమకు జలాలు అందించడం కూటమి ప్రభుత్వ లక్ష్యాలని స్పష్టం చేశారు.

ఇటు వాన, అటు ఎండ

- రాయలసీమ, ఉత్తర కోస్తాలో వర్షాలు
- దక్షిణ కోస్తాలో పలుచోట్ల భానుడు భగభగ
- నేడు కోస్తాలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం పిడుగులతో వర్షాలు కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగింది. ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. మరోవైపు కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో బుధవారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 7.75, ఆళ్లగడ్డలో 6.72, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 6.1, ఎలమంచిలిలో 6, తూర్పుగోదావరి జిల్లా పైడిమెట్లలో 4.95, అనకాపల్లి జిల్లా చోడవరంలో 4.82 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దక్షిణ కోస్తాలో బాపట్ల నుంచి నెల్లూరు జిల్లా వరకూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. నెల్లూరు జిల్లా కావలిలో 39.8 డిగ్రీలు, నెల్లూరులో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరులో సెప్టెంబరు నెలకు సంబంధించి ఇదే ఆల్‌టైమ్ రికార్డుగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గురువారం ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

కలుషిత సెలైన్ కాటేసిందా!?

(మొదటి పేజీ తరువాయి)

జ్వర బాధితులందరూ మొదట ఆ ఆర్‌ఎంపీ దగ్గరే చికిత్స పొందినట్టు అధికారులు గుర్తించారు. వీరికి సదరు ఆర్‌ఎంపీ కలుషిత సెలైన్లు ఎక్కించడంతో పాటు శక్తివంతమైన యాంటీబయాటిక్ మందులు వాడినట్లు విచారణలో తేలింది. ఆర్‌ఎంపీ దగ్గర చికిత్స పొందిన తర్వాతే రోగుల ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించి ఆస్పత్రుల్లో చేరినట్లు పలు బాధిత కుటుంబ సభ్యులు వైద్య నిపుణులకు తెలిపారు. బాధితుల్లో పలువురు మృతిచెందడంతో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే విజయలక్ష్మి బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పలు శక్తివంతమైన యాంటీబయాటిక్ మందులు స్వాధీనం చేసుకుని క్లినిక్‌ను సీజ్ చేశారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తామని ఆమె ప్రకటించారు. ఆర్‌ఎంపీలు తమ పరిధికి మించి చికిత్సలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ఆర్‌ఎంపీని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. 2023 మేలో చెన్నైలోని ఓ దంత వైద్యుడి క్లినిక్‌లోనూ ఇదే తరహాలో కలుషిత సెలైన్ ద్రావణంతో పలువురు ఇన్‌ఫెక్షన్లు బారిన పడగా.. వారిలో ఎనిమిది మంది మృతి చెందారని వైద్యులు తెలిపారు. వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ నిపుణుల బృందం చేసిన దర్యాప్తులో ఆ ఎనిమిది మంది న్యూరో మెలియోయిడోసిస్ (మెదడుకు సోకే ఇన్‌ఫెక్షన్)తో మృతిచెందినట్లు నిర్ధారించారు. పంటి నుంచి మెదడుకు ఇన్‌ఫెక్షన్ త్వరగా సోకడమే ఇందుకు కారణమని గుర్తించారు. దీంతో తురకపాలెం మరణాలకు కలుషిత సెలైన్ కారణం కావొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు..

తురకపాలెంలో వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) వైద్య బృందం మంగళవారం స్థానిక పరిస్థితులను పరిశీలించింది. అనంతరం ఈ బృందం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి, వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంతోపాటు తొలుత గుంటూరులో మెలియోయిడోసిస్ ఇన్‌ఫెక్షన్లను గుర్తించిన ప్రైవేటు వైద్యుడు కల్యాణ్ చక్రవర్తిని కలిసి వివరాలు సేకరించారు. ఈ బృందంలో ఎన్‌సీడీసీకి చెందిన డాక్టర్ హేమలత, ఆరోగ్య శాఖ జేడీ డాక్టర్ మల్లీశ్వరి, స్టేట్ నోడల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభ ప్రాంగణం నిండిపోవడంతో బయట నుంచే నాయకుల ప్రసంగాలను వింటున్న జనవాహిని

సూపర్ సిక్స్.. గ్రాండ్ సక్సెస్

సుపరిపాలనకు ప్రజామోదం.. అంచనాలకు మించి పోటెత్తిన జనం

- సభ ముగుస్తున్నా వస్తూనే ఉన్న వైనం
- ఆద్యంతం కేరింతలు, చప్పట్లతో మద్దతు
- రాష్ట్రాభివృద్ధి, సంక్షేమంపైనే బాబు, పవన్, మాధవ్ ప్రసంగాలు
- లోకేశ్, బాలకృష్ణ లేని లోటు స్పష్టం

అనంతపురం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి పార్టీలు అనంతపురం జిల్లా కేంద్రంలో సమష్టిగా నిర్వహించిన 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయింది. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను.. ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలోనే అమలు చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఈ సభ జరిపారు. దీనికి అంచనాలకు మించి జనం పోటెత్తారు. సభ ప్రాంగణమే కాకుండా.. పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఎటుచూసినా టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు రెపరెపలాడాయి. వేడుకల నేపథ్యంలో అనంతపురం అంతర్గత రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అందరూ నగర శివారులోని సభ వైపు ఉదయం 11 గంటలకే వెళ్లిపోయారు. ఈ సభకు 3.50 లక్షల మంది వస్తారని అంచనా వేసి, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. కానీ 50 ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో చాలా మంది బయటే ఉండిపోవలసి వచ్చింది. సాయంత్రం సభ ముగిసే సమయంలో కూడా వేర్వేరు ప్రాంతాల నుంచి బస్సుల్లో జనం అక్కడకు చేరుకుంటూనే ఉన్నారు. పెద్దఎత్తున ప్రజలు తరలిరావడం తమ ప్రభుత్వ సుపరిపాలనకు అద్దం పట్టిందని.. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రభుత్వానికి ప్రజామోదం లభించిందని కూటమి నాయకులు వ్యాఖ్యానించారు. భానుడి సెగలను సైతం లెక్కచేయకుండా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూర్చున్న చోటే ఉండిపోయారు. విజయోత్సవ సభను క్రమశిక్షణతో విజయవంతం చేయడం ప్రత్యేకత. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఒకేసారి వేదికపైకి వచ్చారు. ఈ ముగ్గురి ప్రసంగాలు ఆసాంతం.. సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపైనే సాగాయి. రాజకీయ విమర్శలు చేసినప్పటికీ.. అవి సహేతుకమైనవేనని ప్రజలు చర్చించుకున్నారు. జనం కేరింతలు, చప్పట్లు, జెండాల రెపరెపలతో వారి ప్రసంగాలకు మద్దతు తెలిపారు. ఈ సభకు యువగళం సారథి, విద్యా మంత్రి లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హాజరవుతారని అందరూ భావించారు. పెద్దఎత్తున వారి కటౌట్లు, ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశారు. స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. అయితే సభ ప్రారంభానికి కొన్ని గంటల ముందు లోకేశ్ రావడం లేదనే సమాచారం అందింది. ఇది టీడీపీ శ్రేణులు, నేతలను ఒకింత నిరాశకు గురిచేసింది. అనారోగ్యంతో బాలకృష్ణ కూడా సభకు రాలేదు. ఈ ఇద్దరు లేని లోటు స్పష్టంగా కనిపించింది. లోకేశ్ రాకపోవడానికి ప్రధాన కారణాన్ని సీఎం వేదిక పైనుంచే తెలియజేశారు. నేపాల్లో జరుగుతున్న అల్లర్ల కారణంగా అక్కడ చిక్కుకుపోయిన తెలుగువారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చే గురుతర బాధ్యతను లోకేశ్ నిర్వర్తిస్తున్నారని తెలిపారు. బాలకృష్ణ అనారోగ్యం కారణంగా రాలేదని చెప్పారు.



సూపర్‌హిట్ సభకు వచ్చి లారీలపైనే జనం



సూపర్‌హిట్ సభలో మహిళల కేరింతలు

ఏరోస్పేస్ హబ్‌గా అనంత: పల్లా



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలతో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా హార్టికల్చర్ హబ్‌గా మారిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గుర్తుచేశారు. చంద్రబాబు నాయకత్వంలో కియ మోటార్స్ రాకతో ఈ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గానూ అభివృద్ధి చెందిందన్నారు. అనంతపురం త్వరలో ఏరోస్పేస్ హబ్‌గా మారబోతోందని తెలిపారు. తమ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి, సంపద సృష్టిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తోందన్నారు.జగన్ ఐదేళ్ల ఫేక్‌ప్రచారంతో మూడు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి కాలం గడిపారని విమర్శించారు. విశాఖ ప్లాంట్ ప్రైవేటీకరణ, అమరావతిలో వరదలు, రాయలసీమలో రైతుల ఆత్మహత్యలంటూ అబద్ధపు ప్రచారాలు చేశారని దుయ్యబట్టారు. ప్రజల జీవనప్రమాణాలను పెంచుతూ.. లోకేశ్ యువగళం ఆలోచనలతో, పవన్ కల్యాణ్ నిస్వార్థ ఆలోచనతో, బీజేపీ సహకారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు.

ప్రతి ఒక్కరికీ వార్నింగ్ ఇస్తున్నా!



మెడికల్ కాలేజీల టెండర్లలో పాల్గొనొద్దు.. మేమొస్తే వాటిని రద్దు చేస్తాం

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉండగా పెట్టుబడిదారులను బెదరగొట్టి, రివర్స్ టెండరింగ్‌లతో రాష్ట్రాన్ని తిరోగమనం పట్టించిన వైఎస్ జగన్.. ఇప్పుడూ అవే 'రివర్స్' బెదిరింపులకు దిగుతున్నారు. పది మెడికల్ కాలేజీలను జగన్ పునాదులకే పరిమితం చేసి, అదే గొప్పగా డప్పుకొట్టుకుంటున్న సంగతి తెలిసిందే. వాటిని పీపీపీ విధానంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై ఆయన అక్కసు వెళ్లగక్కారు. ఈ విధానంపై న్యాయ పోరాటం చేస్తామని, ప్రజా పోరాటం చేస్తామనీ హెచ్చరించవచ్చు. కానీ.. "ఒకటే ఒకటి చెప్తావున్నా. ఎవరైనా టెండర్లలో పార్టిసిపేట్ చేయండి. ఎవరైనా రాండి. కానీ, ప్రతి ఒక్కరికీ వార్నింగ్ ఇస్తున్నా. రేప్పొద్దున్న మేమొచ్చిన తర్వాత రద్దు చేస్తాం. మళ్లీ వెనక్కి తీసుకుంటాం. ఇది మాత్రం కచ్చితంగా అందరూ గుర్తు పెట్టుకోవాలని చెప్తావున్నా" అంటూ పెట్టుబడిదారులను హెచ్చరించారు. మూడేళ్లలోపే ఆ మెడికల్ కాలేజీలను పూర్తిచేసి... విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఇప్పుడు జగన్ ఈ 'రివర్స్' హెచ్చరికలు చేయడం రాష్ట్రానికి ద్రోహం తలపెట్టడమేనని, ఇది ఆయన విధ్వంసకర మనస్తత్వానికి అద్దం పడుతోందని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. బుధవారం అనంతపురంలో కూటమి నేతలు 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' సభను నిర్వహించగా.. అదే సమయంలో వైఎస్ జగన్ తాడేపల్లిలో తాను ఎంచుకున్న మీడియాతో రెండు గంటలకుపైగా మాట్లాడారు. తనకు అలవాటైన శైలిలో వక్రీకరణలు, అర్ధసత్యాలతో ప్రభుత్వంపై బురదజల్లారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఏదైనా బావి చూసుకుని దూకి చావాలి" అని దూషణలకు దిగారు. "చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు సిగ్గుండాలి. 'సూపర్ సిక్స్' అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. అట్టర్‌ఫ్లాప్ అయిన సినిమాకు విజయోత్సవం చేస్తున్నట్లుగా అనంతపురంలో సభ పెట్టారు. చంద్రబాబు.. కళ్లార్పకుండా అబద్ధాలు ఆడగల సమర్థుడు. ఇలాంటి మోసాలు చేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎంలు ఏదైనా బావి చూసుకుని అందులో దూకి చావాలి." అని వ్యాఖ్యానించారు. "సీఎం నియోజకవర్గం కుప్పంలోను, మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లా శ్రీకాకుళంలోనూ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారిద్దరూ ఎక్కడైనా బావి చూసుకుని దూకాల"ని మళ్లీ అదే మాట అన్నారు.

అసెంబ్లీకి రాను..

వైసీపీకి ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నా ప్రతిపక్ష నేతగా తననే గుర్తించాలని జగన్ డిమాండ్ చేశారు. "అసలు ప్రతిపక్షమే లేదంటున్నారు. కాబట్టి, అసెంబ్లీ జరిగే సమయంలో..నేను మీడియా సమావేశాలు నిర్వహించి ప్రజాసమస్యలను బయటే లేవనెత్తుతా" అని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాబోనని స్పష్టం చేశారు. "ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ క్రాస్ ఓటు చేసిందని అంటున్నారు.. దానికి రుజువు ఉందా?. ఇలాంటి ప్రశ్నలు ఎందుకబ్బా.. అడిగేది?." అని మీడియా ప్రతినిధిపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజన్ అంటే నాదే!

విజన్ అంటే తనదేనని జగన్ అన్నారు. మీడియాకు మ్యాప్ చూపిస్తూ... 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చామన్నారు. వాటిలో ఐదు మాత్రమే నడుస్తున్నాయని... తక్కినవి పునాదులకే పరిమితమయ్యాయనే విషయాన్ని మాత్రం దాచిపెట్టారు. "అలాంటి మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్న చంద్రబాబు మనిషా?. రాక్షసుడా?." అని జగన్ ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల భద్రతకు పారామిలిటరీ బలగాలను వినియోగించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లోనూ వైసీపీని అధికారంలోకి రానివ్వబోమన్నపవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ... "2029లో ఏం జరుగుతుందో పవన్ చూసేదేముంది?. పైన దేవుడు, కింద ప్రజల ఆశీర్వాదం ఉండాలి." అని అన్నారు.

గతం గుర్తులేదా...

- నొప్పి తెలిస్తేనే హక్కులు గుర్తొస్తాయా?
- కేసులు పడ్డాకే పత్రికాస్వేచ్ఛ అవసరమైందా?
- మీ హయాంలో రాష్ట్రంలో సకలం బంద్
- ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం..రాజద్రోహం
- 'నచ్చని' మీడియాపై లెక్కలేనన్ని కేసులు
- 'ఆంధ్రజ్యోతి'పై ఐదేళ్లూ తీవ్ర వేధింపులే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మాజీ సీఎం జగన్ రూటే సపరేటు! ఆనాడు తాను పెట్టిన వేధింపులను రాజన్న రాజ్యం వరంలా జనం భరించాలట!. అదే తనకు బాధ కలిగితే ప్రపంచం అంతా కన్నీరు కార్చాలట!. జగన్ పార్టీ నేతలు, రోత మీడియాపై కేసులు పడితే యావత్ ప్రజానీకం రోడ్లమీదకొచ్చి అండగా నిలవాలట! తన ఐదేళ్ల పాలనలో తనకు నచ్చని మీడియాపై సాగించిన అరాచకాలు, నిర్బంధాలు, దురాగతాలను 'తెలివి'గా ఆయన మరిచిపోయారు. తన రోతపత్రిక ఎడిటర్‌పై కేసులు పెడుతున్నారని, కక్షసాధింపునకు పాల్పడుతున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని గొంతు చించుకుంటున్నారు. "పత్రికలో వచ్చే వార్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటే ఖండించవచ్చు లేదా పరువునష్టం దావా వేయవచ్చు. అలా కాకుండా కేసులు పెడుతున్నారు" అంటూ జగన్ వాపోతున్నారు. ఇవన్నీ అనడానికి ఆయనకు ఎలా ఉండోగానీ, వింటున్న ప్రజలు మాత్రం విస్తుపోతున్నారు. నాడు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సహా పలు చానళ్ల కట్టడికి ప్రయత్నించిన జగనేనా ఇప్పుడిలా మాట్లాడుతోందని మీడియా వర్గాలు నివ్వెరపోతున్నాయి. 'నొప్పి తెలిస్తేనే హక్కులు గుర్తొస్తాయా?' అని నిలదీస్తున్నాయి.

మీడియాపై జగన్ జులుం: మీడియా అంటే తన రోతపత్రిక, చానల్ అన్నట్టు జగన్ ఐదేళ్ల పాలన సాగింది. తప్పులు ఎత్తిచూపే మీడియాపై జులుం ప్రదర్శించారు. ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన నాడే మీడియాపై కన్నెర్ర చేశారు. పదవీప్రమాణ వేదిక నుంచే 'ఆంధ్రజ్యోతి సంగతి చూస్తా'నంటూ హెచ్చరించారు. తన ప్రభుత్వ చర్యలను ప్రశ్నించడం, ప్రజల తరపున వాస్తవాలను ప్రచురించడమే నేరం అన్నట్టు 'ఆంధ్రజ్యోతి'పై కక్ష సాధింపులకు పాల్పడ్డారు. మీడియా గొంతు నొక్కడానికి కేసులదండం తీసుకొచ్చారు. దీనికోసం ప్రతీ శాఖలో ఓ నోడల్ అధికారిని నియమించారు. ఏ శాఖపై మీడియాలో వ్యతిరేక వార్త వస్తే ఆ శాఖ నోడల్ అధికారి సంబంధిత మీడియాపై లీగల్ నోటీసులు ఇచ్చి కేసులు పెట్టించడం, ఇంకా పరువునష్టం దావాలు వేయించడం చేశారు. ఇలా మీడియాపై లెక్కలేనన్ని కేసులు పెట్టారు.

ఆక్యుపెన్సీ తగ్గిందని రాసినందుకు 'ఆంధ్రజ్యోతి'పై ఆనాడు కేసు

కరోనా సమయంలో ప్రయాణికుల రద్దీ లేక ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ తగ్గిందని వార్తరాసినందుకు జగన్ హయాంలో 'ఆంధ్రజ్యోతి'పై కేసు పెట్టారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి', 'టీవీ5' తదితర 'నచ్చని' న్యూస్‌చానెళ్లపై అప్రకటిత నిషేధం అమలైంది. కేబుల్ ఆపరేటర్లను అడ్డుపెట్టుకుని ఈ చానళ్ల ప్రసారాలను నియంత్రించారు. చివరకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేసి గెలిచింది. అప్పుడెప్పుడూ జగన్‌కు మీడియాను తాను వేధిస్తున్నట్లుగా గుర్తుకురాలేదు. సామాజిక మాధ్యమాల్లో జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై ఉక్కుపాదం మోపారు. జగన్ హయాంలో విశాఖ గ్యాస్ లీకేజీ ఘటన జరిగింది. ఆ బాధితులకు న్యాయం చేయాలంటూ 75 ఏళ్ల రంగనాయకమ్మ ఫేస్‌బుక్‌లో పోస్టుపెట్టారు. అంతే....ఆమెకు సీఐడీ నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచింది. సీనియర్ జర్నలిస్టు అంకబాబు సోషల్‌మీడియాలో ఓ పోస్టును పార్వార్డ్ చేశారని అరెస్టుచేశారు. కరోనాలో మాస్కులు అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌కు ఏ పరిస్థితి తీసుకొచ్చారో రాష్ట్ర ప్రజలకు ఇంకా మరచిపోలేదు. తన ఐదేళ్ల పాలనలో ఇలాంటి దుర్మార్గాలెన్నో జరిగినప్పుడు హక్కులు,స్వేచ్ఛల గురించి మాట్లాడని జగన్ ఇప్పుడు కొత్త రాగం అందుకున్నారు.

మద్యం కేసులో నిందితుడు పైలా దిలీప్‌కు హైకోర్టు నోటీసులు



- సీఐడీ పిటిషన్‌పై విచారణ 15కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడు, రాజ్ కసిరెడ్డి అనుచరుడు పైలా దిలీప్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. దిలీప్‌కు బెయిల్ మంజూరు చేస్తూ గత నెల 28న ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ బుధవారం విచారణకు రాగా... కేసు మొదటిసారి విచారణకు వచ్చిందని న్యాయస్థానం గుర్తు చేసింది. దిలీప్‌కు నోటీసులు జారీ చేసి అతని వాదనలు కూడా వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తదుపరి విచారణను సెప్టెంబరు 15కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

చెవిరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత



విజయవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టేసింది. తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కొద్ది రోజుల కిందట చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం తీర్పును వెలువరించారు.

తిరుపతి 'ఓట్ల' వ్యవహారంలో ఐఏఎస్ గిరిశాకు ఉపశమనం

- తదుపరి చర్యలు నిలిపివేత.. ఆయన పాత్ర లేదని క్లీన్ చిట్

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం ఉప ఎన్నిక సమయంలో దొంగ ఓటరు కార్డులు సృష్టించారన్న ఆరోపణలతో సస్పెండైన 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారి పీఎస్ గిరిశాకు ఉపశమనం లభించింది. ఈ వ్యవహారంలో గిరిశాకు ఎలాంటి పాత్ర లేదని ప్రభుత్వానికి విచారణాధికారి నివేదిక అందించారు. దీంతో ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యలను నిలిపివేసింది. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ ఎలక్ట్రోల్ ఆఫీసర్ ద్వారా కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపారు. దొంగ ఓటరు కార్డుల వ్యవహారం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. సాధారణ ఎన్నికలకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించింది. సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. చిత్తూరు కలెక్టర్‌గా ఉన్న గిరిశాను విధుల నుంచి సస్పెండ్ చేసింది. ఆయన తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ఈ వ్యవహారం జరిగిందని ఈసీ పేర్కొంది. ప్రభుత్వం ఎస్.సురేశ్ కుమార్‌ను విచారణాధికారిగా నియమించింది. ఆయన క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. దొంగ ఓటరు కార్డుల వ్యవహారంలో గిరిశా పాత్ర లేదని తేలడంతో ప్రభుత్వం తదుపరి చర్యలను నిలిపివేసింది.

రహదారులకు రూ. 500 కోట్లు

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు (జీఓ-473) జారీ చేశారు. ఇవి రెగ్యులర్ బడ్జెట్‌కు అదనంగా ఇస్తోన్న నిధులు. ఇందులో రూ.200 కోట్లను రాష్ట్ర ప్రధాన రహదారులు(స్టేట్ హైవేలు), రూ.300 కోట్లను జిల్లా ప్రధాన రహదారు(ఎండీఆర్)ల విభాగానికి కేటాయించారు. ఈ నిధులతో ప్రతిపాదిత ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ మేరకు ఎండీఆర్ చీఫ్ ఇంజనీర్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

నాకేం తెలీదు.. సిబ్బందే అంతా చేశారు!

- ఏసీబీ కస్టడీలో సంజయ్ బుకాయింపు
- ఆధారాలు చూపితే మౌనం.. నేడు మరింత లోతుగా విచారణ

అమరావతి, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ఆ వర్గాలకు అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం ఇచ్చిన నిధులను స్వాహా చేసిన కేసులో సీఐడీ మాజీ ఏడీజీ సంజయ్ ఏసీబీ విచారణలో పాతపాటే పాడినట్లు తెలిసింది. అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీలు ఆన్‌లైన్‌లో జారీకి మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, ట్యాబ్‌ల కొనుగోళ్లలో అవినీతికి పాల్పడినట్లు తేలిన వ్యవహారంలోనూ ఆయన నోరు విప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారుల్లో ఆయన ఒకరు. దళితులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించే పేరుతో అవగాహన సదస్సులు నిర్వహించకుండానే రూ.1.19 కోట్లు క్రిత్వాప్ టెక్నాలజీస్ అనే సంస్థకు చెల్లించేశారు. మరోవైపు అగ్నిమాపక శాఖలో 'అగ్ని-ఎన్‌వోసీ' వెబ్‌సైట్ రూపకల్పన, యాప్ అభివృద్ధి పేరుతో సౌత్రిక టెక్నాలజీస్‌కు రూ.2.29కోట్ల ప్రాజెక్టులు కట్టబెట్టి, పనులు జరగకుండానే రూ.59.93 లక్షలు చెల్లించేశారు. ఈ రెండు అవినీతి భాగోతాలపై కేసు నమోదు చేసి కోర్టు అనుమతితో సంజయ్‌ని కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఇటీవల మూడు రోజులు విచారించినా అంతా సిబ్బందే చేశారని సంజయ్ చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించాలంటూ సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు వారిచ్చిన వాంగ్మూలాలు ముందుంచడంతో నీళ్లు నమిలినట్లు తెలిసింది. విచారణకు సహకరించకపోవడంతో బుధవారం మరోమారు కస్టడీకి తీసుకుని ప్రశ్నించినా పాత పాటే పాడుతున్నారు. ఆధారాలు చూపించి ప్రశ్నించగా మౌనం వహించినట్లు తెలిసింది. గురువారం మరోసారి ప్రశ్నించే వీలుంది.



Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.